


# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక





ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 132 బుధవారం 31 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# ముక్కోటి శోభ

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దర్శనాలు

భారీగా తరలివచ్చిన ప్రముఖులు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనం

వివరాలు 2లో


తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు.



2

## తిరుమలలో ఆధ్యాత్మిక పరిమళాలు

స్వర్ణరథంపై ఊరేగిన మలయప్పస్వామి



## బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సీఎం

కేంద్రహోంమంత్రి అమిత్ షా

.. వివరాలు 3లో



## భూములు ఇవ్వడం వల్లే బెంగాల్‌కు ప్రాజెక్టులు

అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ

.. వివరాలు 3లో




## బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియా మృతి

సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

నేడు అంత్యక్రియలకు జై శంకర్ హాజరు

.. వివరాలు 3లో

# ఇక రాష్ట్రంలో 28 జిల్లాలు



## కొత్త జిల్లాల ఏర్పాటుపై నోటిఫికేషన్ జారీ


కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటు

మొత్తం రెవెన్యూ డివిజన్లు 82

మొత్తం మండలాలు 681..

తక్షణం అమల్లోకి

కొత్త జిల్లాలతో 28కి పెరిగిన జిల్లాల సంఖ్య



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖచిత్రం మరోసారి మారుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియ కొలిక్కి వచ్చింది. నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందిన వెంటనే, ప్రభుత్వం ఈరోజు (మంగళవారం) కొత్త జిల్లాల ఏర్పాటుపై అధికారిక తుది నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా నిర్ణయంతో రాష్ట్రంలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలు ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్రంలోని మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 28కి చేరింది.

**అమరావతి :** రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇక

మిగతా 2 లో

## కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి

శంకర్ గుప్తం మురుగుకాల్వ పూడికతీతకు శంకుస్థాపన

రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో పనులకు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం



**అంబేద్కర్ కోనసీమ :** కోనసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కేసనపల్లి తుఫాన్ సెంటర్‌లో శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాలువకు సంబంధించిన ఎనిమిది కిలోమీటర్లు పొడవునా పూడికతీత పనులు, 14. 5 కిలోమీటర్ల పొడవునా గట్ల పటిష్టత పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ

మిగతా 2 లో

## బంగ్లాదేశ్‌లో ఆగని దాడులు




మరో హిందువు దారుణ హత్య

3

## జగన్ హయాంలో దెబ్బతిన్న ఇరిగేషన్ రంగం



శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ మైలురాయి

కొబ్బరి రైతులకు పెద్ద ఊరటనిచ్చే ప్రయత్నం

మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

**అమరావతి :** జగన్ హయాంలో ఇరిగేషన్ రంగం చాలా నష్టపోయిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. 2017 నుంచి 2018 వరకు గత తెలుగుదేశం పాలనలో జరిగిన డ్రెడ్జింగ్ పనులు మినహా, గత

మిగతా 2 లో

### జగన్ ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్

విలాసం కోసం రుషికొండపై ప్యాలెస్

రూ.400 కోట్ల ప్రజల సొమ్ము దుబారా

మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

.. వివరాలు 2లో



## నియంత పాలనకు ఇంతకుమించి నిదర్శనం ఉంటుందా?

ఏపీలో రాజకీయ వేధింపులు హద్దులు దాటాయన్న సజ్జల

పార్టీ లీగల్ సెల్ నేతలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహణ

చంద్రబాబు, లోకేశ్ బరితెగించి వ్యవహరిస్తున్నారన్న సజ్జల

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేధింపులు మితిమీరి పోతున్నాయని వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆయన

మిగతా 2 లో

## గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్

రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్ దక్కింది. గ్రూప్-2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. కాగా, 2023లో విడుదలైన గ్రూప్-2

మిగతా 2 లో

# ముక్కోటి శోభ



తిరుమల : తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణేళిష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.



## తిరుపతి ఆలయాల్లో భక్తుల రద్దీ

ఏపీ వ్యాప్తంగా పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారాలు తెరుచుకున్నాయి. వేకువజామునే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. అటు తిరుమలలోనూ గత అర్ధరాత్రి నుంచే వైకుంఠ ద్వారాలు తెరుచుకోగా.. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక తిరుపతిలోని శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది. అర్ధారాత్రి 1:35 గంటలకు ఉత్తర ద్వారాలు తెరుచుకున్నాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో క్యూలైన్లు అన్ని వైపులా భక్తులతో కిక్కిరిసిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మార్మోగింది. అదే విధంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## తిరుమలలో ఆధ్యాత్మిక పరిమళాలు

### స్వర్ణరథంపై ఊరేగిన మలయప్పస్వామి

**తిరుమల :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తుల కిటకిట, విఐపిల రాకతో తిరుమల సందడిగా మారింది. కుసుమాల సువాసనలు, పరిమళాలతో అంతగా శోభాయమానంగా ఉంది. పూల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. దీనికితోడు గోవింద నామస్మరణాలతో ఆధ్మాత్మికత ఉట్టిపడుతోంది. స్వామి దర్శనం కాకున్నా మాడవీధుల్లో భక్తులు సందడిగా కనిపించారు. ఈ క్రమంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు. దీంతో స్వర్ణరథం వద్ద కోలాటాలు, భజనలు, హారతలు ఆకట్టుకున్నాయి. మరోవైపు ఉత్తర ద్వార దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు. దీంతో కొండపై రద్దీ నెలకొంది.

## కుటుంబ సమేతంగా తిరుమలకు రేవంత్ రెడ్డి

### శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, బిడ్డా అల్లుడు, మనవడితో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

# కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి

మొదటి పేజీ తరువాయి

జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఇటీవల రాజోలులో తన పర్యటన సందర్భంగా 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. 35 రోజుల్లోపే ఈ సమస్యకు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ క్రమంలో అధికారులకు పవన్ కీలక సూచనలు చేశారు. రాజోలు నియోజకవర్గ రైతులకు ఐదేళ్లుగా దుఃదాయనిగా మారిన శంకర్ గుప్తం మేజర్ డ్రైనేజ్ సమస్యను సుబ్రహ్మణ్య షష్టి రోజున గుర్తించామని తెలిపారు. కేవలం 34 రోజుల కాలవ్యవధిలో శాశ్వత పరిష్కారం దిశగా ముక్కోటి ఏకాదశిన పనులు ప్రారంభించామని వెల్లడించారు. ఈ పనులకు రూ.20.62 కోట్లు కేటాయించామని అన్నారు. శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాల్వతో వరి, కొబ్బరి చెట్లను రైతులు కోల్పోయారని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు వివరించారు. కేవలం 34 రోజుల్లోనే ఈ పనుల నిర్వాహణకు నిధులు కేటాయించామని చెప్పుకొచ్చారు. కొబ్బరి చెట్లకు నష్టం కలుగకుండా సంరక్షణ చర్యలు చేపడతామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.4 వేల కోట్లతో పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకీకరిస్తామని తెలిపారు. కోనసీమ ప్రాంతనీలో కోకో బోర్డు ఏర్పాటు చేయడానికి కేందప్రభుత్వంతో సంప్రదిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# జగన్ ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్

### విలాసం కోసం రుషికొండపై ప్యాలెస్

### రూ.400 కోట్ల ప్రజల సొమ్ము దుబరా

### మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర



**ఒంగోలు :** జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ఓ దగాకోరు అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం, ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారని మండిపడ్డారు. దీనికి జగన్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన అహంభావి అన్నారు. రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామని.... లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# జగన్ హయాంలో దెబ్బతిన్న ఇరిగేషన్ రంగం

మొదటి పేజీ తరువాయి

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి పని కూడా జరుగలేదని విమర్శించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నిమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలసి మంత్రి నిమ్మల వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... డ్రైన్ ద్వారా సముద్రపు నీరు రావడంతో వేలాది ఎకరాల్లో రైతులు కొబ్బరి పంట నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, శంకరగుప్తం డ్రైన్ సమస్యను అన్నదాతలు, నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారని ప్రస్తావించారు. ఇరిగేషన్ నిపుణులతో ప్రత్యక్షంగా తాను పరిశీలించి, మరో రెండుసార్లు సమీక్షలు జరిపి రూ.20.77 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ కృషితో ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల అయ్యాయని తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. ÷ళిడు పనులు ప్రారంభించామని అన్నారు. పవన్ కల్యాణ్ హామీని నెరవేర్చేలా, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గోదావరి జిల్లాల శాశ్వత ముంపు పరిష్కారానికి రూ.13.4 కోట్లతో లైడార్ సర్వే నిర్వహిస్తున్నామని వెల్లడించారు. లైడార్ సర్వే అనంతరం డీపీఆర్ తయారు చేసి, శాశ్వతముంపు నివారణకు సంబంధించిన ప్రతిపాదనలు ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందజేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్

మొదటి పేజీ తరువాయి

నోటిఫికేషన్‌పై రిజర్వేషన్ల విధానాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని కోరుతూ అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, పాత నోటిఫికేషన్‌కు బదులు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు కోరారు. రిజర్వేషన్ల పాయింట్లను సవాల్ చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించింది.

# నియంత పాలనకు ఇంతకుమించి నిదర్శనం ఉంటుందా?

మొదటి పేజీ తరువాయి



పార్టీ లీగల్ సెల్ నేతలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ, వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడాన్ని ఓర్వలేక వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నియంతృత్వ పాలనకు ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్ లు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వానికి వంత పాడుతున్న పోలీసుల చర్యలను ధీటుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. చట్టాన్ని అతిక్రమిస్తున్న పోలీసులపై ప్రైవేట్ కేసులు వేద్దామని ఆయన అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై పోరాటం చేస్తూ ముందుకెళ్తున్న పార్టీ లీగల్ సెల్‌ను ఆయన అభినందించారు. చంద్రబాబు, బాలకృష్ణ ఫ్లెక్సీలకు పొట్టేళ్ల తలలతో హారం వేసిన ఘటనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇటీవల ఒకరిపై రాజద్రోహం కేసు పెట్టారని, దీనికంటే దారుణం మరొకటి ఉండదని సజ్జల అన్నారు. హక్కుల కోసం పోరాడినందుకు కమ్యూనిస్ట్ నాయకుడిపై పీడీ యాక్ట్ కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్ మరింత పట్టుదలతో పార్టీని నడిపిస్తూ, ప్రతి ప్రజా సమస్యపై ముందుండి పోరాడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వ దమనకాండను తిప్పికొట్టేందుకు వైసీపీ సైన్యం పోరాట పటిమతో ముందుకు సాగుతుందని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# ఇక రాష్ట్రంలో 28 జిల్లాలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి మారనుంది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నదాని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరుల సేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్ని విధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సమగ్ర సేవలు, వేగవంతమైన పరిపాలన, వనరుల సమర్థవంతమైన వినియోగం అందించగలిగే అవకాశాలు పెరుగుతాయని ఏపీ సర్కార్ అనుకుంటుంది. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మార్చారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలక మార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం, పెనుగొండను వాసవీ పెనుగొడుగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాల సరిహద్దులను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది.

# శ్రీశైలంలో ఏకాదశి దర్శనాలు

**శ్రీశైలం :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలి వచ్చి శ్రీశైలం మల్లన్నను దర్శించుకుంటున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు కూడా స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పాలకమండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయ పాలకమండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. చెంచు గిరిజనులకు ఉచితంగా స్పర్శ దర్శనం అందించే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించింది. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రత్యేక దర్శనంలో భాగంగా సుమారు 100 మంది చెంచు గిరిజనులు మల్లికార్జునస్వామిని స్పర్శ దర్శనం చేసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా చెంచు గిరిజనులతో విడదీయరాని అనుబంధం ఉంది. శ్రీశైలం అరణ్య ప్రాంతంలో నివసించే చెంచులు ఆదికాలం నుంచి ఈ క్షేత్రానికి సంరక్షకులుగా, సేవకులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. వారి సంప్రదాయాలు, ఆచారాలకు గౌరవంగా ఆలయ పాలక మండలి ఈ నిర్ణయం తీసుకోవడం భక్తుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు మాట్లాడారు. చెంచు గిరిజనులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలలో ఒకరోజు వారికి ఉచితంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆలయ మొదటి పాలక మండలి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో చెంచు గిరిజనులు ఈ అవకాశాన్ని దేవుడి వరంగా భావిస్తూ, దేవస్థానం పాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇంతకాలంగా ఉన్న కోరిక నెరవేరిందని భావోద్వేగంగా స్పందించారు. శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో చెంచు గిరిజనులకు ఉచిత స్పర్శ దర్శనం ప్రారంభం కావడం ఒక చారిత్రక నిర్ణయంగా నిలిచింది. ఇది సంప్రదాయానికి, సమానత్వానికి, గిరిజన సంక్షేమానికి ప్రతీకగా నిలిచింది. భవిష్యత్తులో ఆలయ పాలక మండలి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి

**విజయవాడ :** దుర్గమ్మ వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. మంగళవారం ఉదయం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువదీరిన దుర్గమ్మ వారిని డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదంతోపాటు చిత్ర పటాన్ని ఆయనకు ఆలయ అధికారులు అందజేశారు. ఆ తర్వాత వేద పండితులు ఆయన్ని ఆశీర్వదించారు. ఆలయం బయట అనిల్ రావిపూడి విలేకర్లతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండగకి మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వర ప్రసాద్ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. ఈ సినిమా ఇప్పటికే పూర్తయిందని.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుందని వివరించారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ పాడిన పాట.. ఈ చిత్రానికే హైలెట్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. తాను గుంటూరులో చదివిన కాలేజీలో ఒక సాంగ్ రిలీజ్ చేయబోతున్నామని వివరించారు. ఈ చిత్రం బాగా వచ్చిందన్నారు. ప్రజలు ఈ చిత్రాన్ని ఆశీర్వాదిస్తారని ఆశిస్తున్నట్లు డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు.

# చంద్రబాబు చరిత్ర రాయాలంటే పేజీలు సరిపోవు

## చంద్రబాబుపై పుస్తకావిష్కరణలో ఎంపి కేశినేని

**విజయవాడ :** సీఎం చంద్రబాబు నాయుడు చరిత్ర రాయాలంటే ఎన్ని పేజీలు అయినా సరిపోవని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన చంద్రబాబు పేరుతో బాయన శేఖర్ బాబు రాసిన పుస్తకాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబు చేసిన సేవలను గుర్తు చేసేలా రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించినందుకు ఆనందంగా ఉందన్నారు. సీఎంగా 15 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో కూడా ఆయన పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఏపీ, విభజన ఏపీ అబివృద్ధిలో చంద్రబాబు ప్రస్తావన లేకుండా చరిత్ర లేదన్నారు. ఎంత కోపం ఉన్నా.. ఎంత పని ఒత్తిడి ఉన్నా.. ముఖంలో కనిపించకుండా పని చేసే ఏకైక నేత చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబు జీవితమే పెద్ద చరిత్ర అని.. దేశంలోనే ఆయనది ప్రత్యేక స్థానమని చెప్పుకొచ్చారు. దేశంలో నదుల అనుసంధానం చేయాలని అనేక మంది ప్రధానులు కలలుగంటున్నారని.. చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసి చూపించారని తెలిపారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన అనేక పథకాలు నేడు కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని దేశం మొత్తం కూడా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమం ముందుకు వెళ్లాలన్నా చంద్రబాబు వల్లే సాధ్యమని వెల్లడించారు. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయిన ఏపీని అన్ని విధాలా గాడిలోపెట్టిన దార్శనికుడు చంద్రబాబు అని అన్నారు. ఆయన బాటలో ఆయనతో కలిసి తామంతా పని చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు గురించి అందరూ తెలుసుకునేలా పుస్తకం రాసిన శేఖర్ బాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# తెలంగాణలో పెరిగిన చలితీవ్రత

## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి

**హైదరాబాద్ :** హైదరాబా సహా తెలంగాణలోని పలు జిల్లాలు చలితో వణికి పోతున్నాయి. రోజురోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. సూరీడు కూడా చల్లగానే ఉంటున్నాడు. మంగళవారం తీవ్రమైన చలిగాలులు అల్లాడించాయి. వరుసగాగత కొన్నిరోజులుగా చలి తీవ్రత కనిపిస్తూనే ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. నగరంలోని శేరి లింగంపల్లిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంతం, ఉత్తర తెలంగాణలోని కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలోని అత్యంత శీతల ప్రాంతాలుగా నిలిచాయి. శేరి లింగంపల్లిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంతంలో అత్యల్ప ఉష్ణోగ్రత 8.8 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదైంది. నగరంలోని పలు ఇతర ప్రాంతాల ఉష్ణోగ్రతలు కూడా సింగిల్ డిజిట్ మార్కుకు దగ్గరగా ఉన్నాయి. రాజేంద్రనగర్‌లో 10 డిగ్రీలు, మౌలాలిలో 10.2 డిగ్రీలు, గచ్చిబౌలిలో 10.9 డిగ్రీలు, అల్వాల్, కుత్బుల్లాపూర్‌లలో 11 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుజామున పరిస్థితులు ఆఫీసులకు వెళ్లేవారికి, విద్యార్థులకు, వీధి వ్యాపారులకు అసౌకర్యంగా మారిపోయాయి డిసెంబర్ నెలలో చాలా రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3?4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. స్పష్టమైన ఆకాశం, ఉత్తర, ఈశాన్య గాలుల ప్రభావం, రాత్రిపూట రేడియేషన్ శీతలీకరణ కారణంగా చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ పరిశీలకులు చెబుతున్నారు. హైదరాబాద్ వెలుపల, ఉత్తర, మధ్య తెలంగాణలో కూడా చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. కేబీ ఆసిఫాబాద్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత (5.6 డిగ్రీల సెంటీగ్రేడ్) నమోదైంది.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

- కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సీఎం
- ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా



**కోల్‌కతా :** భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

# భూములు ఇవ్వడం వల్లే బెంగాల్‌కు ప్రాజెక్టులు

## అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ




**కోల్‌కతా :** బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేయడం కుట్ర కాదా అని అన్నారు.

# బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా జియా మృతి

**ఢాకా :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ అధినేత్రి ఖలీదా జియా(80) కన్నుమూశారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకడంతో నవంబర్ 23న ఢాకాలోని ఎవర్ కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు న్యుమోనియా సోకినట్లు డాక్టర్లు నిర్ధరించారు. ఆ తర్వాత వేగంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. గుండె, కిడ్నీ, లివర్, డయాబెటిస్, ఊపిరితిత్తులు తదితర ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఫజ్రు ప్రార్థనల తర్వాత ఆమె తుదిశ్వాస విడిచారు. ఖలీదా జియా బంగ్లాదేశ్ రాజకీయాలపై బలమైన ముద్ర వేశారు. ఆమె 1991 - 1996, 2001 - 2006 మధ్య పదేళ్లపాటు ప్రధానిగా పని చేశారు. బంగ్లాదేశ్‌లో కేర్ టేకర్ గవర్నమెంట్ వ్యవస్థను ఆమె తొలుత ప్రవేశపెట్టారు. అవినీతి కేసులో 2018 నుంచి 2020 వరకు జైల్లో గడిపారు. ఇటీవల ఆమె కుమారుడు తారిక్ రెహమాన్ 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. మరో కుమారుడు అరాఫత్ రెహమాన్ కోకో కొన్నేళ్ల క్రితం మలేసియాలో కన్నుమూశారు. 1945లో వ్యాపారవేత్త సికందర్ కుటుంబంలో జన్మించిన ఖలీదాజియా.. 1960లో జియావుర్ రెహమాన్‌ను వివాహం చేసుకొన్నారు. బంగ్లా విమోచన యుద్ధంలో జియావుర్ పాక్‌పై తిరుగుబాటు చేసి యుద్ధంలో పాల్గొన్నారు. 1981లో ఆయన హత్య తర్వాత బీఎన్‌పీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. దీంతో ఖలిదా జియా పార్టీ పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత పదేళ్లకు తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

# సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

## నేడు అంత్యక్రియలకు జై శంకర్ హాజరు



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్‌పర్సన్ బేగం ఖలీదా జియా అంత్యక్రియలకు భారత ప్రభుత్వం తరఫున కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ హాజరవుతున్నారు. ఇందుకోసం బుధవారంనాడు ఆయన ఢాకా బయలుదేరి వెళ్తున్నారు. ఇటీవల కాలంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో జైశంకర్ ఢాకా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. బేగం ఖలీదా జియా (80) సుదీర్ఘ అస్వస్థతతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఢాకా అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండె, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో నవంబర్ 23న ఆసుపత్రిలో చేరిన ఆమె 36 రోజులుగా చికిత్స పొందుతున్నారు. దేశ తొలి మహిళా ప్రధానిగా బంగ్లాదేశ్ అభివృద్ధి, భారత్‌తో సత్సంబంధాలకు జియా విశేష కృషి చేశారు. బేగం ఖలీదా జియా మృతికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. భారత్-బంగ్లా సంబంధాల బలోపేతానికి బేగం ఖలీదా జియా చేసిన కృషిని ప్రశంసించారు. ఆమె కుటుంబానికి, బంగ్లా ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 2015లో ఢాకాలో ఆమెతో ఒక సమావేశంలో పాల్గొన్నానని, ఆమె గొప్ప దార్శనికురాలని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి, కుటుంబ సభ్యులకు మనోస్థైర్యం కలగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

# ప్రియాంక తనయుడు రెహానా నిశ్చితార్థం

## జాతీయ మీడియాలో కథనాలు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఆయన ఎంగేజ్‌మెంట్ జరిగినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తన స్నేహితురాలు అవీవా బేగ్‌తో రేహాన్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం వీరిద్దరూ దిగిన ఫొటోను అవీవా తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. తర్వాత అదే ఫొటోను 'హైలైట్స్' సెక్షన్‌లో ఉంచారు. దీంతో వీరి ఎంగేజ్‌మెంట్ వార్తలకు ఇది మరింత బలం చేకూర్చినట్లయ్యింది. రేహాన్-అవీవా ఏడేళ్లుగా స్నేహితులు. ఇటీవల అవీవా ముందు రేహాన్ పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా.. దానికి ఆమె ఆమోదించినట్లు సమాచారం. వీరి ప్రేమ బంధాన్ని ఇరు కుటుంబాలు అంగీకరించి నిశ్చితార్థం జరిపించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అవీవా కుటుంబసభ్యులు దిల్లీకి చెందినవారని, వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సమాచారం. రేహాన్ వాద్రా విజువల్ ఆర్టిస్ట్. వైల్డ్‌లైఫ్, స్ట్రీట్, కమర్షియల్ ఫొటోగ్రఫీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2021లో దిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'డార్క్ పర్సెప్షన్' పేరుతో తన తొలి ఎగ్జిబిషన్ నిర్వహించారు. అవీవా కూడా ఫొటోగ్రాఫర్. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ నుంచి జర్నలిజం అండ్ కమ్యూనికేషన్స్ పూర్తి చేశారు. ఓ ఫొటోగ్రఫిక్ స్టూడియో, ప్రొడక్షన్ కంపెనీకి సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

# నేడు అయోధ్యకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్

## ద్వాదశి ఉత్సవాల్లో పాల్గొననున్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ :** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారంనాడు అయోధ్య లో పర్యటించనున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ప్రాణప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాజ్‌నాథ్ సింగ్ షేర్ చేశారు. ఈనెల 31న తాను అయోధ్యలో ఉంటానని, శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్రను దర్శించి, ప్రాణప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవాల్లో పాల్గొంటానని తెలిపారు. ఈనెల 31న ప్రాణప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇటీవల ప్రకటించారు. ఈ ఉత్సవాలకు రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించామని, ఆయన తన సమ్మతి తెలియజేశారని చెప్పారు. రక్షణ మంత్రి హాజరైతే సీఎం కూడా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కాగా, ప్రాణ్ ప్రతిష్ఠ ద్వాదశి ఉత్సవాల్లో రెండోరోజు శ్రీరామ జన్మభూమి మందిర్‌లో యజ్ఞాలు నిర్వహించనున్నారు. తత్వ కలశ్, తత్వ హోమం, మన్యు సూక్త హోమం, రామ్ తారక మంత్ర హోమం నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు నిర్వహిస్తారు. విశ్వప్రసన్న తీర్థ జీ మహరాజ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. గత నెలలో శ్రీరామ జన్మభూమి ఆలయ శిఖరంపై ధర్మధ్వజాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు.

# బంగ్లాదేశ్‌లో ఆగని దాడులు

## మరో హిందువు దారుణ హత్య

**ఢాకా :** బంగ్లాదేశ్ లో హిందువుల హత్యలు కొనసాగుతున్నాయి. వరుసగా హిందువులే లక్ష్యంగా అక్కడి ముష్కర మూకలు కాల్పులకు తెగిస్తున్నాయి. దీపూచంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరవక ముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురిపెట్టానని..అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపాడు అది మరవకముందే ఇటీవల మరో హిందూ యువకుడిని రాజ్‌బరి జిల్లా పంగ్శా సర్కిల్‌లో గ్రామస్థులు కొట్టి చంపారు. తాజాగా మరో హత్య జరగడంతో ఆ దేశంలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.



## సంపాదకీయం

# రైతులకు కలిసి రాని కాలం

పంట పండించే రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు మొదలుకుని, యూరియా, ఇతర క్రిమి సంఘారక మందులు ఇలా అనేక చోట్ల దగాపడుతూనే ఉన్నాడు. కాలం కలిసి వస్తే గిట్టుబాటు ధరల సమస్. కాలం కసలి రాకపోతే పంటలు ఎండిపోవడంతో వచ్చే కష్టాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల విషయంలో ఎందుకనో స్పష్టమైన విధానంలో ముందుకు రావడం లేదు. రైతుభరోసా పేరుతో బురిడీ కొట్టించడం తప్ప సకాలంలో ఎరువులు విత్తనాలు సరఫరా చేయడం లేదు. యూరియా కష్టాలు తీరడం లేదు. పంటలను సకాలంలో కొనడం లేదు. కొన్నా గిట్టుబాటు ధరలు చెట్టించడం లేదు. ఈ సమస్యలు ఎవరు అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. 2025 సంవత్సరంలో రైతులకు పెద్దగా లాభం దక్కలేదు. కష్టపడ్డా గిట్టుబాటు ధరలు దక్కలేదు. అన్ని పంటలకు ఇదే సమస్య ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్యల కారరణంగా రైతులు ఏటా చిత్తవుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులను, నిపుణులను కూర్చోబెట్టి చర్చించడం లేదు. ఈయేడు పత్తి, మిర్చి, వరి పంటలను అధిక వర్షాలు దెబ్బతీసాయి. వచ్చిన పంటలను అమ్ముకుందామంటే గిట్టుబాటు ధరలు రావడం లేదు. రకరరకాల కారణాలతో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. పత్తిరైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గిందంటే ధరల్లో కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో సీసీఐకి పత్తిని విక్రయించిన చాలామంది రైతులకు మద్దతు ధర లభించలేదు. తేమ పేరిట ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కొద్దిమంది నిల్వచేసుకుని ఇప్పుడు అమ్ముకుందామంటే సీసీఐ కోత విధించడంతో పాటు పత్తి బీబీ స్పెషల్ నుంచి మెక్‌మోడ్ కుమారిందని నెల వ్యవధిలో రూ.100కు పైగా కోత విధించారు. అయినా మద్దతు ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వానలతో ఇబ్బందులు పడి పంటను సరైన ధర వచ్చే వరకు చూసి విక్రయిద్దామంటే ఇప్పుడు నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని, ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా పత్తి రైతుకు సీజన్ ఆరంభం నుంచి తిప్పలు తప్పడం లేదు. ప్రతికూల పరిస్థితుల్లో చేతికి వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సివస్తోంది. మొదట్లో తేమ పేరుతో మద్దతు ధర దక్కలేదు, ఇప్పుడేమో నాణ్యత లేదంటూ సీసీఐ ధరల్లో కోత విధించడంతో రైతులు నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.100కు పైగా కోత పెట్టడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ రూ.8,010 మద్దతు ధర ఇస్తుండగా, గరిష్టంగా రూ.7,800 తో మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉభయ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు. జిల్లా కేంద్రంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. పత్తిలో తేమ సంగతి పక్కన పెడితే పత్తిలో నాణ్యతాప్రమాణాలు తగ్గుతున్నాయని తొలుత రూ.50 కోత పెట్టి రూ.8,060 ధరతో కొనుగోళ్లు చేపట్టారు. మళ్లీ మరోమారు రూ.50 కోతపెట్టింది. ప్రస్తుతం పత్తిలో 8 శాతం తేమ ఉంటే రూ.8,010 మద్దతు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా, గరిష్టంగా రూ.7,800 ధర మాత్రమే పెడుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో విసుగు చెందిన రైతులు నగదు ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరలను చూపి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారు. సీసీఐ నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారడంతో దిక్కుతోచని స్థితుల్లో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు.

రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కపాస్ యాప్‌లో బుక్ చేసుకుని రైతుల పేరిట భూమి కాగితాలు, ఆధార్ చూపించి లాభాలు పొందుతున్నారు. వ్యాపారులకు కొనుగోలు సెంటర్ల వద్ద కొంతమంది ఆఫీసర్లు కొమ్ముకాస్తున్నారనే విమర్శలున్నాయి. సీసీఐ తీరుతో రైతులు నష్టపోతుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేసే దళారులు బాగుపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రాలో 2025 సంవత్సరం మొత్తంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా రాలేదు. మిర్చి ధర సగానికి పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాస ధర పథకం ఏమైందో తెలియదు. పొగాకు లెటర్ ఇచ్చిన కంపెనీలు పొగాకు కొనకుండా ఎగనామం పెట్టారు. ప్రభుత్వం 6 వేలకు, 9 వేలకు కొనిపిస్తానని కేంద్రాలు తెరిచింది. ప్రభుత్వం ప్రకటించిన ధర 10 శాతం మందికి కూడా రాలేదు. అత్యధిక భాగం 3 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకా రైతుల దగ్గర పొగాకు ఉండిపోయింది. ఉల్లి రైతుకు కిలోకు రూపాయి కూడా రాని సందర్భాలు ఉన్నాయి, పారబోసిన సందర్భాలు ఉన్నాయి, పశువులను మేపిన సందర్భాలు ఉన్నాయి. హెక్టారుకు 50 వేలు ఎవరికి ఇచ్చారో, ఎందరికి ఇచ్చారో తెలియదు. మామిడి రైతులకు కిలో 12 రూపాయలకు కొనాలని, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ముదరా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ముదరా 190 కోట్లు తీసుకున్న ఫ్యాక్టరీలు కుమ్మక్కై కిలో రూ.3 నుండి రూ.6 మధ్యనే కోనుగోలు చేశాయి. రైతులు రోడ్లపై పారబోయడం, చెట్లను నరికి వేయడం చూశాం. కోకో రైతులకు 11.84 కోట్ల రూపాయలు ఇచ్చారు. సగం మంది రైతులకే అందాయి. ముందుగా అమ్ముకున్న రైతులు ఉసూరుమన్నారు. పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెట్టినా ప్రైవేట్ వ్యాపారుల పెత్తనమే సాగింది. క్వింటాలు రూ.7710 మద్దతు ధర కాగా, రైతులు రూ.5000 నుండి రూ.6000 మధ్యనే అమ్ముకుంటున్నారు. టమోటా రైతులు పశువులు మేపుకున్న పరిస్థితి చూశాం. పప్పుసెనగ, మొక్కజొన్న అయినకాడికి అమ్ముకోవడం తప్ప ప్రభుత్వం ఆదుకున్నది లేదు. అరటికాయలు మార్కెట్‌కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని తోటలలో వదిలివేయడం, పశువులను మేపడం చూశాం. రైతులు కోల్పోయింది వేల కోట్లు, ప్రభుత్వం చెల్లించింది 201 కోట్లుగా తేలింది. మొత్తంగా పంట ఏదైనా కష్టం తప్పడం లేదు..నష్టం తప్పడం లేదు. పాలకులు మాత్రం మాటలతో సరిపెడుతున్నారు.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరిక




**అనకాపల్లి:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా పోలీసులు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల నిర్వహణపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వేడుకల పేరుతో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. హోటళ్ళు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వినోద కార్యక్రమాల్లో అశ్లీలత, నగ్న ప్రదర్శనలు పూర్తిగా నిషేధమన్నారు. అలాగే, కార్యక్రమాలు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి తప్పనిసరిగా ముగించాలని సూచించారు. పార్టీల్లో డ్రగ్స్, నార్కోటిక్స్ తదితర మత్తు పదార్థాల వినియోగంపై కఠిన నిఘా ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. యువత బైక్ రేసింగ్‌లు, కారు రేసింగ్‌లకు పాల్పడకూడదని, అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. మహిళలు, బాలికలపై వేధింపులను అరికట్టేందుకు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అగ్ని ప్రమాదాల నివారణ దృష్ట్యా బాణాసంచా కాల్చడాన్ని నిషేధించామని, డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై పరిమితులు విధించినట్లు తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు కీలక ప్రాంతాల్లో అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామని చెప్పారు. అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ప్రజలందరూ పోలీసులకు సహకరించి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు డి. దేవప్రసాద్ (అడ్మిన్), ఎల్. మోహన్ రావు (క్రైమ్), అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు సహా ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఆబాక పంచాయతీ విభజనపై నిరసన

## విభజనకు వ్యతిరేకంగా గ్రామసభలో తీర్మానం




**సూళ్లూరుపేట:** ఆబాక పంచాయతీ విభజన ప్రతిపాదనలకు గ్రామస్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆబాక సచివాలయం నందు నిర్వహించిన గ్రామసభలో అధికారులు, ఆరు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. గ్రామసభలో పెద్ద పడవ, కొమ్మినేనిపల్లి గ్రామాలను విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా పెద్దపడవ గ్రామానికి చెందిన 71 మంది గ్రామస్థులు అభిప్రాయం తెలపగా, అందులో కేవలం 8 మంది మాత్రమే ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు మద్దతు తెలపగా, 63 మంది ఆబాక పంచాయతీలోనే కలిసి ఉంటామని స్పష్టం చేస్తూ విభజనకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మొత్తం ఆరు గ్రామాల్లో ఆబాక, మదరమిట్ట, అమలపాడు, జంగాలపల్లి, పెద్ద పడవ గ్రామాల ప్రజలు ఐక్యంగా తమ పంచాయతీ విడిపోవద్దని అభిప్రాయం వ్యక్తం చేయగా, కొమ్మినేనిపల్లి గ్రామం మాత్రమే కొత్త పంచాయతీ ఏర్పాటుకు మద్దతు తెలిపింది. దీంతో గ్రామసభలో మెజార్టీ అభిప్రాయం స్పష్టంగా ప్రత్యేక పంచాయతీ వద్దనే నమోదైంది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, “ఆరు గ్రామాలు అన్నదమ్ముల్లా కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యం. విడిపోతే పాలనాపరమైన సమస్యలు, మౌలిక సదుపాయాల లోపం తలెత్తుతాయి” అని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాలతో గ్రామాలను విడగొట్టాలని ప్రయత్నిస్తున్నారని గ్రామసభలో తీవ్ర అసహనం వ్యక్తమైంది. గ్రామసభలో వెలువడిన మెజార్టీ అభిప్రాయాన్ని పంచాయతీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపించారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి విభజన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రంగయ్య, జనార్ధన్, రమణయ్య, గ్రామస్తులు అన్నమేటి సీనయ్య, నక్క హరిబాబు, దాచేపల్లి కుమార్ తో పాటు ఆరు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రత్నాలంకరణలో భక్తులను అనుగ్రహించిన మధ్వేంకట రామమూర్తి స్వామి

## వైభవంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి





**సూళ్లూరుపేట:** పట్టణంలో వెలసిన శ్రీ మధ్వేంకట రామమూర్తి స్వామి వారి ఆలయంలో మంగళవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామునే స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని అత్యంత ఆకర్షణీయమైన రత్నాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ద్వార దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పిస్తూ ఉత్తర ద్వారం గుండా స్వామివారు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోగా, భక్తుల శ్రద్ధాభక్తులు వెల్లివిరిశాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినం కావడంతో తెల్లవారుజాము నుంచే వందలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరి స్వామివారి దర్శనం



చేసుకున్నారు. ఈ సందర్భంగా కొండూరు వెంకటేశ్వర్లు, మాదరపాక సురేష్, భగవాన్ దాస్ వారి సహకారంతో సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే పండుగ వేడుకల్లో భాగంగా చిన్నపిల్లలచే నిర్వహించిన కోలాటం అత్యంత అద్భుతంగా సాగి భక్తులను ఆకట్టుకుంది. వారి నృత్య ప్రదర్శనతో ఆలయ ప్రాంగణం పండుగ కళతో కళకళలాడింది. ఆలయ పూజారి అనంత పద్మనాభం స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించగా, పండుగ ఏర్పాట్లలో కొండూరు వెంకటేశ్వర్లు, మాదరపాక సురేష్, భగవాన్ దాస్ ముఖ్యపాత్ర పోషించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
బుధవారం 31 డిసెంబర్ 2025


### గవర జాతీయ మహిళా మణులు సేవా గరిడి చేపట్టడం

# ఎంతో అభినందనీయం

### విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు అభినందన



**మునగపాక, డిసెంబర్ 30, మనసులో మాట..** అనకాపల్లి జిల్లా, మునగపాక మండలం గవర్ల అనకాపల్లి మహిళా సేవ గరిడిని విశాఖమేయర్ పీలా శ్రీనివాసరావు అభినందించారు. మునగపాక మండలం తోటాడ గవర్ల అనకాపల్లి గ్రామంలో మహిళా సేవ గరిడి ఆదివారము కేంద్ర గౌరీ సంఘం గవర జాతీయు ల వన భోజన కార్యక్రమం నకు గవర్ల అనకాపల్లి మహిళా సేవ గరిడి ని ఆహ్వానించడం జరిగింది .ఈ సందర్భముగా విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ మన గవర జాతీయులలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడం చాలా ఆనందకరంగా ఉందని అన్నారు .ఈ మహిళ సేవాగరిడికి ఆర్గనైజేషన్ చేసిన దాడి జగప్పారావు ను అభినందించి సభ్యులందరికీ షిల్డ్ లు బహూకరించడంజరిగినది . ఈ కార్యక్రమంలోతోటాడ క్లస్టర్ అధ్యక్షులు పొలమర శెట్టి ఆనందరావు కేంద్ర గౌరీ సేవా సంఘం వన భోజన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



### నేడు తెనుగుపూడి, గరిసింగి గ్రామాల్లో

## ఎమ్మెల్యే పర్యటన

దేవరాపల్లి, డిసెంబర్ 30, (మనసులో మాట) : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి (నేడు) బుధవారం తెనుగుపూడి, గరిసింగి గ్రామాల్లో పర్యటిస్తారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ మంగళవారం తెలిపారు. మండలంలోని తెనుగుపూడి గ్రామంలో ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం గరిసింగి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

### బంగారు మెట్ట గ్రామంలో తాగునీటి కొరతకు పరిష్కారం



**హుకుంపేట డిసెంబర్ 30 (మనుసులో మాట)..** హుకుంపేట మండలంలోని మత్స్యపురం పంచాయతీ పరిధిలో ఉన్న బంగారు మెట్ట గ్రామంలో తాగునీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. జడ్పీ నిధులతో నూతన బోరు ఏర్పాటు కోసం మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కిల్లో మీనా కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మీనా కుమారి మాట్లాడుతూ, జడ్పీ నిధుల ద్వారా సుమారు రూ.1 లక్ష 20 వేల వ్యయంతో బంగారు మెట్ట గ్రామంలో నూతన బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామస్థులు ఊట నీటిపై ఆధారపడాల్సి వచ్చిందని, ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని ఆమె చెప్పారు. గ్రామంలో సుమారు 50 గడపలు, 300 మంది జనాభా నివసిస్తున్నారని, నూతన బోరు ద్వారా తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లో సాంబ పాల్గొన్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎమ్మెల్యే బండారు



**దేవరాపల్లి, డిసెంబర్ 30, (మనసులో మాట) :** వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి తిరుపతిలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శిన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికీ ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# తగ్గిన నేరాల రేటు

### - సాంకేతికతతో పెరిగిన నేర పరిశోధన - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా




**అనకాపల్లి, డిసెంబర్ 30 (మనసు లో మాట):** జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వార్షిక పత్రికా సమావేశంలో 2025 సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని నేరాల గణాంకాలను మరియు పోలీస్ శాఖ సాధించిన పురోగతిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో మొత్తం నేరాలు 23 శాతం మేర తగ్గాయని ఎస్పీ పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ప్రధాన నేర గణాంకాలను పరిశీలిస్తే, గత ఏడాదితో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్యలో 23 శాతం తగ్గుదల నమోదైంది. వివిధ విభాగాల వారీగా వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**మహిళా మరియు చిన్నారులపై నేరాలు**

మహిళలపై నేరాలు (సిఏడబ్ల్యు) గత ఏడాది 387 ఉండగా, ఈ ఏడాది 291 కి తగ్గి 25 శాతం క్షీణతను కనబరిచాయి. చిన్నారులపై జరిగే పోక్సో కేసులు 44 నుంచి 43 కి స్వల్పంగా తగ్గాయి. తీవ్రమైన నేరాలు ప్రాణహాని కలిగించే నేరాలు 29 శాతం తగ్గి, 591 నుంచి 417 కి పడిపోయాయి. ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు గణనీయంగా 54 శాతం మేర తగ్గుముఖం పట్టడం విశేషం.

**హత్య కేసులు**

2024సంవత్సరం లో 17 కేసులు, 2025 సంవత్సరంలో 11 కేసులు 35 శాతం తగ్గుముఖం పట్టింది.

**ఆస్తి మరియు ఆర్థిక నేరాలు ఆస్తి సంబంధిత నేరాలు**

406 నుంచి 417 కి పెరిగి 3 శాతం స్వల్ప వృద్ధిని నమోదు చేశాయి. మోసపూరిత కేసులు 131 నుంచి 125 కి (-5శాతం), నమ్మకద్రోహం కేసులు 18 నుంచి 17 కి (-6శాతం) స్వల్పంగా తగ్గాయి.

**సాంకేతిక నేరాలు**

ఇతర విభాగాల్లో నేరాలు తగ్గుతున్నప్పటికీ, సైబర్ నేరాలు 61 నుండి 76కి పెరిగి 25 శాతం పెరుగుదలను సూచించాయి. అలాగే సోషల్ మీడియా వేధింపుల కేసులు కూడా 19 నుండి 21కి (11 శాతం) పెరిగాయి. ఈ సంవత్సరంలోనే జరిగిన 3 మేళాల ద్వారా 1,880 మొబైల్ ఫోన్లను (విలువ రూ. 3.70 కోట్లు) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగింది.

ప్రమాదాలు మరియు ఇతర కేసులు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు 7 శాతం తగ్గగా, ఇతర గాయాలైన ప్రమాదాలు 12 శాతం తగ్గాయి. మాదకద్రవ్యాల కేసులు 162 నుండి 128 కి (-21శాతం) తగ్గాయి. ఇతర సాధారణ కేసులు కూడా 4,987 నుండి 3,627కి తగ్గి 27 శాతం తగ్గుదలను నమోదు చేశాయి. మొత్తంగా చూస్తే, 2024లో నమోదైన 7,573 కేసులతో పోలిస్తే, 2025లో ఆ సంఖ్య 5,821కి తగ్గింది.

**మహిళా భద్రత మరియు అదృశ్యమైన కేసుల వివరాలు**

మహిళలపై జరుగుతున్న నేరాలు గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా కిడ్నాప్ కేసులు 85 శాతం మరియు వరకట్న వేధింపులు 11 శాతం తగ్గుముఖం పట్టాయి. మహిళా నేరాలు 2025లో 291 కేసులు నమోదయ్యాయి.

మిస్సింగ్ కేసులు 2025లో మొత్తం 316 మిస్సింగ్ కేసులు నమోదు కాగా, అందులో 257 మందిని (దాదాపు 81శాతం) సురక్షితంగా గుర్తించడం జరిగింది. ఇందులో 149 మంది మహిళలు మరియు 42 మంది బాలికలు ఉన్నారు.

**నేర పరిశోధనలో విశేష ప్రతిభ**

ఈ ఏడాది రెండు సవాల్‌తో కూడిన హత్య కేసులను పోలీసులు అత్యంత ప్రతిభావంతంగా ఛేదించారు. సబ్బవరం అపరిచిత మహిళ హత్య, బాటజంగాలపాలెం వద్ద దహనం చేయబడిన మహిళా మృతదేహాన్ని గుర్తించి, 450 సిసిటివి కెమెరాల విశ్లేషణ ద్వారా నిందితులను (మృతురాలి అల్లుడు తదితరులు) 11 రోజుల్లోనే అరెస్ట్ చేశారు. కశింకోట ట్రాన్స్‌జెండర్ హత్య, అంగీకారం లేని వివాహ ఒత్తిడి కారణంగా జరిగిన ఈ హత్యలో, నిందితుడిని కాల్ డేటా మరియు టవర్ లోకేషన్ ఆధారంగా కేవలం 24 గంటల్లోనే గుర్తించి అరెస్ట్ చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ

గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణలో జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరించారు. 2025లో 128 కేసులు నమోదు చేసి, 411 మందిని అరెస్ట్ చేశారు. సుమారు 4.41 కోట్ల రూపాయల విలువైన 8790.88 కిలోల గంజాయిని, 7.39 లీటర్ల హషీష్ ఆయిల్ మరియు 115 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 6 గురు గంజాయి నేరస్థుల పై కేసులు పిఐటి ఎన్ డిపిఎస్ కేసులు నమోదు చేయడమైనది. గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించిన 6 గురు వ్యక్తుల ఆస్తులు రూ.1,25,22,100 విలువ గలవి ఫ్రీజింగ్ చేయడమైనది. 312 మంది గంజాయి నేరస్థుల పై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చెయ్యడమైనది. లోక్ అదాలత్ ద్వారా 16,132 కేసులను పరిష్కరించారు.

**గంజాయి అక్రమ రవాణా, హత్య, ఫోక్సో కేసుల్లో శిక్షలు : కన్విక్షన్ కేసులు 51 శాతం.**

ఒక కేసులో మరణశిక్ష, 2 కేసుల్లో జీవిత ఖైదు, 2 కేసుల్లో నిందితులకు 20 సం.,లు జైలు శిక్ష, 10 కేసుల్లో నిందితులకు 10 సం.,లు జైలు శిక్ష , 5 కేసుల్లో 5సం.,లు కంటే ఎక్కువగా జైలు శిక్షలు నిందితులకు విధించ బడ్డాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా,అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు జి.ఆర్.ఆర్.మోహన్, ఈ.శ్రీనివాసులు, బి.మోహనరావు, ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య, పరిపాలన అధికారి తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, వెంకటనారాయణ, ప్రేమ్ కుమార్, అశోక్ కుమార్, స్వామినాయుడు, దేముళ్ళు, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, శిరీష, అంజిబాబు, విశ్వనాథం, సత్యనారాయణ, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అనకాపల్లి దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయానికి

# పోటెత్తిన భక్తజనం

### - ముక్కోటి ఏకాదశి పర్వదినాన స్వామి వారిని దర్శించుకున్న పట్టణ ప్రముఖులు



**అనకాపల్లి, డిసెంబర్ 30 (మనసులో మాట):** స్వయం భూ గా వెలిసి ప్రసిద్ధి చెందిన అనకాపల్లి దేమునిగుమ్మం అలువేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ముక్కోటి ఏకాదశి పర్వదినాన మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనానికి ఉదయం నుంచే బారులు తీరడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది. ఈ ఏడాది సప్తద్వారాల ద్వారా స్వామి వారి దర్శనభాగ్యం కల్గించడంతో భక్తులు పరవశించి పోయారు. ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు, పులఖండం విజయబాబు ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారుజామునే సుప్రభాత సేవ అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉత్తరద్వారాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందు లేకుండా చర్యలు చేపట్టారు. కాగా అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది. భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా స్వామి దర్శనం శవ్యంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ధర్మాదాయ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, జోనల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర తదితర ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనువాసరావు, ఈవో మురళీకృష్ణ, పొలిమేర నాయుడు, విల్లూరి అప్పలనాయుడు, కాండ్రేగుల హరికృష్ణ, దాడి జగన్నాథరావు, బొడ్డేడ అయ్యప్ప, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన**

సుంకర మెట్టు శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఆలయ ప్రాంగణంలో మంగళవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి వార్లకు ప్రత్యేకమైన పూల అలంకరణ చేశారు. అలాగే ఆలయ ఆవరణలో విద్యుత్ అలంకరణ గావించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామి వారి దర్శనం చేసుకునే విధంగా దేవస్థాన చైర్మన్ బొడ్డేడ మురళి ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు వైకుంఠ ద్వార దర్శనం, ప్రత్యేక పూజ చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నాగ జగదీష్ ను దేవస్థాన చైర్మన్ బొడ్డేడ మురళి, కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి బల్లమ్మ, భరద్వాజ్,పొలిమేర నాయుడు, పెంటకోట చంద్ర,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







సిఐటియు అల్లూరి స్మారక జోతికి అనకాపల్లి లో

# ఘన స్వాగతం

**అనకాపల్లి, డిసెంబర్ 30 (మనసు లో మాట):** విశాఖపట్నం లో ఈ నెల 31 నుంచి జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలకు అల్లూరి స్మారక కేంద్రం కేడీపేట నుంచి మంగళవారం ఉదయం బయలుదేరిన అల్లూరి స్మారక జ్యోతి నర్సీపట్నం, తాళ్లపాలెం, కసింకోట మీదగా అనకాపల్లి నెహ్రూ జంక్షన్ లో మంగళవారం సాయంత్రం సిఐటియు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనకాపల్లి పట్టణంలో ఈ జ్యోతి వివిధ జంక్షన్లో సీఐటీయూ సభల కోసం ప్రచారం నిర్వహిస్తూ ముందుకు సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు స్వాగత సభలో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోనే తల మానికంగా నిలిచే సిఐటియు మహాసభ లు జయప్రదం చేయాలని ఈ సందర్భంగా జనవరి 4 న విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభలకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, పిఎన్ వి పరమేశ్వరరావు, అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తాళయ్య బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈ చిరంజీవి, అల్లూరి వేషధారణ నాయకులు అర్జున్ పాల్గొన్నారు.

### వైఎస్సార్సీపీ సోషల్ మీడియా

# సైనికులకు సలాం




**విజయనగరం,(మనసులోమాట) డిసెంబర్ 30:** సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వం యొక్క అరాచకాలను ఎప్పటికప్పుడు చురుగ్గా ఉంటూ వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేస్తున్న ప్రతీ ఒక్క సోషల్ మీడియా సైనికుడుకి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన సోషల్ మీడియా సైనికులతో పాటు సుదూర ప్రాంతాలైన ముంబై, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తదితర నగరాలలోను,గల్ఫ్,ఇతర దేశాలలో ఉన్న వారు సైతం వివిధ ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ ఎంతో బిజీగా వున్నా ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలును ఎప్పటికప్పుడు ఖండిస్తూ, వైఎస్సార్‌సీపీకి అండ దండలు గా కీలక పాత్ర పోషించారన్నారు.సోషల్ మీడియా సైనికుల కృషి మరువలేనిదని,మీ సహకారాన్ని ఎప్పుడూ ఇలానే కొనసాగించాలని ఆయన ఆశించారు. విజయనగరం జిల్లా సోషల్ మీడియా సైనికులుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ జాతీయ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, బొత్సా సత్యనారాయణ ల తో పాటు మేము అందరం అండగా ఉంటామని,ఇదే స్ఫూర్తితో ఈ నూతన సంవత్సరంలో కూడా మరింత చురుగ్గా పని చేయాలని సూచించారు. నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటూ,రానున్న ఏడాదిలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ ముందుగా ప్రతీ ఒక్కరికీ పేరు పేరున నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ 2025 వ సంవత్సరంలో వైఎస్సార్సీపీని ముందుకు నడిపించడంలో సహకరించిన పార్టీ నాయకులకు,అభిమానులకు,కార్యకర్తలకు, ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు,సోషల్ మీడియా సైనికులకు ధన్యవాదాలు చెప్పారు. రానున్న నూతన సంవత్సరంలో ఇదే ఉత్సాహంతో అందరూ పనిచేసి పార్టీ కార్యక్రమాలను, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్ఆర్సిపి చేస్తున్న పోరాటాన్ని ప్రజలలోనికి తీసుకువెళ్లడంలో అందరూ మీ వంతుగా మాకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

### డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినా,

## కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు

### - జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

**విజయనగరం (మనసులోమాట) డిసెంబర్ 30:** డీలర్లు నిబంధనలు ఉల్లంఘించినా, కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపుచేసినా సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు తో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం విత్తిన, భవిష్యత్ లో విత్తనున్న పంటలకు సంబంధించి ఎరువులు అవసరమైన గ్రామాలు, మండలాలను గుర్తించి ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చెరువులు మరియు ఇతర వనరుల ద్వారా నీటి వసతి బాగా ఉండటంతో, గత సంవత్సరం కంటే ఈసారి మొక్కజొన్న కూరగాయల సాగు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వచ్చే 15 రోజులకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని మండలాల వారీ పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి ముందుగానే అంచనా వేసి, రాష్ట్ర స్థాయికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఎరువుల డీలర్ వద్ద యూరియా నిల్వల వివరాలు తెలియజేసే స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రైతులు యూరియా కొనుగోలు చేసే సమయంలో బస్తాపై ముద్రించిన ఎం.ఆర్.పీ ధరలను పరిశీలించి, అదే ప్రకారం ధర చెల్లించి, తప్పనిసరిగా డీలర్ నుండి రసీదు పొందేవిధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీలర్లు ఇతర ఉత్పత్తులతో కలిపి విక్రయించినా, ఎం.ఆర్.పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, వారి లైసెన్సులు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం, 1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాధికారి విటి రామారావు, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## ఉత్తరద్వారంలో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు


**ఎస్. రాయవరం, డిశంబర్ 30,(మనసులో మాట):** వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎస్. రాయవరం మండల ంలోని పలు ఆలయాలు భక్తులు తో కిటకిటలాడాయి. తిమ్మాపురం, గుడివాడ, దార్లపూడి, ఎస్. రాయవరం, ఒమ్మవరం, కొత్తపోలవరం గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులు కు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుండి భక్తులు స్వామివారినిదర్శించుకుని, పూజలుచేసారు. ఆలయాలు వద్ద ఉచిత ప్రసాద వితరణగావించారు.

## నకిలీ ఏసీబీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరక్టరు జనరల్

**విజయనగరం, (మనసులో మాట) డిశంబరు, 30:** కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు తమను తాము ఏసీబీ అధికారులుగా పరిచయం చేసుకుని ప్రభుత్వ అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఏసీబీ ప్రధాన కార్యాలయం గుర్తించిదని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరక్టరు జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై రాష్ట్రంలో అన్ని జిల్లాలకు అప్రమత్తం చేసి రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరక్టరు జనరల్ ఒక ప్రకటన విడుదల చేసారు. ఇటీవల కాలంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ అధికారులకు ఫోన్లు చేసి నేను ఎసిబి కార్యాలయం నుంచి మట్లాడుతున్నాను. మీ మీద మాకు చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. మీ మీద ఎసిబి రైడ్ జరగబోతుంది. ఆ రైడ్ జరగకుండా ఉండాలంటే వెంటనే ఫలనా నంబర్‌కు డబ్బు పంపండి లేదా ఫలానా వ్యక్తి వస్తారు వారికి డబ్బులు ఇచ్చి పంపండి అని ఒకసారి. మరొక సారి మీ మీద ఎసిబి కేసు నమోదు అయింది దానిలో ఆరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వండి అని బెదిరిస్తున్నట్లుగా అవినీతి నిరోధక శాఖ, ప్రధాన కార్యాలయం దృష్టికి వచ్చిందని, అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎవ్వరు కూడా అటువంటి ఫోన్ కాల్స్ ఎవ్వరికి చేయరని తెలిపారు. ఏసీబీ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ ద్వారా డబ్బులు అడగరని స్పష్టంచేశారు. ఇలాంటి నకిలీ, మోసపూరిత కాల్స్‌కు అధికారులు ఎవరూ స్పందించకూడదని సూచించారు. ప్రభుత్వ అధికారులు ఇటువంటి పేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండవలసిందిగా తెలియజేసారు. ఇటువంటి బెదిరింపు కాల్స్ వచ్చినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు మరియు ఎసిబి టోల్ ఫ్రీ నెంబరు 1064 కు తెలియపరచి సమాచారం ఇవ్వవలసినదిగా కోరారు.

## రోలుగుంట కొండపై వైకుంఠ ఏకాదశి వైభవం



**రోలుగుంట మనసులో మాట డిసెంబరు 30. .** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం రోలుగుంట కొండపై 18వ శతాబ్దం నాటి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచి పోటీ పడ్డారు. ఈ పవిత్ర ద్వారం తెరవడం తో భూలోక వైకుంఠ దర్శనం అందుబాటులోకి వచ్చింది. రోలుగుంట కొండపై స్వయంభువుగా వెలసిన ఈ ఆలయం 18వ శతాబ్ద కాలంలోని నిర్మాణ శైలిని కలిగి ఉంది. కలియుగ దైవంగా ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వరుడు ఇక్కడ భక్తుల అభీష్టాలను తీర్చుతూ వస్తున్నాడు. ఆలయం చుట్టూ కొండ ప్రకృతి సౌందర్యం భక్తులను ఆకర్షిస్తోంది. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం (వైకుంఠ ద్వారం) తెరవడం ద్వారా భక్తులు మోక్ష మార్గాన్ని పొందుతారని శాస్త్రాలు చెబుతాయి. 2025 డిసెంబర్ 30న జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు తెల్లవారు నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. ఈ రోజు ఉపవాసం, దర్శనం మోక్షానికి రాజ మార్గమని నమ్మకం., తెల్లవారు 4 గంటలకు ఆలయం తలుపులు తెరిచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమైంది. భక్తులు , ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు , నీటి సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు చేశారు. , ఈ ఉత్సవం స్థానిక భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని అందించింది. రోలుగుంట ప్రాంతంలోని గ్రామీణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఉత్సవాలకు మరింత ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుకుంటున్నారు.

### అడ్డురోడ్డు కేంద్రంగా

# రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై సంబరాలు



**ఎస్. రాయవరం, డిశంబర్ 30 (మనసులో మాట):** ఎస్. రాయవరం మండలంలోని అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. హెూం మంత్రి అనిత నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హెూం మంత్రి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా "అనితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హెూం మంత్రి అనితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమన్నారు. ఇప్పటికే అధికారులు స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం హెూం మంత్రి అనిత నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు ఆమె సారథ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, 2019 నుంచి 2024 వరకు తెలుగుదేశం పార్టీ కోసం పోరాటాలు చేశారని చెప్పారు. స్టీల్ ప్లాంట్, బొమ్మల పరిశ్రమతో పాటు పలు పరిశ్రమలను ఈ ప్రాంతానికి తీసుకురావడంలో మంత్రి అనిత కీలక పాత్ర పోషిస్తున్నారని, దీని ద్వారా లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నేత ధర్మశ్రీ వ్యాఖ్యలపై స్పందిస్తూ అడ్డురోడ్డు వ్యాపార రంగానికి కీలక కూడలి అని, ఎలమంచిలిలో రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తాం అనుకున్నప్పుడు గత ఐదు సంవత్సరాలు మీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. నేరం, ఘోరం, భారం అంటున్నారని, అసలు ప్రభుత్వానికి మీరే భారమన్నారు. మూడు సంవత్సరాల తర్వాత రెవెన్యూ డివిజన్ ఎలమంచిలి తెచ్చుకుంటాం అంటే,మీ ప్రభుత్వం వచ్చేది లేదు చచ్చేది లేదన్నారు. మరో 30 సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎలమంచిలి, పాయకరావుపేట పక్కపక్క నియోజకవర్గాలని, మేమంతా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉంటామని కొప్పిశెట్టి వెంకటేష్ చెప్పారు. ఎస్. రాయవరం మండలం టీడీపీ అధ్యక్షులు అమలంకంటి అబద్ధం మాట్లాడుతూ అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇవ్వని హామీలను కూడా మంత్రి అనిత నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఎస్. రాయవరం మండల ప్రజల తరపున హెూం మంత్రి అనితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కోరుప్రోలు పిఎసి ఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ మాట్లాడుతూ అడ్డరోడ్ గ్రామానికి రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన హెూంమంత్రి అనిత కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అడ్డురోడ్ లో జన్మించినందుకు మేమంతా గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ నాలుగు మండలాల నుండి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత హెల్త్ కార్డులు - డాక్టర్ శ్రీరామమూర్తి



**విజయనగరం (మనసులోమాట) డిసెంబర్ 23:** స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా గత సంవత్సరాలనుండి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీరామమూర్తి మంగళవారం 230 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత హెల్త్ కార్డులు అందజేశారు. ఈసందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్యం, అవసరమైన సమయంలో ప్రత్యేక రాయితీపై శస్త్ర చికిత్సలు కూడా మెరిట్ విద్యార్థులకు అందించాలని తమ అభిమతమన్నారు. సుమారు 61 పాఠశాల, ఉన్నత పాఠశాల ఇంటర్, డిగ్రీ విద్యార్థులను ఎంపిక చేసి వారికి తమ ఆసుపత్రిలో మెరిట్ సర్టిఫికెట్లు కూడా అందించారు. విద్యార్థులు ఆగోగ్యంగా ఉండాలని, విద్యాసక్తితో ఉన్నతంగా చదివి ఎదగాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్థో విభాగం వైద్యులు లక్ష్మి, డాక్టర్ శ్వేత, డాక్టర్ ఏ,బాలనాగ శ్రీకర్, డాక్టర్ సుధామాధురి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ




**నర్సీపట్నం, డిసెంబర్ 30 (మనసులో మాట)..** లయన్స్ క్లబ్ నవ్య నర్సీపట్నం ఆధ్వర్యంలో అధ్యక్షులు కర్రి రాంగోపాల్ అధ్యక్షతన పెదబొడ్డేపల్లి ఆర్సీఎం చర్చి ఆవరణలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏ.పీ సింగ్ పుట్టినరోజు సందర్భంగా వందమంది నిరుపేదలకు లయన్ రామ్ గోపాల్, లయన్ జమీల్, లయన్ బేతిరెడ్డి విజయ్ కుమార్, లయన్ శంకర్ లాల్ వారి ఆర్థిక సహాయంతో చీరలు, దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ చైర్ పర్సన్ సిహెచ్.ఇందిరా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బేతిరెడ్డి విజయకుమార్, క్లబ్ సభ్యులు వికాస్ సతీష్, శంకర్ లాల్, ఊడి అప్పారావు, అల్లూరి శ్రీరామ రాజ్, ప్రభాకర్, హర్షవర్ధన్, విజయ కుమారి, గిరి ప్రసాద్, దాహి సింగ్, ఆర్సీఎం చర్చి ఫాదర్ రత్నాకర్ ఈ కార్యక్రమాన్ని నడిపించడం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం వచ్చిన వారందరికీ స్వీట్స్ పంచడం జరిగింది.

### నాగులపల్లి లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా

# ఆలయాలలో ప్రత్యేక పూజలు

### - శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న కర్రీ సాయికృష్ణ





**మునగపాక, డిసెంబర్ 30 , మనసులో మాట..** మండలంలో గల నాగులపల్లి గ్రామంలో పాటిమీద గల శ్రీ వెంకటేశ్వర స్వామి ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రీసాయికృష్ణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రీ సాయి కృష్ణ మాట్లాడుతూ ఈ శుభదినం ప్రతి ఒక్కరు జీవితాల్లో శాంతి, ఆరోగ్యం, సుఖ సంతోషాలు, సమృద్ధిగా కలగాలని ఆయన ఆకాంక్షించారు. వైకుంఠ ఏకాదశి ధర్మం, సేవ, త్యాగం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే మహా పర్వదినం అని ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జ్ విల్లూరి నూకనరసింగరావు, మద్దాల కృష్ణ, మల్ల సతీష్, గోవాడ వెంకటరమణ, కర్రీ వాసు పలువురు పాల్గొన్నారు.



### ఘనంగా జిల్లా స్థాయి

# ఖో ఖో పోటీలు

### - ప్రతి విద్యార్థి క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరాలి
### - జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

విజయనగరం:(మనసులోమాట): డిసెంబర్:30:: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో పాల్గొని ఉన్నత స్థాయి కి చేరుకోవడానికి కృషి చెయ్యాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు పట్టణంలో నేషనల్ స్కూల్లో జరుగుతున్న జిల్లా స్థాయి ప్రైవేటు స్కూళ్ల విద్యార్థుల ఖోఖో పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి, విద్యార్థుల మనో నిబ్బరానికి దోహదం చేస్తాయని ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఉత్సాహం చూపాలని కోరారు,విజయనగరం జిల్లాలో గొప్ప క్రీడాకారులు ఉన్నారని 2024 లో శనపతి గురునాయుడు,2025 లో రెడ్డి భవానీలు భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ లో బంగారు పతకాలు సాధించి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి,విజయనగరం జిల్లాకు, దేశానికి గొప్ప కీర్తిని తీసుకు వచ్చారని వీరు ఇద్దరూ అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించారని అన్నారు, నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్.వి.ఎన్. వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలోని దాదాపు 13 స్కూళ్ల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని ఒక్క రోజులో పోటీలు ముగిస్తామని, విద్యార్థులను ప్రోత్సహించాలని తొలిసారి ప్రయోగాత్మకంగా ఈ కోకో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు,తల్లిదండ్రులు కూడా పోటీల పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు,ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొడ్డు రామారావు,బొడ్డు రాజారావు,ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఏపీపీఆర్ మండల కమిటీ ఎన్నికలు



**పెదబయలు డిసెంబర్ మనసులో మాట :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం మండల కమిటీ ఎన్నికలు జరిగాయి. ఇం దులో భాగంగా పాడేరులో జి.మాడుగుల, హుకుంపేట, పాడేరు మండలాలు కలిపి పాడేరు యూనిట్ కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్య క్షులుగా రుక్మిణి, కార్యదర్శిగా సత్యవతి, సభ్యు లను ఎన్నుకున్నారు. పెదబయలు మండల కమిటీ అధ్యక్షుడిగా పూర్ణయ్య, ఉపాధ్యక్షుడిగా మూర్తి, కార్యదర్శిగా రామారావు, సహాయ కార్యదర్శిగా జోగారావు, కోశాధికారిగా సిద్దే శ్వరరావుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్య పరిష్కారా నికి కమిటీ తరపున కృషి చేస్తామన్నారు.

### పర్రెడలో క్రిస్టమస్ వేడుకలలో

## పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ



**పెదబయలు డిసెంబర్ మనసులో మాట :**అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలానికి చెందిన పర్రెడ గ్రామంలో సిహెచ్ గణపతి అధ్వర్యంలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఫిటర్ సన్ మినిస్ట్రీ ఫౌండర్ తో పాటు సబితా సిస్టర్ హాజరు అయ్యారు. ఈ కార్యక్రమని ఉద్దేశించి ఫీటర్ సన్ మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుప్రభువు గూర్చి అనేక బైబిలు ప్రవచనాలు వివరించారు అలాగే అందరు సన్మార్గంలో నడవలనీ ఆకాంక్షరు, పర్రెడ సంఘా అభివృద్ధి కి దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని ఐరోసా ఇచ్చారు. స్థానిక పాస్టర్ గణపతి అలాగే సంఘ పెద్ద కొర్ర లోహితను క్రిస్టమస్ గ్రీటింగ్స్ ప్రజలకు తెలిపారు.అనంతరం మహిళలకు వృదులకు చీరలు దుప్పట్లు ఫిటర్ సన్ సిస్టర్ సబితా చేతులమీదుగా పంపిణీ చేసారు. ఈ కార్యక్ర మానికి వివిధ సంఘాలలో పనిచేస్తున్న దైవజనులు పాల్గొన్నారు.

## వాడ్రాపల్లిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా పల్లకిపై సీతారాములు ఊరేగింపు



**మునగపాక, డిసెంబర్30, మనసులో మాట..** మండలంలో గల వాడ్రాపల్లి గ్రామంలో ధనుర్మాసంనెల రోజులు ప్రతిరోజు మరియు ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీరాములు వారి విగ్రహాలను బి సి టి స్వచ్ఛంద సంస్థవారిచ్చిన పల్లకిలో ఊరేగింపుగా తిరుగుతూ గ్రామంలో ఉన్న అన్ని గుడిలో భగవంతుని అమ్మవారిని పూజించుకుంటూ మేలుకొలుపుతారు. మంగళవారం 150 మంది భక్తులతో వెంకటేశ్వర స్వామి కొండ చుట్టూ తిరిగితూ కొండ పైకి వెల్లి ముక్కోటి ఏకా సందర్భంగా ఆ వెంకటేశ్వర స్వామి గుడికి వెల్లి గోవిందా గోవిందా అని దర్శించుకోవడం శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆధ్యాత్మిక కార్యక్రమాల సేవకులు మల్ల వరాహ నరసింగరావు, పెతకంశెట్టి రామజోగి నాయుడు పలువురు గ్రామ పెద్దలు మహిళా భక్తులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ

కోటవురట్ల(మనసులో మాట) డిసెంబర్30: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతులు వద్ద నుంచి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరించినట్లు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు తెలిపారు.మంగళవారం కోటవురట్లలో మాట్లాడుతూ ఇప్పటివరకు 34.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 5.48 లక్షల రైతుల నుంచి సేకరించడం జరిగిందన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.8,120 కోట్ల నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా రాష్ట్రంలో క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందన్నారు. 20 లక్షల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 75 లక్షల మంది విద్యార్థులకు హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరిశుభ్రతకు సంబంధించి ఇటీవల ముస్తాబు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# యూరియా ఎరువు కొరత లేదు

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- మునగపాక మండల వ్యవసాయ అధికారిని జోష్ణ కుమారి



**మునగపాక, డిసెంబర్ 30, మనసులో మాట..** మునగపాక మండలంలో యూరియా ఎరువుకు కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని మునగపాక మండలం వ్యవసాయ అధికారిని జోష్న కుమారి రైతులకు భరోసా పలికారు. తిమ్మరాజుపేట రైతు భరోసా కేంద్రంలో 12 మెట్రిక్ టన్నులు, నాగులపల్లి లో 12 మెట్రిక్ టన్నులు, మునగపాకలో 12 మెట్రిక్ టన్నులు, తోటాడ లో 12 మెట్రిక్ టన్నులు ఎరువులను అందుబాటులో ఉంచామని రైతులంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని జోస్నకుమారి రైతులకు తెలియజేశారు.

# రీ సర్వే పూర్తైన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**దేవరాపల్లి, డిసెంబర్ 30, (మనసులో మాట) :** దేవరాపల్లి మండలంలో రీ సర్వే పూర్తైన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ బుక్స్ పంపిణీకి షెడ్యూల్ ఖరారైందని తహసీల్దార్ పి. లక్ష్మీదేవి మంగళవారం విలేకరులకు తెలిపారు. జనవరి 2 నుంచి 9 వరకు సంబంధిత గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి రైతులకు కొత్త పాస్ బుక్స్ అందజేస్తామని తహసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు. రైతులు నిర్ణీత తేదీల్లో గ్రామ సచివాలయాలకు హాజరై పత్రాలను స్వీకరించాలని ఆమె సూచించారు.

## అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై

# పాయకరావుపేటలో సంబరాలు

### హెూం మంత్రి అనిత నివాసం వద్ద ఎన్డీఏ నేతల హర్షాతిరేకాలు



**నక్కపల్లి, డిసెంబర్ 30:- మనసులో మాట..** పాయకరావుపేట నియోజకవర్గంలోని అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. నక్కపల్లి హెూం మంత్రి అనిత నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హెూం మంత్రి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "అనితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. పాయకరావుపేట నియోజకవర్గ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హెూం మంత్రి అనితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమన్నారు. ఇప్పటికే అధికారులు స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం హెూం మంత్రి అనిత నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు ఆమె సారథ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, 2019 నుంచి 2024 వరకు తెలుగుదేశం పార్టీ కోసం పోరాటాలు చేశారని చెప్పారు. స్టీల్ ప్లాంట్, బొమ్మల పరిశ్రమతో పాటు పలు పరిశ్రమలను ఈ ప్రాంతానికి తీసుకురావడంలో మంత్రి అనిత కీలక పాత్ర పోషిస్తున్నారని, దీని ద్వారా లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కలగనున్నాయని తెలిపారు. వ్యాపార రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నేత ధర్మశ్రీ వ్యాఖ్యలపై స్పందిస్తూ, అడ్డురోడ్డు వ్యాపార రంగానికి కీలక కూడలి అని, ఎలమంచిలిలో రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తాం అనుకున్నప్పుడు గత ఐదు సంవత్సరాలు మీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. నేరం, ఘోరం, భారం అంటున్నారు, అసలు ప్రభుత్వానికి మీరే భారమన్నారు. మూడు సంవత్సరాల తర్వాత రెవెన్యూ డివిజన్ ఎలమంచిలి తెచ్చుకుంటాం అంటే,మీ ప్రభుత్వం వచ్చేది లేదు చచ్చేది లేదన్నారు. మరో 30 సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాటలు మాట్లాడే ముందు ఆలోచించాలని, పాయకరావుపేట నియోజకవర్గం కోసం కానీ, అనితమ్మ కోసం కానీ తప్పుడు మాటలు మాట్లాడితే నాలిక కోస్తామని హెచ్చరించారు. ఎలమంచిలి, పాయకరావుపేట పక్కపక్క నియోజకవర్గాలని, మేమంతా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉంటామని కొప్పిశెట్టి వెంకటేష్ చెప్పారు. ఎస్. రాయవరం మండలం టీడీపీ అధ్యక్షులు అమలంకంటి అబద్ధం మాట్లాడుతూ, అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇవ్వని హామీలను కూడా మంత్రి అనిత నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. "అ అంటే అనితమ్మ, అ అంటే అభివృద్ధి" అని వ్యాఖ్యానించారు. ఎస్. రాయవరం మండల ప్రజల తరపున హెూం మంత్రి అనితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కోరుప్రోలు %రాజు% చైర్మన్ గుర్రం రామకృష్ణ మాట్లాడుతూ అడ్డరోడ్ గ్రామానికి రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన హెూంమంత్రి అనిత గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అడ్డరోడ్ లో జన్మించినందుకు మేమంతా గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ నాలుగు మండలాల నుండి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరి అభిమాన పాత్రుడు నూకు నాయుడు..

- టిడిపి మండల పార్టీ అధ్యక్షులు...గొంతిన శ్రీనివాసరావు
- జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి... ఉగ్గిన రమణమూర్తి
- జనసేన పార్టీ మండల అధ్యక్షులు.. బుదిరెడ్డి చిన్న




**కశింకోట, డిసెంబర్ 30 మనసులో మాట...** అందరికీ అభిమాన పాత్రుడు, మండలంలో తన శక్తి మేరకు, తోటి మిత్రుల, సహాయ సహకారాలతో సామాజిక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముఖ్యంగా శబరిమలై, తిరుపతి, విజయవాడ పాదయాత్ర ద్వారా వెళ్లే అయ్యప్పలు, గోవిందలు, భవానీలుకు, సౌకర్యాలు సత్కారాలు చేస్తున్న వ్యక్తి, అందరివాడిగా మండలంలో గుర్తింపు పొందిన వాడు నూకు నాయుడని కశింకోట మండల పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు , జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, కశింకోట జనసేన పార్టీ మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్న పేర్కొన్నారు. మంగళవారం కశింకోట మండల ఐ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జెర్రిపోతుల నూకునాయుడు జన్మదిన వేడుకలు ఘన%శీ%గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు. జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి మండల జనసేన పార్టీ అధ్యక్షులు బుధిరెడ్డి చిన్న తదితరులు నూకునాయుడను శాలువ తో సత్కరించి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ముగ్గురు మాట్లాడుతూ మంచివాడు మంచి మనసున్న వాడు యైన నూకునాయుడు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో ఎత్తుకి ఎదగాలని పార్టీలో ఉన్నత మైన పదవులు అధిరోహించాలని మనస్పూర్తిగా ఈ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ, మా అ బి ‚ న ం ద ´ న ల ం తెలియజేస్తున్నామన్నారు. . నూకు నాయుడు మాట్లాడుతూ తన జన్మదినాన్ని ఇందరు పెద్దల సమక్షంలో జరపడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారికి, ఉదయం నుండి నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు అని తెలిపారు.


ఈ కార్యక్రమంలో గొంతిన నాయుడు బాబు, మజ్జి శ్రీకర్, మరపురెడ్డి గిరిబాబు, ఆనల తాతీలు నాయుడు, కోన సురేష్, తెరపల్లి శీను, కోన రమణ, కలగట్ల వీర, పిల్లి ఆనంద్ కుమార్, పిల్లి రాజశేఖర్, నానిబాబు, బద్దపు అప్పారావు, సతీషు, సత్తిబాబు, వాసు, ఎర్ర జ్యోతి కుమార్, హరీష్ ,అప్పలస్వామినాయుడు, గణేశ్ , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా పాటిపల్లి

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో పూజలు

- శ్రీ నరసింహ స్వామిని దర్శించుకుంటున్న సుందరపు సతీష్ కుమార్





**మునగపాక, డిసెంబర్ 30, మనసులో మాట..** మండలంలో ఎంతో ప్రాముఖ్యత చెందిన పాటి పల్లి శ్రీ అహెూబిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేకువ జాబు నుండి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులతో ప్రత్యేక హెూమం నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉత్తరానంద్ర జిల్లాల సమన్వయకర్త సుందరపు విజయ్ కుమార్ కు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి నేత దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు టెక్కలి పరశు రాం, దాడి ముసిలి నాయుడు, బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు జనసేన నేత మొల్లేటి వెంకట భోగేశ్వర రావు, పాటిపల్లి జనసేన నేత ఆడారి భాస్కరరావు, ఆడారి అబ్బాయి నాయుడు, కోయిలాడ శంకరరావు, కోయిలాడ నరేంద్ర, ఆడారి కుమార్ పలువురు పాల్గొన్నారు. మునగపాక వారిచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వేలాదిమంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

# శ్రీ అహెూబిల నరసింహస్వామి గిరి ప్రదర్శనలో పాల్గొన్న బొడ్డేడ ప్రసాద్



**మునగపాక, డిసెంబర్ 30, మనసులో మాట..** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం పాటిపల్లి గ్రామంలో వెలసిన ఉన్న శ్రీ అహెూబిల లక్ష్మి నరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ గిరి ప్రదర్శనలో పాల్గొన్నారు. స్వామివారి గిరి ప్రదర్శన కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమై పాటిపల్లి కాలనీ, తోటాడ, నారాయుడుపాలెం, పాటి పల్లి, గొల్లపేట మీదుగా వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి స్వామివారిని పల్లకిపై ప్రత్యేకంగా అలంకరించి చిడతలు, సేవలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలతో వేలాదిమంది గిరి ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని తమ భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, మొల్లేటి వెంకట భోగేశ్వర రావు, బీసెట్టి ధన శ్రీను, పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో ముందస్తు

# నూతన సంవత్సర వేడుకలు

### కరస్పాండెంట్ ఎస్ గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో

**మునగపాక, డిసెంబర్ 30, మనసులో మాట..** స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిట్టి పొట్టి చిన్నారులు గ్రీటింగ్ కార్డ్స్ ను ఒకరికి ఒకరు పంచుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకొని, గాలిలోనికి బెలూన్స్ ఎగరవేస్తూ నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలోని వెలుగులు నింపాలని, ప్రతి విద్యార్థి మంచి పౌరులుగా ఎదగాలని ప్రిన్సిపల్ సునీత విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు విశ్రాంత నీటిపారుదల శాఖ ఏఈ మల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి స్మారక జ్యోతి యాత్రకు స్వాగతం



**నర్సీపట్నం, డిసెంబర్ 30 (మనసులో మాట)..** విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభల నేపథ్యంలో గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కు నుండి ప్రారంభమైన అల్లూరి స్మారక జ్యోతి యాత్ర మంగళవారం మధ్యాహ్నం నర్సీపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా ఈ యాత్రకు ముఠా కార్మికులు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ విశాఖలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోట్స్ ను రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు సామ్రాజ్యం, రమణమ్మ, కృష్ణవేణి, ముఠా, సాంబ, రాము, మున్సిపల్ వర్కర్ నాయకులు బాబురావు, ప్రసాదు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయంలో రివెన్యూ డివిజన్ కార్యాలయం



**ఎస్. రాయవరం, డిశంబర్ 30,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డులో నూతనంగా జనవరి 1 వతేదీన ప్రారంభం కానున్న రివెన్యూ డివిజన్ కార్యాలయం తిమ్మాపురం గ్రామసచివాలయ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామపంచాయితీ తీర్మాణం చేసింది. గ్రామసచివాలయాన్ని స్థానిక రైతుసేవాకేంద్రంకు మార్పుచేయాలని నిర్ణయించారు. మంగళవారం నర్సీపట్నం అర్డీఓ వివిరమణ అడ్డురోడ్డు జంక్షన్ లోని మౌళిక సదుపాయాలను స్థానికులుతో కలిసి పరిశీలించారు. జిల్లాకలెక్టర్ సూచన మేరకు గ్రామసచివాలయ కార్యాలయాన్ని ఎంపిక చేయటంతో ఏర్పాట్లు ప్రారంభించారు.

# జె నాయుడుపాలెం గ్రామంలో నగర సంకీర్తన



**రోలుగుంట మనసులో మాట, డిసెంబర్ 30..** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం నాయుడుపాలెం గ్రామంలో వైకుంఠ ఏకాదశి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులు చురుకుగా పాల్గొని గ్రామ పురవీధుల గుండా తిరిగి హరినామ స్మరణతో భజనలు, సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమం గ్రామస్తులలో భక్తి భావాన్ని మరింత ఉద్దీపించింది. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం నుంచే భక్తులు వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం నుంచే భక్తులు సమాగమం కావడం జరిగింది. గ్రామంలోని యువకులు ముందువరుసలో నిలబడి సంకీర్తన బృందానికి రాగం ఇచ్చారు. ప్రధాన రోడ్లు, పురవీధులు, ఆలయాల సమీపంలో తిరిగిన ఈ యాత్ర హరి నామాలు, రామ భజనలతో మారుమోగింది. గ్రామస్తులు అందరూ ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలోని యువకులు ఈ సంకీర్తనలో చురుకుగా పాల్గొని ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ప్రదర్శించారు. మహిళలు, పిల్లలు, పెద్దలు అందరూ భక్తి మయంగా చేరి గ్రామ ఐక్యతను ప్రతిబింబించారు వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం తెరుచుకుంటుంది శాస్త్రాలు చెబుతున్నాయి. ఇటువంటి సంకీర్తనలు పాప నిర్మూలనకు, మోక్ష ప్రాప్తికి మార్గం. జె. నాయుడుపాలెం గ్రామం ఇలాంటి ఆచారాలతో తన సంప్రదాయ భక్తిని కాపాడుకుంటూ యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తోంది.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## పరవాడ పోలీసుల హెచ్చరిక

**పరవాడ డిసెంబర్ 30 (మనసులో మాట)..** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి పరిసర ప్రాంతాలలో డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర సందర్భంగా పరవాడ మండలంలోని అన్ని ప్రాంతాలు మరియు గ్రామాలపై ప్రత్యేక దృష్టితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా మండలం అంతటా, అలాగే హైవేలు మరియు ప్రధాన రహదారులపై భారీ పోలీస్ మూమెంట్ ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తు అమలు చేయడమైనది. పోలీస్ సిబ్బంది విధుల్లో ఉండగా, పెట్రోలింగ్ టీములు డిసెంబర్ 31 రాత్రి అంతా తిరుగుతాయి. హైవేలు మరియు ప్రధాన రహదారులపై ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా అధిక వేగంతో లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాము. ముఖ్యంగా మోటార్ సైకిళ్లు మరియు ఇతర వాహనాలను నిర్లక్ష్యంగా లేదా ప్రమాదకరంగా నడిపే యువతపై, అలాగే తాగి వాహనాలు నడిపే డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేకమైన ప్రత్యక్ష నిఘా కొనసాగుతుంది. ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడితే సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, తాగి వాహనాలు నడిపిన వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుంది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే యువతపై మరింత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఈ సమయంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలు, రోడ్లపై అసాంఘిక కార్యక్రమాలు లా అండ్ ఆర్డర్ ఆటంకములు కలిగించిన లేదా ఏవైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

అలాగే, పోలీస్ అనుమతి లేకుండా ఎటువంటి ఈవెంట్లు లేదా కార్యక్రమాలు నిర్వహించరాదు. అనుమతి లేకుండా ఈవెంట్లు నిర్వహించి, అక్కడ శాంతిభద్రతల సమస్యలు తలెత్తినట్లయితే, నిర్వాహకులపై పూర్తి బాధ్యత విధించి కఠిన చర్యలు తీసు కొంటాము.

నూతన సంవత్సర సందర్భంగా ప్రజలందరూ శాంతియుతంగా, బాధ్యతతో, ఆనందంగా జరుపుకోవాలని పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి చేస్తున్నాము. తమ సెలబ్రేషన్స్ వల్ల ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ప్రజలను కోరడమైనది.

## మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



**కె కోటపాడు, డిసెంబర్ 30 (మనసులో మాట):** మాదకద్రవ్య రహిత భారత దేశంగా తీర్చిదిద్దేందుకు యువత ప్రోత్సాహం ఎంతో అవసరమని కె కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. పైడపు నాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రం కోటపాడు మూడు రోడ్ల కూడలిలో రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారతదేశంగా చూసేందుకు కాలేజీ విద్యార్థులతో మానవహారం ప్రతిజ్ఞ జరిగింది. ఈ కార్యక్రమంలో కోటపాడు జూనియర్ కళాశాల, అయ్యన్న విద్యాసంస్థల విద్యార్థిని విద్యార్థులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మాదకద్రవ్యాల రహిత దేశంగా ఉంచేందుకు యువత అదే ముఖ్య పాత్ర అని, దీనికి అందరూ నడుము బిగించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండే మీ వంతు సహకారం దేశానికి అందించాలని సీఐ పైడుపునాయుడు అన్నారు. కోటపాడు, ఏ.కోడూరు పోలీస్ స్టేషన్ లో ఎస్సైలు ధనుంజయ, లక్ష్మీనారాయణ లు కూడా మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ బంగారు భవిష్యత్తు కోసం, తల్లిదండ్రుల శ్రేయస్సు కోసం మంచి మార్గంలో నడవాలని, కొంత సమయం వెచ్చించి ప్రతి ఒక్కరికి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు యువత కూడా ప్రతి ఒక్కరికి తెలియజేయాలని అన్నారు. ఈ మానవహారం కార్యక్రమాలు ఆయా కాలేజీల అధ్యాపక బృందం, పోలీసు శాఖ, ప్రజలు పాల్గొన్నారు.

# నేటి రాత్రి హద్దు మీరితే కేసులే

**డిసెంబర్ 31 రాత్రి ఆంక్షలు విధించిన పోలీసులు - 7 బృందాలతో పోలీసుల పర్యవేక్షణ**
**ప్రెస్ మీట్ లో నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు వెల్లడి**



**నర్సీపట్నం రూరల్, డిసెంబర్ 30, (మనసులో మాట) :** ఈనెల 31 రాత్రి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే సందర్భంగా యువత హద్దు మీరి ప్రవర్తిస్తే కేసులు తప్పవని నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరానికి స్వాగత కార్యక్రమాన్ని కుటుంబంతోను స్నేహితులతోనూ సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. తాగి వాహనాలు నడిపినా, అల్లర్లు సృష్టించినా, తగాదాలు పడినా, రాష్ డ్రైవింగ్ చేసినా కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఆయన యువతకు సూచించారు. పెద్ద స్థాయిలో న్యూ ఇయర్ సెలబ్రేషన్ చేసుకునేవారు, పోలీసుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. సౌండ్ సిస్టం ఏర్పాట్లు ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండకూడదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 7 ప్రత్యేక బృందాలతో పటిష్టమైన పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్ధరాత్రి మద్యం తాగి రోడ్లపై అల్లర్లు సృష్టించినా, డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడినా, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలను పాటించి నూతన సంవత్సర వేడుకలు అందరూ సంతోషంగా గడుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. నర్సీపట్నంలో క్రైమ్ రేటు తగ్గించడంలో అభివృద్ధి సాధించామని, గత ఏడాది 419 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 192 కేసులు నమోదు అయ్యాయని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపారు. త్వరలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు జరుగుతుందన్నారు. గంజాయి రవాణా వాడకం నిరోధానికి, పోలీసు శాఖ అనేక రీతులలో అవగాహన కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగా విశాఖ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన "అభ్యుదయం సైకిల్ యాత్ర" పూర్తయిన సందర్భంగా జనవరి 3న ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో, పాదయాత్ర చేపట్టనున్నామని, సైకిల్ ర్యాలీ తో ప్రజలకు మరింత అవగాహన కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ షేక్ గఫూర్ పాల్గొన్నారు.

# వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు



**దేవరాపల్లి, డిసెంబర్ 30, (మనసులో మాట) :** ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం ద్వారా భగవంతుడిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం తెల్లవారుజాము నుంచే వెంకన్న ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేవరాపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు వెంకటేశ్వరుడు దర్శనమిచ్చారు. అలాగే మారేపల్లి పాండవుల కొండపై వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దర్శించి భక్తులు తరించారు. పల్లెల్లో రామ మందిరాలు, శ్రీకృష్ణ ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భగవాన్ నామస్మరణతో ఏకాదశి పూజలు నిర్వహించి గోవిందా గోవిందా శ్రీ వేంకటేశాయ నమో నమో అంటూ దేవదేవుడిని స్తుతిస్తూ భజనలు చేశారు. సీతంపేట శ్రీకృష్ణ ఆలయంలో, తిమిరాం శివాలయంలో, దేవరాపల్లిలో దేవి, శ్రీకృష్ణ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ మాసంలో విష్ణు ఆలయాలను సందర్శించి విష్ణుభగవానుడైన రూపాలను పూజించిన, దర్శించిన సకల శుభాలు కలుగుతాయన్న భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ వైకుంఠ ఏకాదశి పర్వదినంతో పల్లెల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

# నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్ లో డి.ఎస్.పి వార్షిక తనిఖీ




**నర్సీపట్నం రూరల్, డిసెంబర్ 30 (మనసులో మాట) :** పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలలో భాగంగా నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాసరావు మంగళవారం నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్ లో వార్షిక తనిఖీ నిర్వహించారు. కేసుల ఫైల్లు, స్టేషన్ రికార్డులు, వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న ఆస్తులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా ను అడ్డుకోవడం, ట్రాఫిక్ ట్రాఫిక్ నిర్వహణను బలోపేతం చేయడం, శాంతిభద్రతల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. దొంగతనాలు జరగకుండా నిరోధించే దిశగా రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ పటిష్టం చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిస్తున్న స్టేషన్ సీఐ, ఎస్ఐ లతోపాటు, సిబ్బందిని అభినందించడమే కాక, ప్రజలకు సేవ చేయడంలో మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ లు జె రమేష్, జి.ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు



**గాజువాక (మనసులో మాట) డిసెంబర్ 30..** ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని గాజువాక 72వ వార్డు పాతకర్నవానిపాలెం రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ డా.కరణంరెడ్డి నరసింగరావు జ్యోతి దంపతులు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకుంటే ఎంతో పుణ్యఫలం లభిస్తుందని అన్నారు. ముక్కోటి దేవతలకు ప్రత్యేక పూజలు చేసిన పుణ్య ఫలం లభిస్తుందని అన్నారు. రవికుమార్ శర్మ పంతులు ఆద్వర్యంలో ఉదయం ఐదు గంటల నుండి పూజలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సిరసపల్లి అప్పారావు, కార్యదర్శి సాలాపు నూకరాజు బారీగ మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికల్లో శశిధర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక



**అచ్చుతాపురం డిసెంబర్ 30 మనసులో మాట:** అనకాపల్లి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికల్లో అచ్యుతాపురం మండలం వెదురువాడ వీఆర్వో అమీరపు శశిధర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మడుతూరు వీఆర్వో ఆర్.సి.ఎచ్. నాయుడు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, భోగాపురం వీఆర్వో మల్లిఖార్జున్ అనకాపల్లి డివిజన్ ట్రెజరర్‌గా, చీమలాపల్లి వీఆర్వో శేషు డివిజన్ స్పోర్ట్స్ & కల్చరర్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో అచ్యుతాపురం తహసిల్దార్ కె.వరహాలు, ఉప తహసిల్దార్ శ్యామ్, మండల సర్వేయర్ మోహన్ శశిధర్ ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా స్థానిక మండలం నుంచి ప్రతినిధి ఎన్నికవడం గర్వకారణమని ఉప తహసిల్దార్ శ్యామ్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మండలం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు పలివెల వెంకటరావు, వీఆర్వోలు పొన్నాడ శ్రీను, సత్య, చిన్నప్పారావు, మండల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# సిఐటియు 18వ మహాసభలు

**- బహిరంగ సభకు కార్మికులు భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపు**




**అచ్చుతాపురం డిసెంబర్ 30 మనసులో మాట:** విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4, 2026 వరకు జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభల నేపథ్యంలో ఎస్ఈజెడ్ ముఠా కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆర్. రాము మాట్లాడుతూ, కార్మిక-కర్షక సమస్యల పరిష్కారానికై జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయడానికి జనవరి 4న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుండి ప్రారంభమయ్యే ర్యాలీకి, అనంతరం మున్సిపల్ స్టేడియం కొత్తరొడ్డులో జరిగే బహిరంగ సభకు కార్మికులు, ప్రజలు వేలాదిగా తరలివ రావాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులు, వేతనాల భద్రత, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్. నర్సింగరావు, దిబ్బపాలెం ముఠా కార్మికులు సత్తిబాబు, వెంకన్న, నానాజీ, లక్ష్మణ్, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.



## ఎం కోడూరు గ్రామంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

**వి మాడుగుల డిసెంబర్ 30 (మనసులో మాట)..** మాడుగుల మండలం ఎం కోడూరు గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు పెద్దింటి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారికి తులసి దళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మిల్లు వెంకటరమణ పూలమాలలు సమర్పించగా వూడి నానాజీ కుటుంబ సభ్యులు 101 దీపాలతో నూట అక్క కొబ్బరికాయలను కొట్టి పూజలు చేపట్టారు అలాగే గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారికి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు కోణం గ్రామానికి చెందిన సింహాచల అప్పన్న స్వామి మాలదారులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని మాడుగుల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కస్పా జగన్నాధపురం జంక్షన్ లో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోనూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు..

## మండలంలో పలు గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు



చీడికాడ, డిసెంబర్ 30, (మనసులో మాట) మండలంలో పలు గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి మండలంలో అడివి అగ్రహారం బి సింగవరం గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా రామాలయలలో పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలయాల్లో భజన కార్యక్రమాలు జరిగాయి.

## గంజాయి మహమ్మారిని తరిమికొడదాం

## మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**గోలుగొండ లో ఘనంగా 'సంకల్పం' కార్యక్రమం పాల్గొన్న 600 మంది విద్యార్థులు**



**గోలుగొండ, డిసెంబర్ 30, (మనసులో మాట)..** అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ గోలుగొండ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో మంగళవారం గోలుగొండ ఏపీఆర్ పాఠశాల జూనియర్ కళాశాలలో 'సంకల్పం' అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం హైస్కూల్ ఆవరణ నుండి గోలుగొండ మెయిన్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గంజాయిఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు ఎలా నాశనమవుతుందో పోలీసులు వివరించారు. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, సామాజిక ఇబ్బందులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను కోల్పోయిన వారి గాధలను, డ్రగ్స్ ప్రభావం మెదడుపై ఎలా ఉంటుందో తెలిపే ప్రత్యేక వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించారు. "వద్దు వద్దు గంజాయి వద్దు అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు గోలుగొండ వీధుల్లో మారుమోగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పోలీస్ అధికారులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| --- | --- | --- |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

బుధవారం 31 డిసెంబర్ 2025




నూతన సాంప్రదాయానికి ప్రతీకగా

# నూతన సంవత్సరం వేడుకలు

**- జిల్లా ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** నూతన సంవత్సర వేడుకలను సంయమనం, సామాజిక బాధ్యతతో కూడిన నూతన సాంప్రదాయానికి ప్రతీకగా జరుపుకోవాలని జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో ఇంటి వద్దనే నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ, మంచి విలువలు ప్రతిబింబించే విధంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

**జిల్లా ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు..**

జిల్లా ప్రజలందరికీ, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న సంవత్సరం జిల్లాలో శాంతి, అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమాజ పురోగతికి తోడ్పడాలని తెలిపారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే కానుకలు అందించాలి..**

నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే వారు పుష్పగుచ్ఛాలు, పూలదండలు, శాలువాలు వంటివి తీసుకురావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. వాటికి బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలు, పెన్నులు, విజ్ఞానాన్ని పెంపొందించే టెక్స్ట్ బుక్స్ తీసుకుని రావాలని కోరారు. విద్యను ప్రోత్సహించే ఆలోచనతో నూతన సంవత్సరాన్ని ప్రారంభించడం ఒక మంచి సంప్రదాయంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ మేరకు జిల్లా ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.



మండపేట నియోజకవర్గం..

తూర్పు గోదావరి జిల్లాలో

# విలీనం..

**- తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ**

**- ఇక నుండి తూర్పు గోదావరి జిల్లా లోనే కార్యకలాపాలు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** మండపేట నియోజకవర్గాన్ని పూర్తిగా రాజమహేంద్రవం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేస్తూ ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సాయి ప్రసాద్ దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చారు. అధికారిక కార్యకలాపాలు అన్ని ఇక తూర్పు గోదావరి జిల్లాలోనే జరుగుతాయి. తూర్పు గోదావరి జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్ లు రాజమహేంద్రవరం, కొవ్వూరు ఉన్నాయి. రాజమహేంద్రవరం డివిజన్ లో ఇప్పటికే రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట ఉన్నాయి. ఇపుడు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు చేరాయి. దీంతో ఈ డివిజన్ లో 13 మండలాలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్ లో తొమ్మిది మండలాలు ఉన్నాయి. మొత్తం తూర్పు గోదావరి జిల్లాలో 22 మండలాలు ఉండగా రాష్ట్రంలో ఇదే అతి పెద్ద జిల్లాగా అవతరించింది. ఈ జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, మండపేట, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీ లు ఉన్నాయి. కాగా మండపేట నియోజకవర్గం అమలాపురం పార్లమెంట్ పరిధిలో ఉంటుంది. నియోజకవర్గంలో ఉన్న పోలీసు, ఇరిగేషన్ తో పాటు అన్ని డిపార్ట్మెంట్ లు సాంకేతికంగా తూర్పు గోదావరి జిల్లాలోకి వస్తాయి. కొత్త సంవత్సరం కొత్త జిల్లాలో మండపేట వాసులు అడుగుపెడుతున్నారు. మండపేట జేఏసీ కన్వీనర్ కామన ప్రభాకరరావు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. తాము చేసిన పోరాట ఫలితంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కృషి తో విజయం సాధించామన్నారు. కాగా నేటి (బుధవారం) ఉదయం 10 గంటలకు మండపేట పుర కార్యాలయంలో అన్ని పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



వైకుంఠ ద్వారం దర్శనం లభిస్తే

# మహా పుణ్యఫలం

**ముక్కోటి ఏకాదశి వేడుకల్లో వాడపల్లి వెంకన్న తొలి హారతి ఉత్తర ద్వార దర్శనం చేసిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు**

**కొత్తపేట మనసులో మాట డిసెంబర్ 30..** కోనసీమ తిరుమలగా పేరొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించరు. మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తొలి హారతితో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక, పరవశించింది. వైకుంఠ ద్వారం దర్శనం లభిస్తే మహా పుణ్యఫలం కలుగుతుందనే విశ్వాసంతో తెల్లవారు జామున నుండి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ తొలి దర్శన కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ కుమార్ మధుర్, కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, కుటుంబ సమేతంగా పాల్గొని స్వామిఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు ప్రజాప్రతినిధులందరికీ వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఎంపీ గంటి హరీష్ కుమార్ మధుర్ మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి రోజున వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనం లభించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కోనసీమ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, వాడపల్లి వెంకన్న దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల జీవితాల్లో శాంతి, భద్రత, సంక్షేమం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి,సంక్షేమం రెండింటినీ సమానంగా సాధించాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు, మీడియా మిత్రులకు, అధికారులకు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలకు ముక్కోటి ఏకాదశి, ఆంగ్ల నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలలో భాగంగా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చిత్రపటాలను ప్రజాప్రతినిధులు తిలకించారు. ఏర్పాట్లకు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించిన ఆలయ యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బండారు సంజీవ్ , పాలక మండలి సభ్యులు , అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.





## తొలి తిరుపతిలో వైభవంగా ముక్కోటి ఉత్సవాలు

**పెద్దాపురం (మనసులో మాట) డిసెంబర్ 30..** యావత్ భారతదేశంలోని అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఆలయ ఈవో వడ్డీ శ్రీనివాసరావు చైర్మన్ మొయ్యిళ్ల సంధ్య ఆధ్వర్యంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు శ్రీ భూ సమేత శ్రీశృంగార వల్లభ స్వామికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. దేశ నలుమూలల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఉత్తర ద్వారం నుండి స్వామిని దర్శించారు. వైకుంఠ నారాయణ ఉత్తర ద్వార దర్శనం అత్యంత శుభప్రదమని అర్చకులు రవి ఆచార్యులు తెలిపారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు తదితర ప్రముఖులు శృంగార వల్లభ స్వామిని దర్శించారు. ఈవో వడ్డీ శ్రీనివాసరావు, చైర్మన్ సంధ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబులను ఆలయంలో ఘనంగా సత్కరించి, పండితులు వేద ఆశీస్సులు అందించారు. ముక్కోటి ఏకాదశి గడియల్లో స్వామిని దర్శించడం ఆనందదాయకంగా ఉందని వివిధ ప్రాంతాల భక్తులు తెలిపారు. ఆలయంలో భక్తులకు అన్న సమర్పణ ప్రసాదం పంపిణీ చేశారు.

# జీవితం ధన్యమైంది..



**- మండపేట తూర్పు గోదావరి జిల్లాలో విలీనమైంది..**

**- రెండు రోజులు ముందుగానే ప్రజలకు నూతన సంవత్సరం కానుక అందివ్వడం ఆనందంగా ఉంది.. - ఎమ్మెల్యే వేగుళ్ళ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** జిల్లా విలీనం అనేది మండపేట నియోజకవర్గ ప్రజలకు ఓ చారిత్రక అవసరమని, నేడు దాన్ని సాధించడం జీవితం ధన్యమైనట్లుగా భావిస్తున్నట్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. డిసెంబరు 31 నుండి మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా గల తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే వేగుళ్ళ హర్షం వ్యక్తం చేశారు. ఆనాడు ఎన్నికల సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు, సబ్ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. మరీ ముఖ్యంగా జిల్లా విలీనం పోరాటంలో భాగమైన జేఏసీ సభ్యులందరికీ, అలాగే ఆనాటి నిరాహార దీక్షలోనూ, ఉద్యమంలోనూ భాగమైన ప్రజలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు ప్రతీ ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు చెప్పారు. అదే విధంగా ఉద్యమానికి తొలి అడుగు వేసిన మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు చెప్పారు. వీరితో పాటు తాను కోరిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా ఏకగ్రీవ తీర్మానాలు చేసి సహకరించిన అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, వార్డు సభ్యులు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండల పరిషత్ అధ్యక్షులు, ఎంపిటిసి లు, జెడ్.పి.టి.సి లు, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లకు ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

**- ప్రభుత్వ కళాశాల మధ్య అవగాహనా ఒప్పందం**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** రాజమహేంద్రవరం లోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్), ప్రభుత్వ కళాశాల (అటానిమస్), రాజమహేంద్రవరం మధ్య మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అవగాహన ఒప్పందం (ఎంఓఏ) జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఆవిష్కరణలు, ఔత్సాహిక వ్యాపారాలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్- అదనపు జిల్లా మేజిస్ట్రేట్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ డైరెక్టర్ వై మేఘ స్వరూప్ సమక్షంలో అవగాహనా ఒప్పందం మార్పిడి జరిగింది. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పరిశ్రమ అనుభవం, పరిశోధన, సామర్థ్యాభివృద్ధి వంటి విస్తృత అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నోడల్ అధికారి టీవీ సూర్య ప్రకాశ్, ఇంక్యుబేటర్ హెడ్ కే చంద్రశేఖర్, ప్రభుత్వ కళాశాల (అటానిమస్), రాజమహేంద్రవరం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్ కే., కళాశాల అధ్యాపకులు, ఆర్టీఐహెచ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ప్రాయోగిక జ్ఞానం, ఔత్సాహిక నైపుణ్యాలు అభివృద్ధి చెందనున్నాయని, యువ ప్రతిభను పెంపొందించడంలో, ఆవిష్కరణ ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహించడంలో, ప్రాంతీయ అభివృద్ధికి ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

# ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

**- లోక కల్యాణార్థం పలు దేవాలయాల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూజలు**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలే అనుగ్రహించమని ఆ భగవంతుడిని కోరినట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగరంలోని పలు దేవాలయాలను సందర్శించారు. గోదావరి గట్టున ఉన్న క్షేత్ర పాలకుడు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, ఆర్యాపురంలోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయం, దేవిచౌక్ లోని లలిత జ్యుయేలర్స్ పక్కన ఉన్న ఆలయం, దేవి చౌక్ లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించేలా కరుణించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ సందర్భంగా వేడుకున్నారు.

## నూతన సంవత్సరానికి ముందస్తు పెన్షన్ పంపిణీ



**నిడదవోలు (మనసులో మాట) డిసెంబర్ 30..** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 2025 డిసెంబర్ 31వ తేదీనే సామాజిక పెన్షన్ల పంపిణీ చేయాలని మంత్రి కందుల దుర్గేష్ తెలియజేశారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేయాలన్నారు. భద్రత, భరోసా, చిరునవ్వులతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టేలా ప్రభుత్వ ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు.

# ప్రెస్ క్లబ్ ను స్వాధీనం చేసుకోండి

**- మీడియా విలువలను కాపాడండి - ప్రెస్ క్లబ్ ను దుర్వినియోగం చేస్తున్నారు**

**- రాజమండ్రి ఆర్డీఓ కు వినతి పత్రం అందజేసిన పాత్రికేయ జేఏసీ బృందం**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** రాజమహేంద్రవరం పాత్రికేయుల కోసం ప్రభుత్వ నిధులతో నిర్మించిన 'ప్రెస్ క్లబ్' ను అడ్డాగా చేసుకుని పలువురు మీడియాను భ్రష్టు పట్టిస్తున్నారని, వెంటనే అధికారులు ఆ క్లబ్ కు తాళాలు వేసి స్వాధీనం చేసుకోవాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్ కృష్ణ నాయక్ కు 'వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ' విన్నవించింది. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కృష్ణ నాయక్ ను జేఏసీ బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ప్రెస్ క్లబ్ పేరుతో కొందరు చేస్తున్న ఆగడాలను, అక్రమ దందాలను, అరాచకాలను ఆర్డీఓ కు వివరించారు. ప్రశ్నించే పాత్రికేయుల సభ్యత్వాలను తొలగించి ఒంటెద్దు పోకడలతో రాజమండ్రి నగరంలో పాత్రికేయులకు విలువ లేకుండా చేస్తున్నారని జేఏసీ ప్రతినిధుల బృందం వివరించింది. బైలా ప్రకారం ఏటా ఎన్నికలు నిర్వహించాలని..కానీ గత ఏడు సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించకుండా 'పెత్తనం' చెలాయిస్తున్నారని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. జమా ఖర్చులకు సంబంధించి ఏ విధమైన అకౌంట్స్ చూపడం లేదని, ప్రశ్నిస్తున్న సహచర జర్నలిస్టులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆర్డీఓ కు వివరించారు. జర్నలిస్టులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టులను మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆర్డీఓ కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రెస్ క్లబ్ భవనం ప్రభుత్వానిది కాబట్టి..ఆ భవనానికి తాళాలు వేసి అధికారులు స్వాధీనం చేసుకోవాలని జేఏసీ బృందం ఆర్డీఓ కు సూచించింది. గత ఏడేళ్ళుగా ప్రెస్ క్లబ్ లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, సభ్యత్వ పునరుద్ధరణ, కొత్త సభ్యత్వాల నమోదు ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు నిర్వహించే వరకూ ప్రత్యేక అధికార పర్యవేక్షణ అవసరం ఉందని ఆర్డీఓ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా జేఏసీ బృందం వివరించింది. పాత్రికేయుల విలువలు కాపాడే దిశగా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. అనంతపురం ప్రెస్ క్లబ్ సీజ్ చేసిన వైనాన్ని ఆర్డీఓకు తెలియజేస్తూ.. అటువంటి చర్యలు ఇక్కడా చేపడితేనే న్యాయం జరుగుతుందని చెప్పారు. దీనిపై ఆర్డీఓ కృష్ణ నాయక్ సానుకూలంగా స్పందించారు. అనంతరం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో..త్వరలో చేపట్టబోయే రిలే నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.



శాంతి భద్రతలకు

# అధిక ప్రాధాన్యం

- నేరాలు కొంత తగ్గుదల...
- నూతన సంవత్సర వేడుకలలో హద్దు మీరితే చర్యలే....
- జిల్లా ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** కాకినాడ జిల్లాలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కాకినాడ జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ జి. బిందు మాధవ్ చెప్పారు. 2025లో కొంత శాతం నేరాలు తగ్గడానికి వివిధ రూపాల్లో పోలీసులు చేసిన కృషి ఫలించిందని ఎస్పీమంగళవారం వెల్లడించారు. 2026 నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నెర వేర్చుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. డిసెంబర్ 31వ తేదీ బుధవారం రాత్రి మద్యం తాగి వాహనాల ద్వారా శబ్ద కాలుష్యం నిర్వహించి రోడ్లపై తిరిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బిందు మాధవ్ హెచ్చరించారు. మంగళవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో 2025 సంవత్సరానికి సంబంధించి వార్షిక నివేదికను విలేకరులకు వివరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా 2025లో నేరాల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఆస్తి నేరాలు 738 జరగా ప్రస్తుతం వేయి నమోదుతో 35.50 శాతం పెరిగాయన్నారు. వీటి రికవరీలో ముందంజలో ఉన్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు రౌడీషీటర్లు దొంగతనాలు చేసే వారిపై దృష్టి సారించి 229 మందిపై కేసులు నమోదు చేసామన్నారు. గత సంవత్సరం 105 మందిపై కేసు నమోదు చేయగా ప్రస్తుత సంవత్సరం వారి పట్ల అప్రమత్తంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు దృష్టి సారించారని తెలిపారు. అపహరణకు గురైన బంగారం వెండి ఇతర వస్తువుల రికవరీలో పురోగతి సాధించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 5.215 గ్రాములు బంగారం. 92. 401 గ్రాముల సిల్వర్ రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. అలాగే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు గత సంవత్సర 65 నమోదు కాగా ప్రస్తుతం 46 కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్లో సుమారు14 కోట్ల రూపాయల వరకు కోల్పోగా తక్షణం ఫిర్యాదు చేయడంలో బాధితుల ముందుకు రాకపోవడంతో రికవరీ చేయడం కష్టమైందని తెలిపారు . సైబర్ క్రైమ్లో భాగంగా జాతీయ బ్యాంకులు అయితే రికవరీకి ఎక్కువ అవకాశమని అదే విదేశీ బ్యాంక్ అయితే రికవరీ కష్టమవుతుందన్నారు. నిజానికి సైబర్ నేరాల నియంత్రణలో మెరుగు కనబరిచిన సిబ్బందిని ఆయన అభినందించారు.

గతంలో 2715 నేరాలు జరగా ప్రస్తుత సంవత్సరం 1739 నేరాలు మాత్రమే జరిగాయన్నారు. బాధితులకు 95.24 లక్షల రూపాయలు రికవరీ చేసినట్లు తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టమన్నారు. గుడ్ టచ్ బి బ్యాడ్ టచ్ పైన 1676 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. గత సంవత్సరం అత్యాచార కేసులు 19 నమోదు కాగా ప్రస్తుత సంవత్సరం 10 మాత్రమే నమోదయ్యాన్నారు. అలాగే వరకట్నం వేధింపులు తగ్గాయని వివరించారు. ఆస్తి సంబంధిత నేరాల్లో గత సంవత్సర 57 శాతం నమోదు కాగా రికవరీ 62 శాతానికి పెరిగిందని వాటి విలువ ఐదు కోట్ల 60 లక్షల 20వేల 79 రూపాయలుగా ఉందన్నారు. రోడ్డు ప్రమాద భద్రత గతం కన్నా 22 శాతం తగ్గిందని తెలిపారు. ముఖ్యంగా టెక్నాలజీతో నేర నియంత్రణ గణనీయంగా పర్యవేక్షించడం జరుగుతుందని ప్రతి నిత్యం 18 డ్రోన్లతో నిఘా 4418 పైగా సీసీ కెమెరాలు బాడీ బార్న్ కెమెరాలతో పరివేక్షణ స్మార్ట్ పార్కింగ్ అలర్ట్ సిస్టం అమలు తదితర అంశాల్లో కాకినాడ జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా నేర అసాంఘిక చర్యలు జరగకుండా పర్యవేక్షించడంలో ముందంజలో ఉన్నారని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ సమావేశంలో కాకినాడ డిఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రావు ఏఎస్పి ఎస్ శ్రీనివాసరావులతో బాటు జిల్లాలోని సిఐలు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి

- భక్తులకు ఉత్తర ద్వార దర్శనం - పూలంగిసేవలో రౌతు దంపతులు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** స్థానిక ఆనం కళా కేంద్రం ఆవరణలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తెల్లవారు జాము నుంచి ఉత్తర ద్వారం ద్వారా శ్రీవారి దర్శనం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు, సౌభాగ్యలక్ష్మి దంపతులు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ సూర్యకుమారి దంపతులు పూలంగి సేవలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు వాడపల్లి శ్రీనివాసాచార్యులు స్వామి వారికి పూజా కార్యక్రమం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రౌతు సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ ముక్కోటి దేవతలు స్వామివారి దర్శనానికి వచ్చే పవిత్రమైన రోజు ముక్కోటి ఏకాదశి అని అందుకనే దేశంలోని వైష్ణవాలయాలన్నీ కళకళలాడుతున్నాయని అన్నారు. స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని రౌతు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, మార్గాని భరత్ రామ్ దంపతులు, సుప్రీం కోర్టు న్యాయవాది అల్లంకి రమేష్, అల్లు బాబి, సీసీసీ చానెల్ ఎండీ పంతం కొండలరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఉపాధ్యక్షుడు యియ్యపు మురళీధర్, మాజీ కార్పొరేటర్లు పోలసానపల్లి హనుమంతరావు, ఇన్నమూరి రాంబాబు, ఏవీ రమణ, పోలు విజయలక్ష్మి, ప్రసాదుల హరినాథ్, బెజవాడ రాజ కుమార్, మింది నాగేంద్ర, మాజీ డిప్యూటీ మేయరు బాక్స్ ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, వీఎస్ఎస్ కృష్ణకుమార్, నందూరి సుబ్బారావు, విశ్రాంత ఆర్డీవో, అన్నవరం దేవస్థానం మాజీ ఈఓ జితేంద్ర, పెదిరెడ్ల శ్రీనివాస్, తలుపూరి ప్రసాద్, సాయిబాబా, మెట్ల ఏసుపాదం, పోలాకి పరమేష్, వరదా కిరణ్, దేశిరెడ్డి బలరామనాయుడు, అడబాల రామకృష్ణారావు, అజంతా హోటల్ బాబు, మార్గాని సురేష్ పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తి శ్రద్ధలతో ఏకాహం

- ఎనిమిది గ్రూపులు నిర్విరామంగా 24గంటలు భజనా కార్యక్రమం



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 30..** జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామంలో గురుదత్త శిరిడి సాయి వీరాంజనేయ సహిత విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా గ్రామం మంచి కోసం,లోక కళ్యాణార్థం 8 గ్రూపులు తో 24 గంటలు నిర్విరామంగా భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎనిమిది గ్రూపులుగా భజన సమాజం వారు మంగళవారం ఉదయం 6గంటలనుండి బుధవారం ఉదయం 6గంటల వరకు నిర్విరామంగా 24 గంటల వరకు వివిధ భక్తి గీతాలతో భజనా కార్యక్రమం కొనసాగించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భజన సమాజం వారికి భోజన సదుపాయం అన్ని వసతులు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ భజనా కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భజన సమాజం వారు, వారి గురువుల పర్యవేక్షణలో నేర్చుకున్న భక్తి గీతాలను ఒకరికి ఒకరు పోటీతత్వం తో భక్తి భావనతో ఆలపించారు. అనంతరం దేవి సెంటర్ భజన సంఘం వారు లక్ష్మీ కన్నా గురువును పూలమాలలతో శాలువాలతో సత్కరించారు మరియు మిగిలిన భజన సమాజం వారు వారి గురువులను పూలమాలలతో సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు,గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొనడం జరిగింది

# జనవాసాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో కొత్త బ్యాంకు బ్రాంచీలు ఏర్పాటు ఆర్థిక సేవలు మరింత చేరుఅవుతాయి – కలెక్టర్




**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 30:** జన నివాసాలు సంచారం ఎక్కువగాఉన్న ప్రాంతాలలో కొత్తగా బ్యాంకు బ్రాంచీల ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు ఆర్థిక సేవలు మరింత చేరువ అవుతాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం అమలాపురం మోబెర్లి పేట టయోటా షోరూం ఎదురుగా ఇండి యన్ బ్యాంకు రెండవ బ్రాంచ్ ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బ్రాంచ్ వల్ల ఖాతాదారులు తమ రోజువారీ బ్యాంకింగ్ అవసరాలను సులభంగా, వేగంగా నిర్వహించుకునే అవకాశం లభిస్తుందన్నారు.

బ్యాంకు బ్రాంచీలు సమీపంలో ఉండడం వల్ల నగదు లావాదేవీలు, ఖాతాల నిర్వహణ, రుణాలు, డిపాజిట్లు, పెన్షన్, ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా పొందడం సులభమవుతుంద న్నారు. ముఖ్యంగా బ్యాంకు రుణంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ పథకాలు మంజూరులో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. సమాజాభి వృద్ధిలో బ్యాంకుల కీలక భూమిక పోషించాలని ఆయన స్పష్టం చేశారు ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా స్వయం సహాయక సంఘాలు వృద్ధులు దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా సేవలను వినియోగించుకోగలుగుతారన్నారు. డిజిటల్ లావాదేవీ లపై అవగాహన పెరగడం, ప్రజలు ఆర్థికంగా మరింత బలప డతారన్నారు. ఎల్ డి ఎం కేశవ వర్మ ప్రసంగిస్తూ బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరణతో పారదర్శకత పెరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధి దారులకు అందుతాయ న్నారు. బ్యాంకు బ్రాంచీల ఏర్పాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతూ, ప్రజలకు భద్రమైన విశ్వసనీ య ఆర్థిక సేవలను అందిం చడంలో కీలక పాత్ర పోషిస్తా యన్నారు..బ్యాంకు బ్రాంచీల సంఖ్య పెరగడం వల్ల గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక చేరిక మెరుగవుతుందని. ఇది పేదరిక నిర్మూలనకు, వ్యవసాయ రుణాల అందుబాటుకు సహాయపడుతుందన్నారు. రైతులు, చిన్న వ్యాపారులకు ప్రత్యక్ష లాభాలు చేకూర్చుతుందన్నారు. బ్యాంక్ మేనేజర్ మోతి లాల్ ప్రసంగిస్తూ బ్రాంచీల విస్తరణ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందు బాటులోకి తీసుకువస్తుందన్నారు, జన్ ధన్ యోజన వంటి పథకాల అమలుకు సహకరిస్తుందన్నారు. ఇది డిపాజిట్లు, రుణాలు సులభంగా అందేలా చేస్తుందన్నారుగ్రామీణ అభివృద్ధివ్యవసాయ రంగానికి ప్రాధాన్యత రుణాలు పెరిగి, రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించగలుగుతారన్నారు ఉత్పత్తి పెరుగుద లకు, పేదరిక తగ్గించడానికి దోహదపడుతు ందన్నారు. ఉపాధి సృష్టి బ్రాంచీల ఏర్పాటు స్థానిక ఉద్యోగా లు, పరోక్ష ఉపాధి అవకా శాలు పెంచుతుందన్నారు వివిధ పరిశ్రమలకు రుణాలు అందుతూ చిన్న వ్యాపారాలు పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడు తుందన్నారు. మహిళలు, బలహీన వర్గాలకు ఆర్థిక సాధికారత పెరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## మధ్య తరగతి కుటుంబం వారి

# సొంతింటి కల

- రాష్ట్ర హౌసింగ్ బోర్డు భారీ ప్రణాళిక




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. గతంలో స్తబ్దత గా ఉన్న ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి అత్యాధునిక వసతులతో కూడిన నూతన లేఅవుట్లను అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ సలహాదారుల పర్యవేక్షణలో రియల్ ఎస్టేట్ నిపుణుల సూచనలతో లాభాపేక్ష లేని రీతిలో నాణ్యమైన స్థలాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హౌసింగ్ బోర్డు భూములను గుర్తించి వాటిని స్మార్ట్ టౌన్‌షిప్‌లుగా మార్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పట్టణ ప్రాంతాలకు సమీపంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో కూడిన లేఅవుట్లను వేసి మధ్యతరగతి ప్రజలకు సరసమైన ధరలకే అందించనున్నారు. ఈ లేఅవుట్లలో 60 అడుగుల రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పార్కులు మరియు కమ్యూనిటీ హాళ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. తక్కువ ఆదాయ వర్గాలు మధ్య ఆదాయ వర్గాల కోసం వేర్వేరు ధరల శ్రేణిలో ప్లాట్లను కేటాయించేలా చర్యలు చేపడుతున్నారు.

ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే ప్రైవేట్ వెంచర్లకు ధీటుగా అత్యున్నత ప్రమాణాలను పాటించడం. మధ్యతరగతి ప్రజలకు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకే గృహ రుణాలు లభించేలా హౌసింగ్ బోర్డు ప్రత్యేక ఒప్పందాలు చేసుకోనుంది. దీనివల్ల సామాన్యులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ పారదర్శకత పెరుగుతుంది. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు విశాఖపట్నం విజయవాడ తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో పైలట్ ప్రాజెక్టులుగా ఈ లేఅవుట్ల అభివృద్ధిని ప్రారంభించనున్నారు. కొద్ది నెలల్లోనే ఈ నూతన లే అవుట్లకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి.



ఆర్యాపురం కృష్ణ చైతన్య ఆశ్రమంలో

# ముక్కోటి ఏకాదశి వేడుకలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి భారీగా తరలివచ్చారు. భక్తి కంకణ వన మహారాజ్ స్వామి వారికి విశేష హారతులు ఇచ్చారు. మంగళవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆశ్రమ ఇన్ ఛార్జ్ హరిదాసు బ్రహ్మచారి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరి పైనా ఉండాలని కృష్ణ భగవానుడిని కోరుకున్నట్టు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

కాకినాడ జిల్లాకు దాల్వా సాగు తో పాటు అన్ని రకాల పంటలకు

# 35576 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం..

జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వెల్లడి



**కాకినాడ( మనసులో మాట) డిసెంబర్ 30..** కాకినాడ జిల్లాలో దాళ్వా 2025 కు అన్ని రకముల పంటలకు గాను 35576 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉన్నదని అలాగే డిసెంబర్ 2025 వరకు 14,861 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు 12,725 మెట్రిక్ టన్నులు సరఫరా చేయడం జరిగినది. కాగా గత 29 వ తేది నాటికి 5029 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉంచడం జరిగినది. ప్రస్తుతం ప్రైవేటు రిటైల్ డీలర్లు వద్ద 2853 మెట్రిక్ టన్నులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల వద్ద 584 మెట్రిక్ టన్నులు రైతు సేవ కేంద్రమములలో 1137 మెట్రిక్ టన్నులు ప్రైవేటు హోల్ సేలు డీలర్లు వద్ద 66 మెట్రిక్ టన్నులు ఎపి మార్కఫెడ్ వద్ద 389 మెట్రిక్ టన్నులు వెరసి 5029 మెట్రిక్ టన్నులు యురియా జిల్లా లో అందుబాటులో ఉంచడం జరిగినది. అలాగే గత 28వ తేదీ న ఐ ఎఫ్ ఎఫ్ సి ఓ రేక్ ద్వారా 653 మెట్రిక్ టన్నులు సి ఐ ఎల్ రేక్ ద్వారా 1200 మెట్రిక్ టన్నులు వెరసి 1853 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లా కు వచ్చినది. 1853 మెట్రిక్ టన్నులు యూరియాను అవసరమైన మండలాలలోని డీలర్లకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతు సేవ కేంద్రమములకు సరఫరా చేయడం జరిగింది. జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ఎరువుల కొరత లేదు. అవసరమైన యురియా సరఫరా సంతృప్తికరంగా ఉన్నది. కనుక రాబోయే పంట కాలం లో కుడా యురియాకు ఎటువంటి కొరత రాదని తెలియపరచడమైనది. కావున రైతు సోదరులకు తెలియచేయడం ఏమనగా ఎరువులను కొనుగోలు చేయునప్పుడు బస్తా పై ముద్రించిన ఎం. ఆర్. పి ధరలను చూసుకుని దాని ప్రకారము పైకము చెల్లించి తప్పని సరిగా డీలరు నుండి రసీదు పొందవలెను. నూతనంగా రూపొందించిబడిన సాంకేతికంగా అభివృధి పరచిన నానో యూరియా నానో డి.ఎ.పి ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం జరిగినది. ప్రస్తుతం 722 లీటర్ల నానో యూరియా రైతు సేవ కేంద్రములలో అందుబాటులో ఉంచడం జరిగినది. ఇవి సాంప్రదాయ ఎరువులకు నూరు శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సాహిస్తున్నాయి. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా ఎరువులను మళ్లింపు చేసిన ఎంఆర్ పి ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించిన ఎడల వారి యొక్క లైసెన్స్ లు రద్దు చేసి ఎరువుల నియంత్రణ చట్టం 1985, ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకొనబడు తుందాన్నారు.

# శ్రీ ప్రజ్ఞలో మెగా మెడికల్ క్యాంపు




**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 30..** జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు,తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మెగా మెడికల్ మరియు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది.విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రతి సంవత్సరం శ్రీ ప్రజ్ఞ స్కూల్,కాలేజ్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చైర్మన్ బండారు నాగబాబు తెలిపారు. క్యాంప్ లో రాజపూడి పి హెచ్ సి ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.పూజ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ విద్యార్థులలో రక్త హీనత వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, తల్లిదండ్రులు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు.రాజేశ్వరి రామకృష్ణన్ కంటి ఆసుపత్రి సిబ్బంది విద్యార్థుల దృష్టి లోపాలను పరీక్షించి తల్లిదండ్రులకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, వైద్య సిబ్బంది ఉమా మహేశ్వరావు,శంకర్,లక్ష్మీ, మౌనిక,వరలక్ష్మి,మంగ, గంగరాజు, గోవిందరావు, కాలేజ్ ప్రిన్సిపాల్ కె అభి,హై స్కూల్ ప్రిన్సిపాల్ అడపా సాయి దీప్తి,ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ టి.నాగ లక్ష్మీ, ఇంచార్జి కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, అడపా ఆనంద్, మహేంద్ర ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# త్వరలో జగ్గంపేటలో నారాయణ విద్యాసంస్థలు

### ముక్కోటి ఏకాదశి సందర్భంగా నారాయణ ఆఫీస్ ప్రారంభం

**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 30..** ఆసియా లోనే అతి పెద్ద విద్యా సంస్థ అయిన నారాయణ విద్యా సంస్థ మన జగ్గంపేటలో మరో నూతన అధ్యాయానికి నాంది పలికింది, మొట్టమొదటి సారిగా మన జగ్గంపేటలో సి బి ఎస్ సి కరిక్యంతో 2026-27 విద్యా సంవత్సరం నుండి మన ముందుకు వస్తోంది. విక్టరీ బజార్ వెనుక నూతన భవన నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నూతన ఆఫీసును సర్వీస్ రోడ్ లోని విక్టరీ బజార్ వెనుక ఉన్న పాఠశాల ప్రాంగణంలో నారాయణ పాఠశాలల ఏజీఎం స్రవంతి, బిల్డర్ కొత్త కొండ బాబు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఏజీఎం స్రవంతి మాట్లాడుతూ చదువుపై ఏకాగ్రత కోసం, లక్ష్యాన్ని చేరాలనే పట్టుదల కోసం, గెలిపే లక్ష్యంగా జీవించే వారికోసం నారాయణ స్కూల్స్ జగ్గంపేటలో న్యూ బ్రాంచ్ ప్రారంభిస్తున్నామని అందులో భాగంగా విక్టరీ బజార్ వెనకాల నూతన స్కూల్ భవనాలు శరవేగంగా నిర్మాణం అవుతున్నాయని నర్సరీ నుండి తొమ్మిదవ తరగతి వరకు అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించామని ప్లే వే మెథడ్ శిక్షణ, టెక్నాలజీని అనుసంధానం చేస్తూ రూపుదిద్దుతున్న క్లాస్ రూమ్స్, ఓర్పు నేర్పు గల అనుభవం కలిగిన స్టాఫ్ ఇలా అన్ని రకాల వసతులతో నారాయణ విద్యాసంస్థలు జగ్గంపేటలో నెలకొల్పుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ళు అరెస్ట్



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 30..** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ కు రాబడిన సమాచారం మేరకు కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామ శివారు తిరుమలాయపాలెం వెళ్లే రోడ్డులో పేకాట రాయుళ్ల మీద దాడి చేసిన జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు మరియు సిబ్బంది ఈ సందర్భంగా ఎనిమిది మంది పేకాట రాయుళ్ల ను అరెస్టు చేసి వారి వద్ద 13,200 రూపాయలనుస్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది.జగ్గంపేట గండేపల్లి , కిర్లంపూడి మండలాల్లో ఎక్కడైనా కోడిపందాలు, గుండాటలు పేకాటలు, బొమ్మ బొరుసు, ఎత్తులాట, కోత బంతి ఆట లాంటి జూద క్రీడలకు ఎవరు పాల్పడినా కాకినాడ జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్94949 33233, 9440796529 లేదా 9440796508 ,లేదా 100 లేదా 112 కు సమాచారం ఇవ్వ వలసినదిగా సీఐ వై అర్ కే తెలియజేశారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి

### బీజేపీ సీనియర్ నేత సూర్యనారాయణ



**రామచంద్రపురం (మనసులోమాట) డిశంబరు 30..** పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారి ఆలయం ప్రాంగణంలోని సప్తగోదావరి ఒడ్డున ఉన్న అతి పురాతమైన శివలింగాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, బీజేపీ సీనియర్ నాయకుడు కుప్పెల సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమేశ్వరాలయంలో గల అతి పురాతనమైన శివలింగాన్ని ముక్కోటి ఏకాదశి నాడు ధ్వంసం చేయడటం దురదృష్టకరమన్నారు. సప్తగోదావరి నదిలో పుణ్యస్నానమాచరించిన భక్తులు అక్కడే ఉన్న పురాతన శివలింగాన్ని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేస్తుంటారని, అలాంటి శివలింగాన్ని దుండగులు ధ్వంసం చేయటం భాదకరమన్నారు. పోలీస్ శాఖఅధికారులు వెంటనే స్పందించిన దీనికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువటి సంఘటనలు జరకుండా ఆలయ అధికారులు సప్తగోదావరి సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పురాదన కట్టడాలను కాపాడుకోవాలని సూర్యనారాయణ సూచించారు.

# వాడి వేడిగా నగర పంచాయతీ సమావేశం

### - పలు సమస్యలు లేవనెత్తిన కౌన్సిలర్లు



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** ముమ్మిడివరం ప్రభుత్వ శాఖలలో క్రింద స్థాయి సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఆ సమస్యల పరిష్కారం కావట్లేదని ఫ్లోరు లీడర్ బాలకృష్ణ ఆరోపించారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం మంగళవారం వైస్ చైర్ పర్సన్ వేటుకూరి బోసు రాజు అధ్యక్షతన జరిగింది. విద్యుత్ లైన్లు తగులుతున్న కొమ్మలు తొలగించాలని చెప్పిన లైన్మెన్ పట్టించుకోలేదని దీనివల్ల తరచూ వీధి దీపాలు కాలిపోతున్నాయని, తీగలపై పడితే విద్యుత్ స్తంభాలు కూడా ధ్వంసం అయ్యి నష్టం జరిగే ప్రమాదం ఉందని సమావేశంలో బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై ఎలక్ట్రికల్ ఏ.ఈ శివశంకర్ స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిదవ వార్డులో ట్రాన్స్ఫార్మర్ ఐరన్ స్తంభాలు దెబ్బతిన్నాయని వాటి స్థానంలో కాంక్రీట్ దిమ్మని ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ అడబాల సతీష్ కుమార్ కోరారు. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక శానిటేషన్ నిర్వహించి దోమలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని మంచినీటిని ఎక్కువ సమయం సరఫరా చేయాలని బాలకృష్ణ,కడలి సౌజన్య కోరారు. టిపిఓ విభాగం సరిగా పనిచేయట్లేదని టిపిఓ సెలవులు ఉండటంవల్ల ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ పథకంలో బిల్డింగ్ క్రమబద్ధీకరణకు ఫీజులు చెల్లించిన సకాలంలో వారికి క్రమబద్ధీకరించకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని బొంతు సత్య శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ పి రవి వర్మ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్య వినియోగంపై జేవీవీ కరపత్రాల పంపిణీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, సంహిత డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర కళాశాలలలో మాదక ద్రవ్యాలు వినియోగం వలన జరిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రవిబాబు మాట్లాడుతూ భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి, మద్యం నుంచి కాపాడుకోవాలని.. ఈ అవేర్నెస్ క్యాంపెయిన్ రాష్ట్ర వ్యాప్తంగా జేవీవీ నిర్వహిస్తోందని తెలిపారు. మాదక ద్రవ్యాలు యువతలో తన, మన అనే విచక్షణ లేకుండా సహనాన్ని కోల్పోయేలా చేసి, సంఘ విద్రోహులుగా మారుస్తున్నాయని, గతంలో చాటుగా జరిగిన గంజాయి ప్రయాణం నేడు రోడ్ల మీద వీర విహారం చేస్తూ అభం శుభం తెలియని పిల్లలని సైతం బలి తీసుకుంటోందని తెలిపారు. గంజాయిలో టెట్రా హైడ్రా కెనాభినైడ్ అని రసాయనం ఉంటుందని అది మెదడులో డోపమైన్, సెరటోనిన్ అనే ఉత్ప్రే రకాలను విడుదల చేస్తుందని, వీటివల్ల మెదడు వేగంగా స్పందించి శరీరాన్ని ఉత్తేజకరంగా ఉండేటట్లు కొద్దిసేపు చేయడం వల్ల వాటికి వ్యక్తులు పదేపదే కావాలని బానిసలు అవుతారని, మెదడు శరీరం మొత్తం ఈ రసాయనానికి బానిసగా మారిపోతుందని వివరించారు. అటువంటి వారి లక్షణాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు త్వరితగతిన గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వం పాఠశాలలు, కళాశాల పరిసరాల్లో గంజాయి విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అదే విధంగా మత్తు పదార్థాల వల్ల జరిగే దుష్పరిణామాలు వివరిస్తూ అవగాహనా క్యాంపులను కూడా నిర్వహించాలని కోరారు. అధ్యక్షుడు కే భీమయ్య మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను మంచి నూతన నిర్ణయాలతో ప్రారంభించుకోవాలన్నారు. మద్యం, గంజాయి తదితర దుర్వ్యసనాలకు దూరంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎన్ రవిబాబు, కార్యదర్శి బీఎస్ వీవీ ప్రసాదరావు, వై పైడియ్య తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ హాస్టల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు

# కనీస వసతుల ఏర్పాటుకు

### వ్యాపార వాణిజ్య పారిశ్రామిక వేత్తలు అధికారులు వితనంగా సహాయం అందించండి..

### కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్ముఖ సగిలి విజ్ఞప్తి



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** కాకినాడ జిల్లాలోని ఎస్.సి ఎస్.టి బిసి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించే కార్యక్రమానికి దాతలు వితరణశీలురు వ్యాపార వాణిజ్య పారిశ్రామిక వేత్తలు అధికారులు ప్రజలు ధన వస్తు రూపంలో ఉదారంగా సహాయాలు అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.


జిల్లాలో నిర్వహిస్తున్న 100 సంక్షేమ హాస్టళ్లలో దాదాపు 15 వేల మంది పేద వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని వీరందరికి మంచి విద్య ఆరోగ్యం బంగారు భవిత అందించేందుకు ఈ హాస్టళ్లలో కనీస వసతుల అభివృద్ధి చేపడుతున్నామని ఆయన తెలిపారు. సదాశయంతో చేపట్టిన ఈ సంకల్పానికి తమ వంతు సహాయంగా భూరి విరాళాలు అందించేందుకు అందరూ సౌజన్యంతో ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. నూతన సంవత్సర వేళ జిల్లా కలెక్టరుకు శుభాకాంక్షలు తెలియజేసే వారు విరాళాలను ధన రూపంలో గాని దోమ తెరలు ఆర్ఓ ప్లాంటులు లైట్లు ఫాన్లు మోడ్రన్ లైబ్రరీ తదితర వస్తు రూపంలో గాని అందజేయవచ్చునని తెలిపారు. అలాగే విరాళాలను జిల్లా కలెక్టర్, కాకినాడ వారి యుపిఐ ఐడి: 79296001@ubin కి %UPI ID/QR Code% ద్వారా గాని, District Collector KKD (Account name), 1440120110000923 (Account Number), UBIN0814407 (IFSC code), Union Bank of India, Collectorate Branch అకౌంటుకు నగదు బదిలి/చెక్కు/డిమాండు డ్రాఫ్ట్ ద్వారా గాని చెల్లించాలని కోరారు. పేద విద్యార్థుల జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దే ఈ ఉదాత్త కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ షణ్మోహన్ తమ ప్రకటనలో విజ్ఞప్తి చేసారు.

### కూటమి ప్రభుత్వంలో

# 'సూపర్ సిక్స్ సూపర్ హిట్'

### 2025లో కూటమి ప్రభుత్వం ఖాతాలో ఎన్నో విజయాలు - సీఎం, డిప్యూటీ సీఎం సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి

### తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి



**తణుకు ..డిసెంబర్ ..30..(మనసులో మాట)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 సంవత్సరంలో సూపర్ సిక్స్ పథకాలు పేరుతో ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించి సూపర్ హిట్ గా నిలిచిందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు సైతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని అన్నారు. ముఖ్యంగా తల్లికి వందనం పేరుతో రూ. 10 వేల కోట్లు చెల్లించి 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం అందించామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు 3.25 కోట్ల ప్రయాణాలతో ఈ పథకానికి రూ. 1,144 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. దివ్యాంగులకు సైతం ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని వీరు ఎక్కడ నుంచైనా పెన్షన్ తీసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో 46 లక్షల మంది రైతులకు రూ. 6,310 కోట్లు మేర రైతుల ఖాతాలో జమ చేసామన్నారు. దీపం 2 ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు రూ. 2,684 కోట్లు వెచ్చించి ఇప్పటివరకు దాదాపు 2 కోట్ల సిలిండర్లను పంపిణీ చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇప్పటివరకు రూ. 50 వేల కోట్లకు పైగా పెన్షన్లు కోసం వ్యయం చేసి ఏడాదిలో రూ. 33 వేల కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మత్స్యకార భరోసా పేరుతో ఏడాదికి రూ. 20 వేలు చొప్పున రూ. 1.25 లక్షల మందికి రూ. 250 కోట్లు అందజేశామని వెల్లడించారు.ఆటో డ్రైవర్ల సేవలో ఏడాదికి రూ. 15000 చొప్పున రూ. 436 కోట్లు జమ చేశామన్నారు. రాష్ట్రంలో రూ. 1000 కోట్లతో రోడ్లు మరమ్మత్తులు చేపట్టి మరో రూ. 3 వేల కోట్లతో రోడ్లు నిర్మాణం చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైమ్ రేటు తగ్గిందని, ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి గంజాయి,డ్రగ్స్ అరికట్టినట్లు వెల్లడించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు చేపట్టామన్నారు. కొత్తగా మరో రెండు జిల్లాల ఏర్పాటు ద్వారా 26 నుంచి 28 కి జిల్లాలు సంఖ్య పెంచామని ఎమ్మెల్యే రాధాకృష్ణ వివరించారు.



# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** ముమ్మిడివరం మండలం లో పలు ఆలయాలు మంగళవారం భక్తులతో కిక్కిరిచి పోయాయి. ముక్కోటి పర్వదినం పురస్కరించుకొని తెల్లవారు జాము నుండే ఆలయాలకి భక్తులు పోటే త్తారు. ముమ్మిడివరం లో ఉన్న విష్ణువు ఆలయం, పల్లిపాలెం, పల్లవారి పాలెం లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయాలు ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. స్థానిక విష్ణాలయం లో పూజలు ఈ ఏడాది వేడుకలు మరిన్ని విశేషాలతో భక్తులను కట్టిపడేశాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. "గోవిందా.. రామా.." స్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోయింది. వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుంటే.. మోక్షం సిద్ధిస్తుందనే నమ్మకంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు నిర్వహి విగ్రహాలను రంగురంగుల పూలతో అలంకరించిన పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మంగళవాయిద్యాలు, భజన కీర్తనల మధ్య ఊరేగింపు సాగింది. గ్రామస్తులు అడుగడుగునా స్వామివారికి హారతులు ఇచ్చి, నైవేద్యాలు సమర్పించుకున్నారు. విగ్రహాల కళను చూసి భక్తులు పులకించిపోయారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మాట్లాడుతూ.. భక్తులందరికీ స్వామివారి కృపాకటాక్షాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విబిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్వానంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** స్థానిక రమణయ్యపేట అడబాల ట్రస్టు కార్యాలయం లో విబివిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్ల మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ తో పాటు నా మిత్రుడు సింగపూర్లో ఉద్యోగం చేస్తున్న ఒరిస్సాకు చెందిన సుకుంట కుమార్ సౌజన్యంతో కుట్టుమిషన్లను అందజేస్తున్నామని అన్నారు. భర్త సంపాదనకు తోడుగా కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారనే ఆశయంతో కుట్టు మిషన్లను అందజేస్తున్నామని అన్నారు. కుట్టు మిషన్లను ఇంట్లో అలంకార వస్తువుగా కాకుండా దాని ద్వారా ఉపాధి పొందాలన్నారు. పేద మహిళలందరికీ ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్న అడబాల ట్రస్ట్ సేవలు అభినందనీయమని సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో సత్యనారాయణ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ నాయుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు నిమ్మకాయల వెంకటేశ్వరరావు చింతపల్లి సుబ్బారావు పి. ధర్మచంద్ర రాజు రాజా శ్రీలక్ష్మి విజయలక్ష్మి భారతి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 30..** జగంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పేదలకు అన్న వితరణ గావించారు.. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే డొక్కా సీతమ్మన పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుంటే కళ్యాణ్ ని నేను స్ఫూర్తి గా తీసుకుని నా సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నానని అన్నారు.డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మేడిబోయిన శ్రీను, మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, పాట్టంశెట్టి రమేష్,అంకం ఓం, మేడిబోయిన గంగా, సత్తి సోమరాజు, పల్లా ప్రసాద్,అడబాల వీరబాబు, రెళ్ల ప్రసాద్, గండికోట శ్రీను నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు

# శ్రీ సీతారాములకు ముక్కోటి పూజలు



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని కాకినాడ టౌన్ హాల్ దగ్గర ఉన్న శ్రీ సీతారామ స్వామి వారి దేవాలయంలో స్వామి వారు శ్రీ మహావిష్ణుమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఋత్విక్కులు స్వామివారికి అభిషేకం, సహస్ర నామాలు పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.తిరుప్పావై పఠనంతో మంగళ హారతి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టినారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం ఈవో వెంకటేశ్వరరావు సిబ్బంది పాలకమండలి చైర్మన్ పులవర్తి విశ్వనాథం డైరక్టర్లు పూర్వపు ఆలయ చైర్మన్ పులవర్తి సీతారామయ్య ఆలయ పాలక వర్గసభ్యులు తురగా సూర్యారావు దంపతులు ఆలయనిర్మాణమునకు సహకరించిన దాతలు భక్తులు పాల్గొన్నారు.

# గత ఏడాది కంటే ఈ ఏడాది 1646 కేసులు పెరిగాయి

## ముందస్తు చర్యలు వలన ఈ వ్యత్యాసం - ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 30 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2024వ సంవత్సరంలో 6747 కేసులు నమోదు కాగా 2025 సంవత్సరంలో 8,393 కేసులు నమోదయాయని గత ఏడాదితో పోలిస్తే 1646 కేసులు అధికమని ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం జిల్లా అంతటా జన జాగృతి వాహనాన్ని తిప్పుతూ బహిరంగ ప్రదేశాల్లోనూ ప్రజల రద్దీగా తిరుగుతున్న ప్రాంతాలలో బస్టాండ్ల వద్ద వీడియో విజువల్స్ ద్వారా ప్రజలకు చేరే విధంగా మహిళపై జరుగుతున్న అత్యాచారాల గురించి సైబర్ క్రైమ్ గురించి డ్రగ్స్,మాదక ద్రవ్యాలు గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రజలకు అవేర్నెస్ కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద 2025 సంవత్సరానికి గాను22 24 అర్జీలను బాధితులు పెట్టుకోగా 2120 ఫిర్యాదులను తక్షణ పరిష్కరించామని మిగిలిన 104 ఫిర్యాదులు పరిష్కరించవలసి ఉందని ఎస్పీ తెలిపారు. అలాగే 2024 సంవత్సరంలో జిల్లాలో 9 హత్య కేసుల నమోదు కాగా 2025 సంవత్సరంలో 13 హత్య కేసు నమోదు అయ్యాయని ఈ సంవత్సరంలో 13 కేసులలో మూడు కేసులు వివాహేతర సంబంధాలు కాగా మూడు కేసులు కుటుంబ కలహాలు గాను రెండుకేసులు చిన్నపాటి వివాదాలు కేసులు కాగా మిగిలిన ఐదు కేసులు ఇతర కారణాలుగా నమోదయ్యాయన్నారు. గతంలో పోలిస్తే అత్యాచారం కేసులు స్వల్పంగా పెరిగాయని ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ పంపించడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే 2024 సంవత్సరంలో జిల్లాలో 416 దొంగతనం కేసులు నమోదు కాగా 2025 సంవత్సరంలో 439 కేసులు నమోదయ్యాయన్నారు. ఇక్కడ కూడా కేసులు స్వల్పంగా పెరిగాయని మొత్తం 240 కేసులు చేదించి బాధితులు పోగొట్టుకున్న ఒక కోటి 66 లక్షల 87 వేల 700 రూపాయలను రికవరీ చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎస్పీ పలు సూచనలు చేశారు మోటర్ సైకిల్లను ఎక్కడపడితే అక్కడ పార్క్ చేయకుండా భద్రత కలిగిన ప్రదేశాల్లో మాత్రమే పార్క్ చేయాలని ప్రజలు ఊర్లుకు వెళ్ళేటప్పుడు విలువైన ఆభరణాలు మరియు నగదు బ్యాంకు లాకర్స్ లో భద్రపరుచుకోవాల్సిందిగా పోలీసు వారు కల్పిస్తున్న ఎల్ హెచ్ ఎం ఎస్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎస్పి సూచించారు. అలాగే 2024 సంవత్సరంలో మహిళలు బాలికలపై జరిగిన నేరాలు 66 కేసులు నమోదు కాగా 2025 సంవత్సరంలో 642 కేసులు నమోదయాయని గతంతో పోలిస్తే కేసులు తక్కువగా నమోదు అయినట్లు అసయన తెలిపారు. అలాగే మహిళలు బాలికలపై అత్యా నేరాలు జరగకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లాలో డివిజన్ల వారీగా శక్తి టీమ్ లను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళలు బాలికలపై జరిగిన నేరాలలో శిక్ష పడిన ముఖ్యమైన కేసుల్లో అయినవిల్లి పోలీస్టేషన్లో ఫోక్సో కాకినాడ వారు ముద్దాయికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష తో పాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధించారని అలాగే మరొక ఫోక్సో కోర్టు కాకినాడ వారు ముద్దాయికి 15 సంవత్సరాలు జరిమానా విధించారన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్లో ఏ డీజే కోర్టు రాజమహేంద్రవరం వారు ముద్దాయికి 10 సంవత్సరాలు జరిమానా విధించారని, ఐ పోలవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసులో ఏ డీజే కోర్టు రాజమహేంద్రవరం ముద్దాయికి 10 సంవత్సరాల కఠిన కారా గార శిక్ష 5000 జరిమానా విధించడం జరిగింది అన్నారు అలాగే అయినవిల్లి స్టేషన్లో మరో ఫోక్సో కోర్టు కాకినాడ వారు ముద్దాయికి ఐదు సంవత్సరాలు కఠినకార గార శిక్ష 10,000 రూపాయలు జరిమానదించారని ఎస్పి పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 2024 సంవత్సరానికి జిల్లాలో 58 కేసులు నమోదు కాక 2025 సంవత్సరానికి 49 కేసులు నమోదయాయని గతంతో పోల్చుకుంటే 15శాతం కేసులు తక్కువగా నమోదు అయినట్లు ఎస్పి తెలిపారు .జిల్లాలో అత్యధికంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు పోతున్నాయని దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ కేసులు సంబంధించి 2024 సంవత్సరంలో 42 సైబర్ నేరాలకు కేసులు నమోదయాని 1930 సైబర్ పోర్టల్ ద్వారా 975 ఫిర్యాదులు అందగా ఫిర్యాదారులకు సంబంధించి ఒక కోటి 3 లక్షల 93,800 నష్టపోయిన నగదును వివిధ బ్యాంకుల ద్వారా హెూల్డ్ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజలకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడం ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. అదేవిధంగా జిల్లాలో చేధించన ముఖ్యమైన దొంగతనం కేసుల్లో రాజోలు పోలీస్ స్టేషన్ కు సంబంధించి 25 కేసులు చేదించి 4 లక్షల విలువ చేసే 449 గ్రాముల బంగారం 5.9 కేజీల వెండి ఒక మోటర్ సైకిల్ రికవరీ చేయడం జరిగిందన్నారు. అలాగే అమలాపురం పోలీస్ స్టేషన్ కు సంబంధించి 17 కేసులు చేదించి 400 గ్రాముల బంగారం 500 గ్రాములు వెండి 6 మొబైల్ ఫోన్లు రికవరీ చేయడం జరిగిందన్నారు. రాజోలు పోలీస్ స్టేషన్ కు సంబంధించి మొత్తం పది కేసులకు చేధించి నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద నుండి 11,58, 500 విలువ చేసే బంగారం ఆభరణాలు రికవరీ చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో రామచంద్రపురం టౌన్ పరిధిలో 10 సంవత్సరాల మైనర్ బాలికను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసులో ఎటువంటి ఆధారాలు దొరకపోయినప్పటికీ ఫింగర్ప్రింట్ ద్వారా అత్యంత సాకేతంగా కేసును చేదించి ముద్దాయిని అరెస్టు చేయడంలో పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యవహరించారని ఎస్పీ వివరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కుటుంబ సమేతంగా అందరూ ఆనందంగా పండుగ ను జరుపుకోవాలని యువతకు మోటర్ బైక్లు ఇచ్చి తల్లిదండ్రులు వారిని పాడుచెయొదగదని హితవు పలికారు. అసాంఘిక కార్యకలాపాలు కోడిపందాలు జూదంలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. కోడి పందాలు నిర్వాహకులు కోడికి కత్తులు కట్టే వారిపై జిల్లాలో బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పి స్పష్టం చేసారు. ఆయన వెంట అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్ ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.



# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 30:** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అమలాపురంలో మహిపాల వీధిలో పెళ్లిళ్ల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ లక్ష్మి శ్రీనివాస కూచిపూడి నృత్యాలయం నాట్యాచార్య కోసిరెడ్డి రమేష్ నాయుడు, రమ్య దంపతులను ప్రోత్సహిస్తూ మాజి చైర్పర్సన్ దూడల విరీతదేవి వారికి పదివేల రూపాయుల చెక్ ను దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈఓ సత్యకుమార్ చేతులమీదుగా వారికి అందజేశారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా నారా లోకేష్ యోజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# అన్న ప్రసాద వితరణ



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఏర్పర్చిన అన్నా ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు భక్తులకు మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో సభ్యులు పలు దేవాలయాలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫౌండేషన్ కార్యాలయంలో 1314వ రోజు ప్రసాద వితరణ చిన్నారులకు వేడిపాలు బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుబ్బు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ భక్తి భావాలతో ముక్కోటి ఏకాదశి జరుపుతున్నారని ఫౌండేషన్ ద్వారా ప్రసాద వితరణ చేయడానికి సహకరించిన వారికి అభినందనలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు పేదల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ద్వారా అన్నా ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజ్ 14 రోజులు నిత్య అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ రాష్ట్ర సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు బత్తుల సూర్య ప్రసాద్ ప్రత్తిపాడు పౌండేషన్ అధ్యక్షులు అడపా జగదీష్ రూరల్ ఫౌండేషన్ అధ్యక్షులు మండపాక నాగబాబు కాలాడి వెంకటేష్ సత్తిబాబు ఫౌండేషన్ సభ్యులు మహిళా భక్తులు పాల్గొన్నారు.

# స్వామి కి ప్రత్యేక అలంకరణ



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** పల్లవారిపాలెం గ్రామంలో పెంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ఏకాదశి పర్వదిన%శీ% సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం,స్వామికి విశేషాలంకరణ చేశారు.

# నేడు ఫించన్లు పంపిణీ

**ముమ్మిడివరం (మనసులో మాట ) డిసెంబరు 30:** వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే నెలవారీ పింఛన్లు ను డిసెంబర్ 31 న పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీఓ జె. ఎల్. ఎన్ దీక్షితులు తెలిపారు. బుధవారం ఆయా పంచాయతీ ల పరిధిలో సొమ్మును పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్ దారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు

# వైభవంగా కేశవ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు



**కాజులూరు (మనసులో మాట) డిసెంబర్ 30..** ధనుర్మాసం సందర్భంగా కోలంక శ్రీ లక్ష్మి కేశవ స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఈ పవిత్ర మాసంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తుల మనసులను పరవశింపజేశాయి. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని కోలంక శ్రీ లక్ష్మి కేశవ స్వామి ఆలయంలో స్థానిక క్షత్రియ పరిషత్ సభ్యులుచే అత్యంత వైభవంగా లక్ష్య చామంతి లక్ష తులసి లక్ష కుంకుమార్చన 108 కలువ పువ్వులతో స్వామి వారికి అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు ఖండవిల్లి ప్రశాంతాచార్యులు కండవల్లి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో దంతులూరి వెంకట నరసింహ రాజు దంతులూరి లక్ష్మి నరసింహ రాజు వత్సవాయి కాశీ విశ్వనాథరాజు వత్సవాయి రాఘవ రామచంద్ర రాజు దంపతులచే నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష చామంతి పుష్పాలతో స్వామివారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. చామంతి పుష్పాల సువాసనతో ఆలయ ప్రాంగణం నిండిపోయి, ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉట్టిపడింది. అలాగే లక్ష తులసి దళాలతో చేసిన తులసి అర్చన స్వామివారికి అత్యంత ప్రీతికరంగా సాగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన లక్ష కుంకుమార్చన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృప కోసం భక్తితో కుంకుమార్చన చేశారు. అనంతరం నూటక్కా కలువలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించగా, ఆ దృశ్యం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది. ఈ ధనుర్మాస పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సమన్వయంతో కార్యక్రమాలను శ్రద్ధగా నిర్వహించడంతో పూజలు సజావుగా సాగాయి. ఈ ధనుర్మాస వేడుకలు భక్తుల హృదయాలలో భక్తి, శాంతి, ఆనందాన్ని నింపి కేశవ స్వామి మహిమను మరింతగా చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాల రాజు , మాజీ నీటి సంఘం అధ్యక్షులు దాట్ల బుచ్చిబాబు ,దంతులూరి వంశీ, డి లక్ష్మీపతి రాజు, వత్సవాయి సృజన్, ఆనంద్, పెద్ద ఎత్తున గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# గురువులు విద్యార్ధుల భవిష్యత్తుకు పునాదులు

## కర్రసాము పోటీల్లో సత్తా చాటిన శ్రీరాం నగర్ హైస్కూల్ విద్యార్థులు..



**కాకినాడ (మనసులో మాట) డిశంబర్ 30..** రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ కనబరిచిన కాకినాడ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను బిజెపి సీనియర్ నేత రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులు ఇంజనీర్ గట్టి సత్యనారాయణ అభినందించారు. నెల్లూరు లో జరిగిన రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థిని విద్యార్థులు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి లో సత్తా చాటారు.మంగళవారం స్థానిక శ్రీరామ్ నగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమానికి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలతో రానున్న కొత్త సంవత్సరంలో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ప్రతీ విద్యార్థి విజయం వెనుక గురువుల ఖచ్చితంగా పాత్ర ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థిలో ఉన్న ప్రతిభాపాటవాలను గుర్తించి అందుకు అనుగుణంగా జీవితంలో స్థిర పడేందుకు, ఉన్నత శిఖరాలకు చేరేందుకు ప్రతీ గురువు విద్యార్థుల పట్ల అంకిత భావంతో పని చేస్తారని కొనియాడారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి దోహదపడటంతో పాటు దేహధారుధ్యానికి కారణమవుతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సాహిస్తున్నారని తెలిపారు.రాష్ట్ర స్థాయి లో రాణించిన విద్యార్థులు దేశం గర్వించేలా ప్రపంచ స్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. దేశ క్రీడా రంగంలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకున్నవారి గురించి విద్యార్థులకు వివరించారు. కిరణ్ బేడీ పిటి ఉషా తో పాటు ఇటీవల ప్రపంచ మహిళా క్రికెట్ ఛాంపియన్ షిప్ లో ప్రతిభ కనబరచిన శ్రీచరణీ గురించి ప్రస్తావిస్తూ ఆమె అందుకున్న గౌరవాన్ని వివరించారు. పాఠశాల నందు హాకీలో రాణిస్తున్న టీమ్ కు అవసరమైన హాకీ స్టిక్ బాల్స్ అందించడానికి అంగీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మరో అతిథి శ్రీరామ్ స్పోర్ట్స్ అధినేత ధార శాస్త్రులు ఆయన భార్య సునీత విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు చేయూతగా నిలిచేందుకు తాము ఎప్పుడు ముందుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 45 డివిజన్ జనసేన ఇంచార్జ్ సుంకర రామకృష్ణ పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. నాగేశ్వరరావు సామ్యేల్ జాన్ ఎల్. నాగభూషణం సి. హెచ్. కుమారి జయరాజు ఇ. శ్రీను తదితరులు పాల్గొన్నారు..




# ఈవీఎంల గోడౌన్‌లను పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌లను తనిఖీ చేశామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి, నోడల్ అధికారి–రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల భద్రతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన ఈవీఎంలపై నిరంతర సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్, అర్బన్ తహసీల్దార్ పీహెచ్ జీఆర్ పాపారావు, టీడీపీ ప్రతినిధి సలాది ఆనంద్, బీజేపీ ప్రతినిధి బీ రామచంద్ర రావు, ఎన్నికల విభాగ సిబ్బంది, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముక్కోటి ఏకాదశి

# ఉత్తర ద్వార దర్శనం



**అనపర్తి (మనసులో మాట) డిసెంబరు 30:** అనపర్తి స్థానిక పాత ఊర్లో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి ఆలయంలో, ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేదాంతం సాయి తేజ, స్వామివారిని వెంకటేశ్వర స్వామి అలంకరణ గావించి ప్రత్యేక పూజలు తులసి దళాలతో, చామంతి పుష్పాలతో విశేషాలు గావించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం శ్రీమన్నారాయణుడు యోగ నిద్ర నుండి లేచిన రోజు గనుక, భక్తులు ఈ పర్వదినం యొక్క ప్రత్యేకత ఉత్తర ద్వార దర్శనం అనగా ఉత్తర ద్వారం పరమాత్మ దర్శనం చేయడం యొక్క విశిష్టతను భక్తులకు సాయి తేజ వివరించారు. అనంతరం భక్తులు ఉత్తర ద్వార దర్శనం లైన్ లో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలుతీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు అయ్యప్ప స్వామి ఆలయ చైర్మన్ తేతల తినాధ రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు నల్లమిల్లి సీతారామరెడ్డి, నల్లమిల్లి వెంకట మునేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు

## - భక్తులతో పోటెత్తిన ఆలయాలు



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబర్ 30:** పవిత్ర ధనుర్మాసం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన పి. మల్లవరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ ఈఓ వేణుగోపాలరావు నేతృత్వంలో అర్చకులు ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు, ఖండవిల్లి సీతారంగాచార్యులు, ఖండవిల్లి వెంకట సీతారామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ. పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అదేవిధంగా తాళ్లరేవు కేశవపురంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ కేశవస్వామివారి ఆలయంలో ఈఓ యర్రా వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు అర్చకులు పెద్దింటి శ్రవణ్కుమార్ ముక్కోటి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే ఇంజరం, తాళ్లరేవు ప్రధాన రహదారిలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుంకరపాలెం. జార్జీపేట వేణుగోపాలస్వామివారి ఆలయాలతో పాటు మండలంలోని పలు దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో దూళిపూడి సుబ్బారావు ఉంగరాల వెంకటేశ్వరరావు అందే కాశీరాజు తదితరులు పాల్గొన్నారు.

# మూడు మండలాల రెవిన్యూ అధికారులకు శిక్షణ



**తాళ్ళరేవు (మనసులో మాట), డిసెంబరు 30:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాళ్ళరేవు కాజులూరు, కాకినాడ అర్బన్ మండలాలకు చెందిన గ్రామ రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు, రెవెన్యూ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమానికి కాకినాడ ఆర్డీవో మల్లిబాబు హాజరై రీ సర్వే ఎల్పీఎంలు, రెవెన్యూ క్లినిక్ లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పితాని త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**కాజులూరు (మనసులో మాట) డిసెంబరు 30..** నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్ కుమార్ కోరారు. మంగళవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ లో ఒక ప్రకటనలో ఎస్సై మోహన్ కుమార్ తెలుపుతూ నూతన సంవత్సర వేడుకలను శాంతి భద్రతలకు లోబడి జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేయడం, అతివేగంగా వాహనాలు నడపడం మరియు బైక్ రేసింగ్‌లకు పాల్పడటం చట్టరీత్యా నేర%శీ% అన్నారు. వేగం మీ కుటుంబానికి తీరని లోటును మిగల్చవచ్చని మద్యం సేవించి వాహనాలు నడపవద్దనీ 31వ తేదీ రాత్రి మండలం అంతటా ముమ్మరంగా తనిఖీలు నిర్వహించబడతాయనీ నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల జప్తు మరియు కఠినమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. 31వ తేదీ రాత్రి అనవసరంగా రోడ్లపై తిరగడం మానుకోవాలనీ వీలైనంత వరకు వేడుకలను మీ ఇళ్లలోనే జరుపుకోవాలని కోరారు. నూతన సంవత్సర వేడుకలు, ఈవెంట్స్ లేదా పార్టీలు నిర్వహించాలనుకునే వారు పోలీస్ స్టేషన్ నుండి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరని తెలిపారు. అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలనీల్లో డీజేలు ఏర్పాటు చేయడం నిషిద్ధం. ధ్వని కాలుష్య నియమాలను ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్స్ సీజ్ చేయబడతాయని నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలు వాడినా, సరఫరా చేసినా కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయనీ తెలియజేశారు.

## యువత అదుపు తప్పితే కఠిన చర్యలు తప్పవు

### ఏలేశ్వరం ఎస్. ఐ రామలింగేశ్వరరావు



**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబరు 30..** డిసెంబర్ 31 రాత్రి జరుగు నూతన సంవత్సర వేడుకల్లో యువత అదుపు తప్పి ప్రవర్తిస్తే కఠిన చర్యలు చేపడతామని ఏలేశ్వరం ఎస్సై ఎం రామలింగేశ్వర రావు మంగళవారం హెచ్చరించారు. నూతన సంవత్సరం పేరుతో యువత అదుపుతప్పి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వెంటనే చర్యలు ఉంటాయన్నారు. మండల కేంద్రమైన ఏలేశ్వరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు ఏలేశ్వరం ఎస్ ఐ ఎన్.రామలింగేశ్వర రావు మంగళవారం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా యువత అత్యంత జాగ్రత్తగా ప్రవర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పర్మిషన్ క్రింద బుధవారం రాత్రి 12 గంటల అనంతరం కొంచెం సమయం అటు ఇటు లో ఒంటిగంట తర్వాత ఎవరు కూడా రోడ్లపై తిరగరాదని ఆయన హెచ్చరించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్ చేసుకునే ముందు పక్క వారికి ఇటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. నూతన సంవత్సరం లో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత రోడ్లపై తమ బండ్లకు సైన్ లైన్స్ లను తొలగించి విపరీతమైన శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే వెంటనే తగు చర్యకు ఉపక్రమిస్తామని ఇందుకుగాను ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలపై డ్రోన్ తో పరిశీలన జరుగు తుందన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు లేదా సదా సీదా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే వారి నుండి ఎటువంటి ఫిర్యాదు అందినా పోలీస్ రంగ ప్రవేశం చేసి వారి తాట తీసే కార్యక్రమం చేపడతామన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు యువత మత్తు పదార్థాలను సేవించి వెకిలి శ్రేష్ట లకు ఉపక్రమిస్తే ఉక్కు పాదం మోపుతామని ఏలేశ్వరం ఎస్సై రామలింగేశ్వరరావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

### గత ప్రభుత్వ అరాచక పాలన నుండి

# రాష్ట్రం అభివృద్ధి వైపు

### కొత్తపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట (మనసులో మాట) డిసెంబర్ 30..** వైసిపి అరాచక పాలనలో కుదేలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి 18 నెలల కూటమి పాలనలో ఎనలేని అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు .మంగళవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2025లో కూటమి ప్రభుత్వం సాధించిన 60 విజయాలను వివరించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలో కొత్తపేట నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు. తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు అందజేశామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. దీపం 2 క్రింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ఇప్పటివరకు రూ.50,000 కోట్లకు పైగా పెన్షన్ల కోసం వ్యయం చేయడం జరిగిందని, 2025లో రూ.33,000 కోట్లు పంపిణీ చేశామన్నారు. మత్స్యకార భరోసా కింద ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఏడాదికి రూ.15,000లను 2.90 లక్షల మంది లబ్దిదారులకు రూ.436 కోట్లు జమ చేశామన్నారు. 204 అన్నా క్యాంటిన్లు నిర్వహిస్తూ పేదలకు 5రూపాయలకే మంచి భోజనం అందిస్తున్నామని, త్వరలో కొత్తపేటలో సైతం అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులను కేటాయించామన్నారు. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ జరిపిన సంగతి గుర్తు చేశారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మైనారిటీ సంక్షేమానికి రూ.3,670 కోట్లు వ్యయం చేశామని, 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం రూ.51 కోట్లు అందజేశామని తెలిపారు. ఇమామ్లకు నెలకు రూ.10,000 మౌజన్లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు అందజేసినట్లు తెలిపారు. పురోహితులకు నెలకు రూ.15,000కు వేతనాలను పెంచామన్నారు. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000కు వేతనాల పెంచామని, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం అందించామని, మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ చేశామన్నారు. మెగా డీఎస్సీ కింద 15,941 టీచర్ పోస్టులను భర్తీ చేశామన్నారు. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి చేశామని, రూ.4,500 నుంచి రూ.12,500కు స్టైఫండ్ పెంచామని తెలిపారు. రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని, మరో రూ.3,000 కోట్లతో రహదారుల నిర్మాణం చేశామన్నారు. కొత్తపేటలో డివిజనల్ కార్యాలయాల ఏర్పాటు జరిగిందని అన్నారు. వాడపల్లి దేవస్థానం అభివృద్ధి జరుగుతుందన్నారు. రూ.80కోట్లతో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఎన్ ఆర్ జీ ఎస్ లో రహదారుల అభివృద్ధి జరుగుతుందన్నారు. డ్రాగన్ పడవల పోటీలతో పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో ఏ మాత్రం అభివృద్ధి జరగదు అనే పరిస్థితి ప్రజల్లో ఉండేదని ఆ స్థితి నుంచి ఊహించని విధంగా అభివృద్ధి చేశామన్నారు. సాగు నీరు, తాగు నీరు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. శక్తి వంచన లేకుండా రాష్ట్రం, నియోజకవర్గం, గ్రామాల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి, బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, సాధనల శ్రీను, సరిపెల్ల శ్రీనివాసరాజు, అత్తిలి వెంకటేశ్వరావు, సిద్దిరెడ్డి శ్రీను, పసుపులేటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ కార్యకర్తలకు ప్రశంస పత్రాలు



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** ముమ్మిడివరం సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్చార్జిలకు స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ లు అవార్డులు బహుకరించారు. మండల పార్టీ అధ్యక్షులు అర్ధాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్చార్జులు ప్రజల దగ్గరికి వెళ్లి సంక్షేమ పథకాలన్నీ వివరిస్తూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేయడంలో ఇన్చార్జులు తీవ్రంగా కృషి చేసారని అలాగే నాయకులు, కార్యకర్తలు కూడా తీవ్రంగా పార్టీకి కృషి చేశారని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో కూడా ప్రభుత్వం చేసే సంక్షేమ పథకాలు అభివృద్ధి ప్రజలకు వివరించి గ్రేడ్ పొందిన వారికి అవార్డులు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీ ల మీద అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్రంలో పెట్టుబడుల పెట్టే వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని రాబోయే మూడున్నర సంవత్సరాలలో యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం గా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 2029లో కూటమి ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. విశాఖ గ్లోబల్ సమ్మెట్ 610 ఒప్పందాలు చేసుకుని 13.25 లక్షలు పెట్టుబడులు తీసుకొని వచ్చి 16.13 లక్షలు ఉద్యోగాలకు కృషిచేస్తున్నారని అన్నారు. ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ కోనసీమ కొబ్బరి రైతులను ఆదుకోవటానికి కొబ్బరి పరిశ్రమ తీసుకు రావటానికి కృషి చేస్తున్నానని అన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, సాగిరాజు సూరిబాబు రాజు, దొమ్మేటి రమణ కుమార్ దాట్ల బాబు, కె. సత్తిబాబు, సాగిరాజు సూరిబాబు రాజు, తాడి జానకిరామ్, దూళిపూడి బాబీ, ఆకాశం శ్రీను, ములపర్తి బాలకృష్ణ, టేకుమూడి లక్ష్మణరావు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, దంగేటి శ్రీనివాస్, అడబాల సతీష్ కుమార్, యాళ్ల ఉదయ్, నిమ్మకాయల విస్సు, నడిమింటి ప్రభాకరం, బొక్క రుక్మిణి, కుడిపూడి మల్లేశ్వరి, ముమ్మిడివరపు వరలక్ష్మి, కట్టా త్రిమూర్తులు, మాదాల బుజ్జి, మాదాల కుమార్, పాయసం చిన్ని, గోదాసి గణేష్, గుద్దటి వీరాస్వామి నాయుడు, శివ రాజు, లతోపాటు పలువురు పాల్గొన్నారు.

### తాళ్లూరులో వైభవంగా

# వైకుంఠ ఏకాదశి



**గండేపల్లి(మనసులో మాట) డిసెంబర్ 30..** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి(జి య్యాన్న మఠం) దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ వాహనంపై స్వామివారిని అలంకరించారు. అర్చకులు స్వామివారిపై గోదాదేవి రచించిన తిరుప్పావై అత్యంత వినసొంపుగా ఆలాపన చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని భక్తులే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి సేవకు పాత్రులయ్యారు. జియ్యాన్న మఠం అర్చక పండితులు అందరికీ భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు .వైకుంఠ ఏకాదశి పర్వదినాన్నిపురస్కరించుకుని అతి ప్రాచీన ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచిన తాళ్లూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారినీ భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన దేవస్థానం చైర్మన్ దాపర్తి సీతారామయ్య. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మా ప్రియతమ నేత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కి జ్యోతుల నవీన్ కి ఆ స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని నియోజకవర్గ ప్రజలందరూఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేయగా, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైకుంఠ ఏకాదశి పవిత్రత ప్రజల జీవితాల్లో శాంతి, సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ఈ సందర్భంగా ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు సనాతన ధర్మం కోసం పాటుపడాలని భగవద్గీత రామాయణం వంటి మన ఇతిహాసాలను పాటించాలని కోరారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మాజీ జడ్పిటిసి సభ్యులు వెంకటలక్ష్మి బాబ్జి, గ్రామ సర్పంచ్ వీరబాబు సుంక విల్లి రాజు, కంచుమర్తి రాఘవ, తదితర ప్రముఖులు వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



## పాలక మండలి ప్రమాణ స్వీకారం

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** ముమ్మిడివరం శ్రీ ఉమా సురేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా జంధ్యాల సాంబ శివకుమార్, సభ్యులుగా మట్టపర్తి రజనీకుమారి, దువ్వూరి లక్ష్మి, జనిపల్లి సత్యనారాయణ, ర్యాలి నాగేంద్రబాబు, వేములవలస అప్పారావు, అన్నాబత్తుల భాను, విధూలూరి ఉదయ కృప, శీలం శ్రీనివాసరావు, అర్చకఎక్స్ అఫీషియో సభ్యులుగా కొత్తలంక సూర్య వీరభద్రరాజులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం



**కొత్తపేట (మనసులో మాట )డిసెంబర్ 30..** కోనసీమ తిరుమలగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లి వేంకటేశ్వర స్వామి ని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రెడ్డి సుబ్రహ్మణ్యం స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ నల్లం సూర్య చక్రధరరావు స్వామి శేషవస్త్రాన్ని కప్పి, తీర్థప్రసాదాలను అందజేశారు.?ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### రాపర్తి రామకృష్ణ ను కలిసిన

## మాజీ ఎమ్ ఎల్ సి శివ కుమారి



**రౌతులపూడి, (మనసులో మాట )డిసెంబర్ 30 :** గుమ్మగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ ను మాజీ ఎమ్ ఎల్ సి ఆగులూరి లక్ష్మి శివ కుమారి మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా రాపర్తి రామకృష్ణ ఘన స్వాగతం పలికారు. ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో లక్ష్మి శివ కుమారి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి కరుడుగట్టిన కార్యకర్తరామకృష్ణ అని పార్టీ ఏ కార్యక్రమాలు ఆదేశించిన కష్టపడి పనిచేసే తత్వం కల రామకృష్ణ గత కొన్ని రోజులుగా మౌనంగా ఉండడంతో ప్రత్తిపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు ఆయనను కలిసి మునుపటిలాగే పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని ఆమె కోరారు. సోషల్ మీడియాలో రాపర్తి రామకృష్ణ పై వచ్చిన వార్తలు ఆ వాస్తమని చిత్తశుద్ధితో పనిచేసే నాయకులను పార్టీ ఎప్పటికీ వదులుకోదని లక్ష్మి శివకుమారి అన్నారు. అనంతరం రాపర్తి రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నీ తన గొంతులో ప్రాణం ఉన్నంతసేపు వదలను అని నేనిప్పుడు జగన్కు విధేయుడినినని రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండల వైయస్సార్సీపీ నాయకులు అంకంరెడ్డి సతీష్, చిట్టిబాబు, మాజీ డిసిసిబి డైరెక్టర్ పులి మధు, గుమ్మరేగుల వైఎస్ఆర్సిపి నాయకులు బచ్చల తమ్మారావు, నాగేశ్వరరావు, మరియు రౌతులపూడి మండల వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి పర్వదిన పూజలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట) డిసెంబర్ 30..** స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామివారి స్వామి ఆలయంలోనూ, అంగర శ్రీ రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాల స్వామివారి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనాలు వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమాలు ఘనంగా మంగళవారం నిర్వహించారు మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుండీ ఆలయాల్లో స్వామివారి దర్శనాలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తిరుప్పావై పాశురాల పారాయణ, విష్ణు, లక్ష్మి, లలితా పారాయణ లతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వైకుంఠ ద్వారం దర్శనం లభిస్తే మహా పుణ్యఫలం కలుగుతుందనే విశ్వాసంతో తెల్లవారుజామున నుండి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అలాగే కోరుమిల్లి, టేకి, వల్లూరు అంగర తదితర గ్రామాల్లో వైష్ణవ ఆలయాలు భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించిన ఆలయ పాలకమండళ్ళు, ఈఓ, దేవస్థానం సిబ్బంది ఏర్పాటు చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవం

**కాజులూరు (మనసులో మాట) డిసెంబర్ 30..** వైకుంఠ ఏకాదశి మహోత్సవం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గొల్లపాలెం జగన్నాథగిరి కాజులూరు మంజూరు కోలంక కొయ్యేరు పల్లిపాలెం దుగ్గదురు నమ్మవానిపాలెం అయితపూడి తదితర గ్రామాలలో వెంకటేశ్వర స్వామి , కేశవ స్వామి , మదన గోపాల స్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఉదయం బ్రహ్మ ముహూర్తం నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి దర్శనంతో భక్తులు తరించి, కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల జయజయధ్వానాలతో ఆలయాలు మార్మోగాయి.

వైకుంఠ ఏకాదశి మహోత్సవం భక్తుల హృదయాల్లో భక్తి, శాంతి, ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది. ఈ వేడుకలు స్వామివారి మహిమను చాటుతూ భక్తులను మరింతగా ఆధ్యాత్మిక మార్గంలో నడిపించాయి.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు చర్యలు తీసుకున్నాయి. దర్శన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సామర్లకోటలో ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు పెద్దాపురం, (మనసులో మాట) డిసెంబర్ 31బీ సామర్లకోట లోని ప్రసిద్ధ స్వయంభు మాండవ్య నారాయణస్వామి ఉత్తర ద్వార దర్శనాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆలయ ఈవో బిక్కిన వెంకటరాయి చౌదరి ఆధ్వర్యంలో అర్చక స్వాములు రఘురామాచార్యులు తదితరులు ఉత్తర ద్వార దర్శనాలను భక్తులకు కల్పించారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శిస్తే విశేష శుభ ఫలితాలు లభిస్తాయని ప్రాచీన కాలం నుండి ఆధ్యాత్మిక గ్రంథాలు వివరించడంతో శ్రీ లక్ష్మీ మాండవ్య నారాయణస్వామిని భక్తులు ఉత్తర ద్వారం నుండి దర్శించి, తరించారు. ఆలయ ప్రతినిధి నాని ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు చక్ర పొంగలి, దద్దోజనం, తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వయంభు మాండవ్య నారాయణస్వామి దర్శించడం సాక్షాత్తు వైకుంఠంలో నారాయణని దర్శించినట్లు ఉందని భక్తులు తెలిపారు.

# సామర్లకోటలో ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు



**పెద్దాపురం, (మనసులో మాట) డిసెంబర్ 31..** సామర్లకోట లోని ప్రసిద్ధ స్వయంభు మాండవ్య నారాయణస్వామి ఉత్తర ద్వార దర్శనాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆలయ ఈవో బిక్కిన వెంకటరాయి చౌదరి ఆధ్వర్యంలో అర్చక స్వాములు రఘురామాచార్యులు తదితరులు ఉత్తర ద్వార దర్శనాలను భక్తులకు కల్పించారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శిస్తే విశేష శుభ ఫలితాలు లభిస్తాయని ప్రాచీన కాలం నుండి ఆధ్యాత్మిక గ్రంథాలు వివరించడంతో శ్రీ లక్ష్మీ మాండవ్య నారాయణస్వామిని భక్తులు ఉత్తర ద్వారం నుండి దర్శించి, తరించారు. ఆలయ ప్రతినిధి నాని ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు చక్ర పొంగలి, దద్దోజనం, తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వయంభు మాండవ్య నారాయణస్వామి దర్శించడం సాక్షాత్తు వైకుంఠంలో నారాయణని దర్శించినట్లు ఉందని భక్తులు తెలిపారు.

# త్వరలో రాష్ట్రంలో ప్రివెంటివ్ హెల్త్ కార్యక్రమం

**- కూటమి ప్రభుత్వంలో విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత**

**- రూ.2.42 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దాట్ల శంకుస్థాపనలు**



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 30:** రాష్ట్రంలో త్వరలో ప్రివెంటివ్ హెల్త్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు. మంగళవారం తాళ్లరేవు మండలంలోని పలు పంచాయతీలలో రూ. 2.42 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు. తొలుత స్థానిక సామాజిక ఆస్పత్రిలో రూ.23 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దాట్ల శంకుస్థాపన చేసారు. అనంతరం కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం, గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం, పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది. గోవలంక గ్రామాలలో హెల్త్ సెంటర్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. అలాగే పత్తిగొంది స్కూల్లో రూ.10 లక్షల సర్వ శిక్షాభియాన్ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గది నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంజీవని అనే ప్రివెంటివ్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనిద్వారా ప్రాణాంతక వ్యాధులు రాకుండానే ముందస్తు పరీక్షలు ని ం ్ వ ఎి ా ం చ ్ డ ్ ం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, సర్పంచ్లు పంపన రామకృష్ణ, పెయ్యల మంగేష్, కామాడి గోవలక్ష్మి, నాయకులు ధూళిపూడి వెంకటరమణ, ముత్యాల జయలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, దూళిపూడి నాగేంద్రప్రసాద్, జి. వెంకటరమణ, వై దాడి శ్రీనివాస్, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

**సిరిపురంలో శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో**

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబర్ 30..** ఏలేశ్వరం మండలం లోని సిరిపురం గ్రామంలో స్వయంగా భూ గా వేంచేసి ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్బంగా ఏకాహ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా అనపర్తి దుర్గాప్రసాద్ దంపతులచే గ్రామం పౌరహితులు కాల్నాద పట్ల పార్వతీశ్వర రవికుమార్ కాలనాథ పట్ల సుబ్రమణ్య శర్మ శిష్ట శివ శర్మ ఆలయ అర్చకులు యామిజాల శివ రామకృష్ణచే స్వామివారికి అభిషేకాలు సీతారాములకు శాంతి కళ్యాణం ప్రభాత సేవ కార్యక్రమం తెల్లవారు జాము నుంచి 24 గంటలపాటు స్వామి వారికి భజన కార్యక్రమాలు జరిపారు. ఈ సంధర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సుమారు 70 సంవత్సరాల చరిత్ర వున్నా ఈ ఆలయం లో నిత్యం పూజలు జరుగుతాయాని ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి భీస్మా ఏకాదశి శివరాత్రి పర్వదినాలలో చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు వేల సంఖ్యలో పాల్గుని స్వామి వారిని దర్శించుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి కోరిన కోర్కెలు తీర్చే పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి అని పూజిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దనేకుల వీరభద్రం సంఘన ప్రభోజి వెలుగురి హరే రామ్ జనసేన నాయకులు సాయి వెంకటరమణ అనపర్తి సూర్యనారాయణ మూర్తి భాను పంచాయతీ గుమస్తా అనపర్తి దుర్గాప్రసాద్ అల్లం రాజు గ్రామస్తులు భారీ గా భక్తులు పాల్గొన్నారు.

# డ్రెయిన్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**- రుడా బోర్డు సమావేశంలో చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా) ఏడవ బోర్డు సమావేశం రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అధ్యక్షతన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి హాజరై తమ నియోజకవర్గాలకు సంబంధించిన అజెండా అంశాలు, అభివృద్ధి పనులపై చర్చించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా రుడా చైర్పర్సన్ బొడ్డు వెంకట రమణ చౌదరి 'రుడా' ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. 2025 జూన్ 11న జారీ చేసిన ప్రభుత్వ మెమోలోని నిబంధనల మేరకు ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన డ్రెయిన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు ప్రతిపాదించిన రోడ్ల నిర్మాణాలకు బోర్డు ఆమోదం తెలిపినట్లు, అయితే సదరు ప్రతిపాదనలను ప్రభుత్వ అనుమతుల కోసం పంపనున్నట్లు తెలియజేశారు.

రుడా లోగో రీడిజైన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ద్వారా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ టూరిజం అభివృద్ధి, రుడా మాస్టర్ ప్లాన్ తయారీ కోసం కన్సల్టెంట్ నియామకానికి సంబంధించి టెండర్ ప్రక్రియ, మాస్టర్ ప్లాన్ ఆమోద ప్రక్రియ తదితర అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో ప్రధాన రహదారులు, వాటి విస్తరణ, అవసరమైన డ్రెయినేజ్ నిర్మాణ ప్రతిపాదనలు, ప్రతిపాదిత రింగ్ రోడ్కు సంబంధించి ఐదు మోడళ్లను చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వివరించారు. ప్రముఖ అర్బన్ డిజైనర్ కిరణ్ భమిడిపాటి రుడా పరిధిలో టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధుల సమీకరణ అంశాలను వివరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్పర్సన్ వై మేఘా స్వరూప్ (ఐఏఎస్) కన్వీనర్గా వ్యవహరిస్తూ, అజెండాలోని అంశాలను పూర్తిగా వివరించారు. ప్రభుత్వ%- %(ై్పై వే ట్ % - % వ బ్లి క్ భాగస్వామ్యంతో చేపట్టబోయే వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై వివరించడంతో పాటు, చైర్పర్సన్ విజన్కు అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో రుడాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ శెట్టి బలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, రుడా కార్యదర్శి ఎంవీఆర్ సాయిబాబా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ (ఆర్ అండ్ బీ) ఎస్వీవీ రెడ్డి, ఆర్డీఎంఏ నాగ నర్సింహారావు, ఆర్డీడీటీపీ జీ సుబ్బారావు, కొవ్వూరు, నిడదవోలు, రామచంద్రపురం మునిసిపల్ కమిషనర్లు, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్ కుమార్, రుడా ఈఈ నాగేశ్వరి, ఏవో ప్రశాంత్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలను బాధ్యతాయుతంగా జరుపుకోవాలి

**- జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు**



**పల్నాడు, డిసెంబర్ 30, (మనసులో మాట):** నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు తెలిపారు.

ప్రజా శాంతి, భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరిక చేశారు.రాబోయే నూతన సంవత్సరం-2026 వేడుకలను పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని, జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. వేడుకల పేరుతో చట్ట నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజా శాంతి, భద్రతలను పరిరక్షించేందుకు జిల్లా పోలీస్ శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టిందని, ప్రజలు తప్పనిసరిగా పోలీసుల సూచనలు, ఆదేశాలను పాటించాలని ఎస్పీ కోరారు.

**ప్రజలకు ముఖ్య సూచనలు చేసిన జిల్లా ఎస్పీ**

డిసెంబరు 31 రాత్రి బహిరంగ ప్రదేశాలు, రహదారులపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రంకన్ డ్రైవ్ నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని, డ్రైవింగ్ లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే చర్యలు చేపడతామని హెచ్చరించారు. అతివేగం, బైక్ రేసింగ్, ప్రమాదకరంగా వాహనాలు నడపడం, సైలెన్సర్లు తొలగించి భారీ శబ్దాలు చేయడం, అనవసరంగా హారన్లు మోగించడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాము.డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి నిర్ణీత సమయం వరకే ప్రజలు బయట తిరిగేందుకు పోలీస్ శాఖ తరపున అనుమతించడం జరుగుతుంది. ఆ తరువాత నిబంధనలు ఉల్లంఘిస్తూ బయట తిరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాము. మైనర్ డ్రైవింగ్పై కఠిన చర్యలు %-% వయస్సు నిండని పిల్లలకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.పల్నాడు జిల్లా వ్యాప్తంగా బందోబస్తు ఏర్పాటు చేయబడింది. ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు, తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి, రాత్రి గస్తీ మరియు డ్రోన్ పెట్రోలింగ్ను ముమ్మరం చేస్తాము. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్, డ్యాన్సులు, బహిరంగ పార్టీలు, రంగులు పూయడం, డీజే / లౌడ్ స్పీకర్లతో శబ్ద కాలుష్యం సృష్టించడం నిషేధం. బహిరంగ ప్రదేశాలు లేదా రహదారులపై టపాసులు, మందుగుండు సామగ్రి కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటాము. పెద్ద సంఖ్యలో గుమిగూడి ప్రజల స్వేచ్ఛ, శాంతికి భంగం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము. మహిళలు, యువతులపై వేధింపులు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుం టాము. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి మాత్రమే మద్యం విక్రయాలు జరగాలి. ని బ ం ధ ్ న ల ం ఉల్లంఘించిన మద్యం షాపులు, బార్లపై కూడా కఠిన చర్యలు ఉంటాయి. ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలి.

ట్రాఫిక్ నియంత్రణ,సమూహాల నియంత్రణ కోసం తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాము. ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ఇంటివద్దనే ఆనందంగా జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో ఇరుక్కొని జైలుకు వెళ్లి కుటుంబ ఆనందానికి దూరం కావద్దని జిల్లా ఎస్పీ హితవు పలికారు.ఏవైనా అవాంఛనీయ ఘటనలు లేదా ఇబ్బందులు ఎదురైతే వెంటనే డయల్ 112 కు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని కోరారు. పల్నాడు జిల్లా ప్రజలందరూ నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సురక్షిత వాతావరణంలో స్వాగతించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.




# తూర్పు లో కలపడం తో హర్షం

**కపిలేశ్వరపురం (మనసులో మాట ) డిసెంబర్ 30..** మండపేట నియోజక వర్గం ను సమీప రాజమహేంద్రవరం కేంద్రంగా గల తూర్పు గోదావరి జిల్లాలో విలీనానికి క్యాబినెట్ ఆమోదం తెలపడంతో ఎన్ డి ఎ కూటమి శ్రేణులు నియోజక వర్గ వ్యాప్తంగా ఆనందానికి అవధులు లేకుండా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా వచ్చే యేడాది జనవరి 4వ, తేదీన మండపేట నియోజక వర్గ శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వర రావు కు పౌర సన్మానం చేయుటకు ముందస్తు సన్నాహక చర్యలు నిమిత్తం కరపత్రాలు అందచేస్తున్నారు. ఈ సందర్భంగా అంగర టీడీపీ కార్యాలయంలో ఖండ్రిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్ పుత్సల శ్రీనివాస్ మీడియా తో మాట్లాడారు.డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యే ఎమ్ ఎల్ ఏ వేగుళ్ళ పౌర సన్మానానికి నియోజక వర్గ వ్యాప్తంగా వివిధ విభాగాల ప్రభుత్వ అధికారులు, టీడీపీ, జనసేన,బీజేపీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. మండపేట నియోజక వర్గం నకు నాలుగు దఫాలు వరుసగా శాసనసభ కు ప్రతినిత్యం వహించిన వేగుళ్ళ తలపెట్టిన కార్యం సాధించే వరకూ విశ్రమించకుండా తండ్రికి తగ్గ తనయుడిగా పేరుగాంచారని పుత్సల శ్రీనివాస్ కొనియాడారు. ఈ మీడియా సమావేశంలో వేణుగోపాల్ స్వామి దేవస్థానం ఛైర్మన్ త్రిపురశెట్టి వెంకటేశ్వర రావు, మచ్చ గంగరాజు, బొల్లోజు రామ్ ప్రసాద్, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

# భజన సంఘ గురువులకు సన్మానాలు



**గండేపల్లి (మనసులో మాట) డిసెంబర్ 30..** గండేపల్లి మండలంలో మల్లేపల్లి గ్రామం నీలకుండీలు తోట రామాలయం ఆవరణలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భజన సంఘ గురువులు వలబశెట్టి బుజ్జి తెలగరెడ్డి శ్రీనివాసులను మంగళవారం గండేపల్లి ఎస్సై శివ నాగబాబు,ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి, ఏవో చంద్రరావు చేతుల మీదగా గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి దుస్సాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ..గత 21 సంవత్సరాలుగా రామాలయం వద్ద కార్తీక మాసం నెల రోజులు నగర సంకీర్తనలు చేయడంతో పాటు ఎంతోమందికి భజన కీర్తనలు నేర్పించారని వారి భక్తి గుర్తిగా ఈ చిరు సత్కారం చేస్తున్నట్లు వారు తెలిపారు. గండేపల్లి ఎస్సై మాట్లాడుతూ దేవుడు సన్నిధిలో భజన కార్యక్రమాలు చేయడంతో పాటు పలువురికి భజన ఎలా చేయాలో నేర్పించడం మంచి కార్యక్రమం అని ,నేర్చుకున్న భజన భక్తులు మరింత మందిని ప్రోత్సహించి దేవుడు కార్యక్రమంలో పాలుపంచుకునేలా చూడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటేశులు తెలగ రెడ్డి భద్ర రావు గ్రామ పెద్దలు వళ్ళబశెట్టి వెంకటరమణ తెలగ రెడ్డి భాస్కరరావు వలబశెట్టి వీరభద్రం ఇంటి సత్యనారాయణ వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చిల్లంగి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

**- ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న వేలాది మంది భక్తులు**

**- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ**



**కిర్లంపూడి, (మనసులోమాట) డిసెంబరు 30..** కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని,ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ప్రముఖ పారిశ్రామికవేత్త,ఆధ్యాత్మికపరుడు సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైనా ఉండాలని కోరారు.ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలోవేధపండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి విశేష పూజలు నిర్వహించారు.శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలి రావడంతో భక్తలతో ఆలయం కిటకిలాడింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

# పందిరి రాక మంచి చేసిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



**అనపర్తి, (మనసులో మాట) డిసెంబరు 30:** అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ భక్తాంజనేయ స్వామి వారి తీర్థ మహోత్సవం సందర్భంగా పందిరి రాట మంచి చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల,కుతుకులూరు గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు, గ్రామస్థులు,భక్తులు పాల్గొన్నారు.



# ఆదిత్య లో ముగిసిన ఆన్‌లైన్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

**గండేపల్లి (మనసులో మాట) డిసెంబర్ 30..** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో, ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ అకాడమిక్ విభాగం మరియు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ ఏఐసీటీఈ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసినట్లు విశ్వవిద్యాలయ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ఆరు రోజుల (21-26 వరకు) కార్యక్రమం "సుస్థిర విద్యుత్ మరియు ఇంధన సెల్ వాహనాల కోసం ఏఐ శక్తితో కూడిన ఆప్టిమైజేషన్ వ్యూహాలు" అనే అంశంపై నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జాతీయ మరియు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ప్రముఖ భారతీయ సంస్థలు మరియు పరిశ్రమల నుంచి వచ్చిన నిపుణులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మలేసియాలోని సన్‌వే యూనివర్సిటీ నుంచి డాక్టర్ సైదుర్ రెహమాన్, జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ లక్సెంబోర్గ్ నుంచి డాక్టర్ అసిఫ్ ఆఫ్జాల్, ఐఐపీఈ విశాఖపట్నం నుంచి డాక్టర్ శేషగిరి రావు అంబటి, ఎన్‌ఐటీ ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రొఫెసర్ టి. కార్తికేయ శర్మ, ఎన్‌ఐటీ వరంగల్ నుంచి ప్రొఫెసర్ దేవనూరి జయకృష్ణ, బిట్స్ పిలానీ హైదరాబాద్ నుంచి డాక్టర్ ఐ. శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే చెన్నైలోని శంకర్ అడ్వాన్స్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి డాక్టర్ ఎం. పార్థసారథి, పూణేలోని ఏవియల్ & ఐబెరికే ఎస్.ఏ. సంస్థ నుంచి శ్రీ శివ సుబ్రహ్మణ్యం, బెంగళూరులోని బీటీఐ ఇగ్నైట్ ఇంక్యుబేషన్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. ప్రభాకర్, ఐఐటీ మద్రాస్ నుంచి ప్రొఫెసర్ పి.వి. మణివణ్ణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.
వారు లో కాస్ట్ అడ్వాన్స్డ్ మెటీరియల్స్, దీర్ఘకాలిక ఎనర్జీ స్టోరేజ్, హైబ్రిడ్ మరియు ఆటోనమస్ వాహన సాంకేతికతలు, ఎనర్జీ స్టోరేజ్‌లో ఏఐ వినియోగం, థర్మల్ ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రిక్ వాహనాలలో ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్, హైడ్రోజన్ మరియు ఫ్యూయల్ సెల్స్, స్మార్ట్ ఎలక్ట్రిక్ మరియు హైబ్రిడ్ వాహనాలలో ఏఐ ఆధారిత నవీనతలు వంటి వివిధ అంశాలపై విస్తృతంగా వివరించారు.
ఈ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమానికి వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎ. రమేష్ (ఇంజనీరింగ్ & సైన్స్), అకాడమిక్స్ బాధ్యతలు వహిస్తున్న డాక్టర్ ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్స్ డాక్టర్ ఏ. శరవణన్, డాక్టర్ పి.ఎస్. రంజిత్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.డి.వి.వి.ఎస్. భీమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సరం రోజున జనవరి 18 చలో ఖమ్మం కు, మార్చి లో జరిగే మునిసిపల్ మహాసభలకు విరాళాలు తీసుకురండి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే మిత్రులు బోకే, ఫ్రూట్స్ బదులు ఆ ఖర్చును సీపీఐ శత దినోత్సవం ముగింపు సభ జనవరి 18 న ఖమ్మం లో జరుగుతున్నందున అదేవిధంగా మున్సిపల్ రాష్ట్ర మహాసభలు రాజమండ్రి లో జరుగుతున్న నేపథ్యంలో మిత్రులందరూ విరాళాలుగా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు విజ్ఞప్తి చేశారు. ఆడంబరాలకు బదులు పార్టీ కోసం భవిష్యత్తుకు తోడ్పడాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## వైసీపీ అంటేనే దగా దగా - వైసీపీది విధ్వంసకర పాలన...

# కూటమిది సంక్షేమ పాలన

- మేము యువతకు లాప్ ట్యాప్‌లు ఇస్తామంటే... వారు కత్తులు ఇస్తామంటున్నారు
- మెగా డీఎస్సీతో వైసీపీ నిరుద్యోగ యువతను దగా చేసిందిల
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు నెరవేరుస్తున్నాం
- వైసీపీ పాలనలో కొత్త పెన్షన్లు లేవు... కొత్త రేషన్ కార్డులు లేవు -రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** అధికారంలోకి వచ్చింది మొదలు ఆఖరి నిమిషం వరకూ కూడా గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసకర పాలన సాగించిందని, వైసీపీ నియంత పాలన పట్ల విసుగు చెందిన ప్రజలు ఇంటికి సాగనంపారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందించడం జరుగుతోందన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 2025లో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సంక్షేమం..అభివృద్ధి.. పెట్టుబడులు ఈ మూడు దిశలలో ముందుకు వెళ్లిందన్నారు. భవిష్యత్తులో కూడా అలాగే వెళుతుందన్నారు. "రాష్ట్రం దేవాలయం... ప్రజలే దేవుళ్లు... అభివృద్ధే లక్ష్యం... పారదర్శకతే పునాది" అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2024లో ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఒకే ఏడాదిలో రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, ఆడబిడ్డల కోసం ప్రత్యేక నిధులు వంటి పథకాలకు వేల కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందన్నారు. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయంగా సుమారు 10 వేల కోట్ల రూపాయలు చెల్లించటం, పెన్షన్లకు గత 18 నెలల్లో దాదాపు 50 వేల కోట్లు ఖర్చుచేయటం వంటి అంశాలు ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్త్రీ శక్తి కార్యక్రమాలు, నేతన్నలకు భరోసా, ఆదరణ-3 వంటి పథకాల ద్వారా మహిళలు, కార్మికులు, సంప్రదాయ వృత్తిదారులకు ఆర్థిక బలాన్ని కల్పించడం జరిగిందని వివరించారు. 2025లో రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 11.28 శాతానికి పైగా నమోద్కైందని నివేదికలు చెబుతున్నాయని, ఇది పెట్టుబడులు రాబట్టడం.. ప్రాజెక్టుల స్థాపనలో చూపిన సాహసానికి సంకేతమన్నారు. రహదారుల మరమ్మతులకు సుమారు 1000 కోట్లు, కొత్త రహదారుల నిర్మాణానికి 3 వేల కోట్లు ఖర్చుచేసి కనెక్టివిటీని మెరుగుపరిచింది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. ఈ మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. అలాగే పోలీసు కానిస్టేబుళ్ల నియామకం చేసి రూ. 4,500 ఉన్న వారి స్టైఫండ్ ను రూ. 12,500 లకు పెంచడం జరిగిందన్నారు. తాము యువత చేతిలో ల్యాప్ ట్యాప్‌లు పెడతామంటే వైసీపీ వారు కత్తులు పెడతామనడం దారుణమన్నారు. వైసీపీ గతంలో మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగ యువతను దగా చేసిందని మండిపడ్డారు. విశాఖపట్నంలో ఐటీ హబ్, గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్, ఇంటర్నేషనల్ సబ్‌సీ గేట్‌వే ప్రాజెక్ట్ వంటి భారీ పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌ను డిజిటల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. వాట్సాప్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్, ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా మాదక ద్రవ్యాలపై ప్రత్యేక యుద్ధం, క్రైమ్ రేటు తగ్గింపు ఇవన్నీ కలిపి ప్రజలకు చేరువైన పారదర్శక పరిపాలనను నిర్మించాయని గర్వంగా చెప్పారు. గత పాలకుల నియంత పాలన కారణంగా వినాశనానికి గురైన రాష్ట్ర పురోగతి కోసం "ఈ కూటమి ప్రభుత్వం ఇటుక ఇటుకగా పేర్చి కొత్త ఆంధ్రప్రదేశ్‌ను కడుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల పర్యవేక్షణలో కూటమి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం సురక్షితంగా... అభివృద్ధి వేగంగా... ప్రజాస్వామ్యం గర్వంగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

# హుకుంపేటలో వైభవంగా వైకుంఠ ముక్కోటి ఏకాదశి వేడుకలు

## -నాగిరెడ్డి నగర్ మూడు గుళ్ళు లో శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలో వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. హుకుంపేట నాగిరెడ్డి నగర్ మూడు గుళ్ళలో కొలువైయున్న శ్రీవారి ఆలయ ఉత్తర ద్వార స్వామివారిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పవిత్ర ధనుర్మాసం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు ఆలయానికి రావటం ప్రారంభించారు. ఆలయ అర్చకులు వీరభద్రశర్మ, రామంశర్మ, రాంబాబు శర్మ, దుర్గా రమాభాయి, శకుంతల పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు నడుమ క్రమ పద్ధతిలో ఉత్తర ద్వారం గుండా స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. గతేడాది కంటే ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగిందని ఆలయ పర్యవేక్షకులు రామమూర్తి శర్మ, రమాభాయి తెలిపారు.

# వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజల అందరిపైనా ఉండాలి

## - ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇంచార్జి ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి (మనసులోమాట) డిసెంబరు 30..** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదములుస్వీకరించారు. ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి, ముద్రగడ గిరిబాబులకు ఆలయ కమిటీ సభ్యులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినాన పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడం స్వామివారిని దర్శించుకోవడం చూస్తుంటే రోజురోజుకు ప్రజల్లో భక్తి భావం పెరగడం శుభపరిణామన్నారు. ఆ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరి పైనా ఉండాలని మనసారా కోరుకుంటున్నానన్నారు. ఆలయాని కి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్న కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఆయన వెంట జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ముద్రగడ అభిమానులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకలకు కేకులు సిద్ధం





**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** కొత్త క్యాలెండర్ గోడకు తగిలించినా లేకపోయినా, అయిన వారికి విషెష్ చెప్పినా చెప్పకపోయినా, వాట్సాప్ స్టేటస్‌లు పెట్టినా పెట్టకపోయినా..
కేకు మాత్రం కోయాల్సిందే. కేకు లేకుండా న్యూఇయర్ సెలబ్రేషన్ అనేదే ఉండదు కదా. అందుకే బేకరీలు టేస్ట్‌తో పాటు లేటెస్ట్ డిజైన్లతో కొత్త కొత్త కేక్‌లను తయారు చేస్తున్నాయి. బెంగళూరు, మహారాష్ట్ర, బరంపురం, భువనేశ్వర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మాస్టర్స్ జిల్లాలో బేకరీలు నిర్వహిస్తూ కేకుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. అందరినీ ఆకట్టుకునేలా చక్కటి డిజైన్లతో కేకులు సిద్ధం చేస్తున్నారు.

**పెరిగిన డిమాండ్:**
ప్రస్తుతం న్యూ ఇయర్ వేడుకలతో కేకులకు డిమాండ్ పెరిగింది. దీంతో ట్రెండ్‌కు తగ్గట్టు జిల్లాలో కేక్‌లు తయారు చేస్తున్నారు. సాధారణ కేకులు కిలోకు రూ.250-రూ.500 వరకు, కూల్ కేక్స్ కిలోకు రూ. 500 మొదలుకుని రూ.3,500 వరకు ఉన్నాయి.

**అన్ని వైరైటీల్లో:**
కేక్స్ అన్ని వైరెటీల్లో అందిస్తున్నాం. కస్టమర్ల అభిరుచుల మేరకు అన్ని ఫ్లేవర్స్‌లో కేక్స్ సిద్ధం చేస్తున్నాం. ప్రజల నుంచి మంచి ఆదరణ ఉంది. సాధారణ కస్టమర్‌కు అనుగుణంగా ధరలు నిర్ణయించడం జరిగింది.
- శ్రీను ఒక బేకరీ నిర్వాకుడు, అనాతవరం

**గంటలోనే తయారు చేసేస్తాం**
కస్టమర్లు కోరిన డిజైన్లలో కేక్స్ కేవలం గంటలోపే తయారు చేస్తున్నాం. కేక్‌లపై క్రీమ్‌తో డిజైన్లు వేయడం సొంతంగా నేర్చుకున్నా. డిసెంబర్ 31 కోసం కేక్‌లు సిద్ధం చేస్తున్నాం. అన్ని వైరెటీల కేక్స్, ఆన్‌లైన్‌లో కనిపించే వైరెటీ కేక్స్‌ను ఆర్డర్లను బట్టీ తయారు చేసి ఇస్తున్నాం.
- జి.గణేష్, కేక్ మేకర్, ముమ్మిడివరం



# ప్రధానోపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 30:** ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్ ను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరు రవి పాల్గొని ప్రధానోపాధ్యాయుల సర్వీస్ నిబంధనలపై విజ్ఞాపన చేశారు. ప్రధానోపాధ్యాయ సంఘం ఏర్పడి 75 సంవత్సరాల అయిన సందర్భంగా మంత్రి దుర్గేష్ కు 75 ప్లాటినం జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా నాయకులు కేవీ రమణారావు, మంగిన రామారావు, పల్లి రాజు, గణపతి రావు, ఎస్ ఎల్ వి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాదాసేదాగా బడ్జెట్ సమావేశం



**గండేపల్లి (మనసులో మాట) డిసెంబర్ 30..** మండల కేంద్రమైన గండేపల్లి అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఎంపీపీ చలగల పద్మనాభుడు ఆధ్వర్యంలో సాదాసీదాగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ అభివృద్ధి పనులను తెలియజేశారు. అయితే ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. హాజరు కాని వారికి సోకాజి నోటీసులు పంపించడం జరుగుతుందని ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. సమావేశంలో రెవెన్యూ శాఖ పై కొంతమంది ఎంపీటీసీలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలో రి సర్వే విషయంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటన్నింటినీ సరి చేయకపోతే ఆఫీస్ దగ్గర ఆందోళన చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లు కుంచె రాజా, వెంకటలక్ష్మి, తాసిల్దార్ శ్రీనివాస్, ఏవో చంద్రరావు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోలార్ తో విద్యుత్తు పొదుపు

## కాకినాడ బార్ అసోసియేషన్లో సోలార్ ప్రాజెక్ట్ ప్రారంభించిన అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** ఎన్నో సంవత్సరాలుగా కాకినాడ బార్ అసోసియేషన్లో విద్యుత్ వినియోగించడం వలన పెద్ద మొత్తంలో కరెంట్ బిల్లులు వచ్చేవి. నేటితో ఆ సమస్యకు ఫుల్ స్టాప్ పడింది. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం సోలార్ ప్రాజెక్ట్ ని మంగళవారం ప్రారంభించారు. అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలిసి న్యాయవాదుల ఉత్సాహం మధ్య ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టుకు సీనియర్ న్యాయవాది దివంగత సామవేదం రఘునాథ్ కుమారుడు రాజేంద్ర ఆయన తండ్రి జ్ఞాపకార్థం రెండు లక్షలరూపాయలు ఎస్ ఆర్ ఎమ్ టి అధినేత కంటిపూడి సారధి రెండు లక్షలు మాజీ వినియోగదారుల సంఘ చైర్మన్ సిహెచ్ రాధాకృష్ణ కుమారుడు ఆయన తండ్రి జ్ఞాపకార్థం కిషోర్ కుమార్ లక్ష రూపాయలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ చెక్కపల్లి వీరభద్రరావు కమిటీ సభ్యులు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.





## పిఠాపురంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

**పిఠాపురం, (మనసులో మాట)డిసెంబరు 30:** పిఠాపురం పట్టణంలోని ప్రసిద్ధ పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన శ్రీ రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత కుంతీమాధవ స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వేకువజాము నుండే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి పోటెత్తారు. ఉత్తర ద్వారం గుండా స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం అంతా గోవింద నామస్మరణతో మారుమ్రోగింది.

**పంచామృతాభిషేకాలు - ప్రత్యేక అలంకరణ:**
ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామివారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని, అమ్మవార్లను విశేష ఆభరణాలతో, పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

**గరుడ వాహన సేవ:**
వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుంతీమాధవ స్వామి వారు సతీసమేతంగా గరుడ వాహనంపై అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వాహన సేవను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ఊరేగింపు వైభవం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది.

**ఘనంగా తిరుప్పావై సేవలు:**
ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో తిరుప్పావై సేవలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోదాదేవి పాశురాల పఠనం, ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి నున్న శ్రీరాములు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సహస్త్రఫల పుష్ప అలంకరణలో వేణుగోపాల స్వామి వారు

పిఠాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఆలయ అర్చకులు విజయ జనార్ధనాచార్యులచే స్వామి అమ్మవార్లను సహస్త్ర ఫలాలచే పుష్పాలచే ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి అమ్మవార్ల ఉత్తర ద్వార దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

చిత్రాడ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఆలయ కమిటీ ఇచ్చే భారీ రథోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన దేవతామూర్తుల వేషధారణలు భక్తులని ఆకట్టుకున్నాయి.

అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దైవ సేవలో తరించారు. ధనుర్మాసం వైకుంఠ ఏకాదశి పిఠాపురం నియోజకవర్గంలో గల అన్ని వైష్ణవ దేవాలయాలలో ఘనంగా నిర్వహించారు.

## గీత దాటితే చర్యలు తప్పవు గండేపల్లి ఎస్సై శివనాగబాబు



**గండేపల్లి (మనసులో మాట) డిసెంబర్ 30..** కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో గండేపల్లి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు. ఈ నెల 31వ తేదీ రాత్రి కొత్త ఏడాది వేడుకల సందర్భంగా మండలంలోని వేడుకల పేరుతో యువత రోడ్లపైకి వచ్చి కేక్స్ కట్ చేయడం, బాణసంచా కాల్చడం,గుంపులుగా చేరి హడావుడి చేయడం వంటివి,ముఖ్యంగా సైలెన్సర్ లేని బైక్ లను సీజ్ చేస్తామన్నారు.గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్నేహపూర్వక వాతావరణం లో న్యూ ఇయర్ వేడుకలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలని ఎస్సై శివ నాగబాబు అన్నారు.మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ విచక్షణ రహితంగా స్పీడ్ గా బైకులు,కార్లు ఇతర వాహనాలు నడపడం వల్ల ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దన్నారు.న్యూ ఇయర్ పార్టీ ఎవరి జీవితాల్లో, కుటుంబాల్లో విషాదం మిగల్చరాదు అని ఆకాంక్షిస్తున్నామని గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

# సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి పాలన...

### సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ - 2025లో 60 అద్భుత విజయాలు

### కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్



**కాకినాడ( మనసులో మాట) డిసెంబర్ 30...** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పాలనలో నూతన ఒరవడి సృష్టిస్తూ 2025 సంవత్సరంలో చారిత్రక విజయాలను సొంతం చేసుకుందని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం సూపర్ హిట్‌గా అమలు చేసిందని నవీన్ కుమార్ వెల్లడించారు. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు దీపం-2 పథకం ద్వారా 2 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా 3.25 కోట్ల మందికి లబ్ది చేకూరిందన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా కింద రికార్డు స్థాయిలో రూ.50,000 కోట్లకు పైగా పెన్షన్లు అందజేశామని తెలిపారు. కేవలం సంక్షేమమే కాకుండా అభివృద్ధికి పెద్దపీట వేసామని నవీన్ కుమార్ అన్నారు. సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నామని, తద్వారా 16.13 లక్షల ఉద్యోగాలకు మార్గం సుగమమైందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టడం యువత పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి అన్నదాత సుఖీభవ కింద రూ.6,310 కోట్లు జమ చేశామని, ధాన్యం సేకరణ డబ్బులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. పోలవరం పనుల్లో వేగం పెంచడంతో పాటు, 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్‌ను అరికట్టడానికి ఈగల్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేశామని తద్వారా క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందని నవీన్ కుమార్ తెలిపారు. రోడ్ల మరమ్మతులకు రూ.1,000 కోట్లు కేటాయించడమే కాకుండా గ్రామాల్లో పల్లె పండుగ ద్వారా 4,000 కి.మీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని 11.28 శాతం డబుల్ డిజిట్ గ్రోత్‌కు చేర్చగలిగామని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని 2025లో సాధించిన ఈ 60 విజయాలు కేవలం ఆరంభం మాత్రమేనని జ్యోతుల నవీన్ కుమార్ స్పష్టం చేశారు.

# సీపీఐ శతాబ్ది వేడుకలను జయప్రదం చేయండి

### - మతోన్మాదం పార్టీ బిజెపిని దేశంనుండి సాగనంపుదాం



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 30:** జనవరి 18తేదిన ఖమ్మంలోజరిగే వందసంవత్సరాలు శతదినోత్సవం పండుగను 5లక్షలమందితో భారీ ర్యాలీ చేబట్టడం జరుగుతుందని ఈవేడులకు భారతదేశ ప్రజానికం హాజరై జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు కోరారు.

మంగళవారం పిఠాపురం లో కరపత్రం ఆవిష్కరణ సందర్బంగా సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ మాట్లాడుతూ సిపిఐ పార్టీ వంద సంవత్సరాల పోరాటా ఘట్టాలనుప్రస్తావిస్తూ భారతదేశం స్వాతంత్ర్యం పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిదన్నారు.

దున్నే వాడిదే భూమి భూచట్టాల తీసుకొచ్చి నినాదం వరకుప్రతి పేదవాడికి కూడుగూడు, ,విద్య వైద్యం అందరి హక్కు అని అందించాలని డిమాండ్ చేసిన ఎకైక పార్టీ సిపిఐ పార్టీ అని కొనియాడారు.

పేదవాడికి ఇండ్లస్థలాలు రైతు పక్షాన పోరాటం కార్మికులు కర్షకులు హక్కు లకోసం యువతి యువకులకు ఉద్యోగం ఉపాధి కోసం గళమెత్తి పోరాటా ఘట్టాలు ఎన్నో ఉన్నాయన్నారు. అదేవిధముగా దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలనవిధానం ప్రస్తావిస్తూ లౌకిక సామ్యవాద అతిపెద్ద రాజ్యాంగం కలిగి దేశంలో సమానత్వం కలిగిన సెక్యులరిజం దేశంలో మతవిధ్వంసమే ఎజెండా గాసాగే బిజెపి ఆలోచన విధానాన్ని తప్పుబట్టారు.

25 ఆర్టికల్ ప్రకారం ఎవరు నచ్చిన మతంవారు స్వీకరించుకోచ్చుఅనేఅంశాన్ని బిజెపి విస్మరించి రాజ్యాంగ విరుద్ధం గా, ప్రజాస్వామ్యాన్ని కూనిచేస్తుందన్నారు.

బిజెపి కి అనుకూలంగా ఉంటే భారతీయులుగాను వ్యతిరేకిస్తే దేశద్రోహులుగాను ప్రతిఘటించడందారుణమన్నారు.

అలాగైయితే ప్రధాని నరేంద్ర మోది గాని , మోడీ తండ్రి గాని తాతగాని ఎవ్వరైనా దేశ స్వాతంత్ర్యం పోరాటం లో పాల్గొన్నారని ప్రశ్నించారు. బిజెపి గురువైన ఆరెస్సెస్ స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర ఎంటి అమిత్ షా పాత్ర ఎంత? అమిత్ షా తండ్రి పాత్ర ఎంత? అమిత్ షా తాత పాత్ర ఎంత. చెప్పాలని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య క్విట్ ఇండియా ఉద్యమానికినాయకత్వం వహించిన ,ఉప్పు సత్యాగ్రహం లాంటి శాంతియుత ఉద్యమాలకు బాటవేసి దేశం నుంచి బ్రిటిష్ వారిని దేశం నుండి పారద్రోలిన జాతిపితని చంపిన గాడ్సే గొప్ప వాడిని చేస్తు మహాత్మా గాంధీ పేరునుఆశయాలను తూట్లుపొడుస్తు పేరుకూడా వినబడకూడదని జాతీయ ఉపాధి హామీ పథకం పేరుమర్చి కుట్రలు చేస్తునాదన్నారు. బిజెపి అగాడాలు సిపిఐ ఎండగడుతుందని ముక్తకంఠంగా అన్నారు. ఇలాంటి అంశాలన్ని ఈ వందసంవత్సారాలవేడుకలో చర్చ జరుగుతుందని ఖచ్చితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరును ఎండగుతామని అన్నారు.

అందుకుగాను ప్రజలు వ్యాపారులు కార్మికులు కర్షకులు రైతులు సానుభూతి పరులు ధారాళంగా విరాళాలిచ్చి వేదిమందిగా ఖమ్మం తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మహిళా సమాఖ్య కేతా అరుణా , మోర్త నాగేశ్వరరావు చెరుకూరి గణపతి మద్రి పాదాలు తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థలకి ఎన్నికలా

### ఆశావాహుల్లో నీళ్లు చల్లిన ప్రభుత్వం - ఆంధ్రప్రదేశ్ లో ఏప్రిల్ తర్వాతే ఎన్నికలు?




**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 30:** పంచాయతీ ఎన్నికల పోరు ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించడం లేదని చెబుతున్నారు. గడువుకన్నా ముందే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించినా, కొన్ని కారణాల వల్ల ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు.

పంచాయతీల పునర్విభజన, విలీనం పూర్తికాకపోవడం కూడా ఎన్నికల నిర్వహణకు అడ్డుగా మారిందని అంటున్నారు.

డా. బీ. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో 22 మండలాల్లో సుమారుగా 385 పంచాయతీ లు, 300 పైగా ఎంపీటీసీ లు, 22 జడ్పీటీసీ ల స్థానాలు ఉన్నాయి.

ప్రధానంగా వచ్చేనెల 2వ తేదీ నుంచి జనగణన ప్రారంభమవుతున్నందున పంచాయతీల విభజన జరగడం లేదని, ఆ కారణంగా ఎన్నికలు నిర్వహించే ఆలోచనను కూడా ప్రభుత్వం మార్చుకుందని అంటున్నారు.

రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాలకు 2026 ఏప్రిల్ 2వ తేదీ వరకు గడువు ఉంది. పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన వరకు ఆ పంచాయతీ పరిధిలో మార్పులు, చేర్పులు చేయడం చట్టపరంగా కుదరదని చెబుతున్నారు. ఈ కారణంగా జనవరిలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మార్చుకుని.. పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాతే ఎన్నికలు పెట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా ఆలోచనల ప్రకారం వచ్చే ఏడాది జూన్ లేదా జులై నెలల్లోనే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

**ఆశావాహుల్లో ఆందోళన:**
వాస్తవానికి పంచాయతీలకు మూడు నెలలు ముందుగా అంటే జనవరిలోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఆ మేరకు ఎన్నికల సంఘానికి సూచనలు ఇచ్చింది. ఎన్నికల సన్నాహాలులో భాగంగా ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల కేంద్రాల గుర్తింపు వంటి ముందస్తు ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. ఎన్నికల కమిషన్ సైతం జనవరిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియజేసింది. ముందస్తు గా స్థానిక ఎన్నికలు జరుగుతాయని పోటీ చేసే అభ్యర్థులు గత మూడు నెలలుగా ఓటర్ల ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. జనవరి లో ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకి వెళ్తుందని తెలియడం తో ఆశావాహు లు ఎన్నికల కసరత్తు మొదలు పెట్టేరు. ఇప్పుడు ఎలక్షన్స్ లేవని తెలియడం తో ఆందోళన చెందు తున్నారు. అయితే రాజకీయంగా కొన్ని నిర్ణయాల ను అమలు చేయాల్సివున్నందున ప్రభుత్వం 'పంచాయతీ'పై పునరాలోచన చేసిందని అంటున్నారు.

**కారణాలు:**
గత ప్రభుత్వంలో పంచాయతీ పాలకవర్గాలు ఉన్నంతకాలం భౌగోళిక మార్పులు చేయరాదని చట్టం చేశారు. ప్రస్తుతం పంచాయతీల పునర్విభజనకు ఈ చట్టమే అడ్డంకిగా మారిందని చెబుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ పంచాయతీలను ఏకపక్షంగా గెలుచుకుంది. ఇప్పుడు కూటమి కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ప్లాన్ చేస్తోంది. ఇందుకోసం కొన్ని రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి టీడీపీ, జనసేన నేతల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. కొన్ని పంచాయతీల్లో విపక్షం బలంగా ఉందన్న కారణంగా వాటిని రెండుగా విడగొట్టడం లేదా సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయాలని ప్రతిపాదిస్తున్నారు.

ఇలా రాష్ట్రవ్యాప్తంగా 150 ప్రతిపాదనలు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే గత ప్రభుత్వం చేసిన చట్టం కారణంగా న్యాయవివాదాలు తలెత్తే అవకాశం ఉన్నందున ఏప్రిల్ 2వ తేదీ వరకు వేచివుండాలని ప్రభుత్వం భావిస్తోందని అంటున్నారు. అదే సమయంలో ప్రస్తుత ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పదవీకాలం కూడా పూర్తవుతుందని, కొత్త కమిషనర్ ద్వారానే ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వ ఆలోచనకు కూడా వీలు దొరికినందున జూన్ లేదా జులైలోనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.




## కాకినాడ లో నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### - నగర పాలక సంస్థ ఇన్‌చార్జీ కమిషనర్ ఎన్. సత్యనారాయణ

**కాకినాడ( మనసులో మాట) డిసెంబర్ 30..** 2026 జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక రోజు ముందుగానే డిసెంబర్ 31వ తేదీన నిర్వహించనున్నట్లు కాకినాడ నగర పాలక సంస్థ ఇన్‌చార్జీ కమిషనర్ ఎన్. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం నుండి కాకినాడ నగరంలోని సచివాలయ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీ ఆంగ్ల నూతన సంవత్సరం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సామాజిక భద్రత కింద అవ్వతాతలు దివ్యాంగులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇతర పింఛనుదారులకు డిసెంబర్ 31వ తేదీననే పింఛన్ల పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛనుదారుల ఇంటి వద్దకే వెళ్లి సొమ్ము అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ కే.టీ. సుధాకర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్ టీపీఆర్ఓ శైలజ మేనేజర్ సీతారాం తదితర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు

### - త్వరితగతిన పారదర్శంగా అనుమతులు మంజూరు చేయండి...

### - అధికారులను ఆదేశించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్ముఖ సగిలి




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 30..** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన ధరఖాస్తులకు పారదర్శకంగా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఏక గవక్ష విధానం క్రింద గడచిన త్రైమాస కాలంలో అందిన ధరఖాస్తుల పరిష్కారం, చిన్న, మద్య తరహా పరిశ్రమల ప్రోత్సాహనికి వివిధ రాయితీల మంజూరు 30వ సీసీఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2025లో కాకినాడ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జరిగిన ఒప్పందాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ పరిశ్రమలు ఫ్యాక్టరీస్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ గ్రౌండ్ వాటర్ సాంఘిక సంక్షేమం అగ్నిమాపక ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 2513 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 2104 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని మిగతా 409 దరఖాస్తులు వివిధ శాఖల వద్ధ పరిశీలనలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నిటిపైన నిర్ధిష్ట గడువు లోపు తగిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. చిన్న మద్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ పావలవడ్డీ విద్యుత్ తదితర రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 8 యూనిట్లకు సుమారుగా రూ. 23 లక్షలు విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించిందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి ఏడీ ఎస్.విజయ్ కుమార్ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణా రెడ్డి డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ నారాయణమూర్తి గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ జిల్లా అగ్నిమాపక సాంఘిక సంక్షేమ శాఖ ఇతర శాఖల జిల్లా అధికారులు పరిశ్రమల శాఖ సిబ్బంది మరియు వివిధ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తిరుపతి గోశాలకు ఎండు పశు గ్రాశం తరలింపు

### - గోకవరం మండల టిడిపి నాయకులు



**గోకవరం (మనసులో మాట), డిసెంబర్ 30:** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్న తిరుపతిలో శ్రీవారి సేవలో ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ నిమగ్నమైనప్పటికీ గోకవరంమండలంలో ఆయన తలపెట్టిన కార్యక్రమాలు నిర్విరాముగా కొనసాగుతున్నాయి. గోమాతకు సేవ చేయండని నెహ్రూ ఇచ్చిన పిలుపుతో టిడిపి నాయకులు, రైతులు ఎండు గడ్డిని సేకరణ కార్యక్రమం నిరంతరగా కొనసాగుతూవున్నది. ఇందులో భాగంగా గోకవరం మండలం ఇటికాయలపల్లి గ్రామంలో ఐదు లారీలతో ఎండు పశుగ్రాసం తిరుపతి గోశాలకు టిడిపి మండల కన్వీనర్ పిల్ల అర్జున సారధి (చంటిబాబు ) లాంఛనంగా జెండా ఊపి పంపించారు. ఈ గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మండల కన్వీనర్ చంటిబాబు, భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గల్ల రాము మాట్లాడుతూ జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో తిరుపతి గోశాలకు ఎండు గడ్డిని తరలిస్తున్నామని ఎమ్మెల్యే నెహ్రూ అడుగుజాడల్లో గోవులకు సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు దాసరి తమ్మన్నదొర, మోపర్తి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, పోసిన ప్రసాద్ , మండిగ గంగాధర్, కోన శివ నాయుడు తదితరులు పాల్గొన్నారు

### ఇంటివద్దకే రేషన్ పంపిణి కార్యక్రమాన్ని

# ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీవో మహేష్



**ధర్మవరం డిసెంబర్ 30 (మనసులో మాట)..** ధర్మవరంలో 65 సంవత్సరాలు పైబడిన లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇంటి వద్దకు సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించేందుకు స్థానిక రేషన్ షాపులను విస్తృతంగా ఆర్డీవో మహేష్ తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా అర్హత గల వృద్ధ లబ్ధిదారుల గుర్తింపు విధానం, వారికి పీడీఎస్ బియ్యం ఇంటి వద్దకు చేరే విధానం తదితర అంశాలను ఆర్డీవో సమగ్రంగా పరిశీలించారు. అర్హత గల వృద్ధులకు వారికి కేటాయించిన పీడీఎస్ బియ్యం ఎటువంటి అసౌకర్యం లేకుండా, నిర్ణీత కాలంలో, క్రమబద్ధంగా ఇంటి వద్దకే అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ ప్రక్రియ తప్పనిసరిగా నిర్వహించాలని, వృద్ధులు రేషన్ షాప్‌కు రావడంలో ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పారదర్శకత, బాధ్యత , గౌరవంతో కూడిన సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులు, రేషన్ షాప్ డీలర్లు, సిబ్బందికి ఆర్డీవో జారీ చేశారు.కేటాయింపు, పంపిణీ, లబ్ధిదారుల అంగీకారాలు, నిల్వల కదలికలకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిత్యం నవీకరించాలని వారు తెలిపారు. మార్గదర్శకాల నుండి ఏవైనా విరుద్ధ చర్యలు లేదా రికార్డు నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మొత్తం మీద ఇంటి వద్దకు బియ్యం పంపిణీ పథకం సంతృప్తికరంగా అమలవుతున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్డిటి, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాలపై తనిఖీలు

**పలమనేరు డిసెంబర్ 30 (మనసులో మాట) :** పలమనేరు మండలంలోని ఎరువుల దుకాణాలపై ప్రత్యేక అధికారి ఎరువుల దుకాణాలపై అకస్మికంగా ఏ ఓ ఏ సాలు రెడ్డి, ఏవో సునీల్ కుమార్ రెడ్డి,తనిఖీ నిర్వహించారు. పట్టణమునందు నాగ లింగయ్య అండ్ సన్స్, కౌండిన్య ఎఫ్. పి. ఓ దుకాణాలలో తనిఖీలు నిర్వహించి2 ఫారం అనుమతి లేని ఎరువులను 4.87 లక్షలు విలువచేసే12.5 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. ఎరువుల నిల్వ అమ్మకాలు రికార్డులు పరిశీలించారు. ఎం ఆర్ పి ధరలకే విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## పుల్లపల్లిలో మాదిగలపై దాడి

### పార్వతిపై అమానుష హింస

### - ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

### - డాక్టర్ సామ్రాట్ మధు మాదిగ




**ధర్మవరం డిసెంబర్ 30 (మనసులో మాట)** నియోజకవర్గం తాడిమర్రి మండలం పుల్లపల్లి గ్రామంలో ఈనెల 24 వ తేదీన మాదిగలపై జరిగిన దారుణ దాడి ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని ఎమ్మార్పీఎస్%-%ఎంఎస్పీ అనుబంధ సంఘాలు డిమాండ్ చేశాయి. జిల్లాలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ధర్మవరం డిఎస్పీ ని కలవడానికి వచ్చిన ఎమ్మార్పీఎస్%-%ఎంఎస్పీ నాయకులు డా. సామ్రాట్ కేవీ మధు మాదిగ, స్వతంత్ర కుమారి మాదిగ, మేకల బాలకృష్ణ మాదిగ, నరసంపల్లి నాగభూషణ, గుజ్జల రామాంజనేయులు పాల్గొన్నారు. డిఎస్పీ తిరుపతిలో డ్యూటీలో ఉన్నందున, మరో తేదీన ధర్మవరం నియోజకవర్గంతో పాటు బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

నాయకులు మాట్లాడుతూ బాధితురాలు పార్వతిపై అత్యంత ఘోరంగా దాడి చేయడమే కాకుండా, ఆమె వద్ద ఉన్న మూడు తులాల బంగారం లాక్కున్నప్పటికీ, ఇప్పటివరకు పోలీసులు ఆ నగలను రికవరీ చేయకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, ఈ ఘటన వెనుక ఎంతవరకు రాజకీయ కుట్ర ఉందో స్పష్టంగా కనిపిస్తోందని వారు ఆరోపించారు. అదేవిధంగా దాడి చేసిన నిందితులకు అరెస్ట్ చేయకుండా 41 నోటీసులు ఇచ్చి ఇంటికి పంపడం బాధితులకు అన్యాయం చేయడమే కాకుండా, నిందితులకు రక్షణ కల్పించినట్టేనని పేర్కొన్నారు. తలకు 9 కుట్లు పడిన గాయాలను “సాధారణ గాయాలు”గా చూపడం వెనుక కూడా కుట్ర ఉందని విమర్శించారు. ఈ ఘటనలో నిందితులైన నరేంద్ర, అశోక్, కృష్ణయ్య, సతీష్లను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# సూపర్ సిక్స్ సూపర్ హిట్

### - ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది



**పలమనేరు డిసెంబర్ 30( మనసులో మాట):** కూటమి ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ట్రెండ్ మారిందని ఈ ఏడాదిలో గొప్ప విజయాలను సాధించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. 2025 ఏడాది కూటమి ప్రభుత్వ విజయాలపై మంగళవారం ఆయన పలమనేరు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా,ఆటో డ్రైవర్ల సేవలో, మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టుల నియామకం,వంటి వాటిని దిగ్విజయంగా పూర్తి చేసామన్నారు. ఇక బాబు బ్రాండ్ తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ప్రపంచ దేశాలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూసేలా గూగుల్ లాంటి పెద్ద కంపెనీలు ఈ ఏడాదిలో రాష్ట్రానికి వచ్చాయని వివరించారు.ఆర్థిక విధ్వంసం నుంచి అభివృద్ధి సంక్షేమం వైపు రాష్ట్రం నేడు పరుగులు తీస్తోందన్నారు. ఓవైపు రాజధాని ప్రాంత అభివృద్ధితో పాటు పోలవరం లాంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతంగా ఉందని మూలధన వ్యయం కూడా పెరిగిందన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు దీటుగా సంక్షేమ అభివృద్ధిలో రాష్ట్రం రాణిస్తోండడం శుభపరిణామమన్నారు. దీనికి కూటమి ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూటమి పాలనలో ఏపీ దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తూ తన బ్రాండ్ ను సృష్టించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏదేమైనా 2025 ఏడాదిలో కూటమి ద్వారా ఏపీ గొప్ప విజయాలను సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు.

### లక్ష్మి సమేత నరసింహస్వామి ఆలయంలో

## వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు - ఎమ్మెల్యే



**పలమనేరు డిసెంబర్ 30( మనసులో మాట) :** పూతలపట్టు మండలం కమ్మ గుట్టపల్లె లక్ష్మీ సమేత నరసింహ స్వామి ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి తన సతీమణి రేణుకా రెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక హెూమం మరియు స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని పూజలు నిర్వహించారు. ఇలా ఉండగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారం ద్వారా ప్రవేశించి స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం అర్చకులకు వస్త్రదానం చేశారు. ఈ పూజా కార్యక్రమాలల్లో జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, మురళీ మోహన్ లతో పాటు టీఎన్ టియుసి రాష్ట్ర కార్యదర్శి యువరాజులు నాయుడు, చుడా చైర్మన్ కటారి హేమలత, కాణిపాక ఆలయ చైర్మన్ మణి నాయుడు, పలమనేరు బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, జిల్లా పార్టీ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ చౌదరి, సీనియర్ నాయకులు వసంత్ కుమార్, ఆర్టీ ప్రసాద్,బాబు నాయుడు లతో పాటు జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన పకడ్బందీగా

## బందోబస్తు నిర్వహించిన వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్



**ధర్మవరం డిసెంబర్ 30 (మనసులో మాట)** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భారీగా భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులతో దేవస్థానం సందడి సందడిగా మారింది. స్వామివారి దర్శనం పొందిన భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించి ఆనందభాష్పాలతో తమ భక్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ “వైకుంఠ ఏకాదశి సందర్భంగా ధర్మవరం దేవస్థానానికి భారీగా విచ్చేయబోయే భక్తాదులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ ఏవో వెంకటేష్, ఆలయ చైర్మన్ చిన్నంశెట్టి జగదీశ్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాం. 60 మందికి పైగా పోలీసులను బందోబస్తుకు నియమించాం. క్యూలైన్లు, గర్భగుడి వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వేగవంతంగా దర్శనం చేయించేందుకు చర్యలు తీసుకున్నాం. గత సంవత్సరం జరిగిన చిన్నపాటి లోపాలను సరిదిద్దుకుని, ఈ సంవత్సరం మరింత పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశాం” అని తెలిపారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో దేవస్థాన అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తుండగా, వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సీఐ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రిషి విద్యాలయ విద్యార్థులకు గ్లోబల్ వేదిక

### - కేరళ డిజిటల్ ఫెస్ట్‌లో పాల్గొననున్న ప్రతిభావంతులు



**ధర్మవరం డిసెంబర్ 30 (మనసులో మాట)..** రిషి విద్యాలయ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు సిద్ధమయ్యారు. యూకేకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ సైబర్ స్క్వేర్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఫెస్ట్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వేడుకలో విద్యార్థుల్లో సాంకేతికతపై అవగాహన, సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యంగా వివిధ పోటీలు నిర్వహించారు. డిజిటల్ ఫెస్ట్‌లో ప్రతిభ కనబరిచి ఎంపికైన రిషి విద్యాలయ విద్యార్థులు సిరి, పవన్ భర్గవ్, దివేశ్, నిహాస్వి, బింబ మోహిత్, జశ్వంత్, తన్వి ప్రియా, పంకజ్ తదితరులు వచ్చే 2026 జనవరి 3న కేరళ రాష్ట్రం కన్నూరులో జరగనున్న గ్లోబల్ ఇండియన్ డిజిటల్ ఫెస్ట్లో పాల్గొననున్నారు. వీరు ఏఐ/రోబోటిక్స్, షార్ట్ ఫిల్మ్, వెబ్ డిజైనింగ్, టెక్ టాక్ వంటి విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి, హెడ్ మాస్టర్ కరణ్ స్వరూప, సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏఓ రంగా రెడ్డి విద్యార్థులను అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు గొప్ప పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేందుకు రిషి విద్యాలయం కృషి చేస్తుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## జనవరి 11న పలమనేరు నాట్యోత్సవం

పలమనేరు డిసెంబర్ 30( మనసులో మాట): జనవరి 11వ తేదీ ఆదివారం పలమనేరు నాట్యోత్సవం నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు తెలిపారు. శాస్త్రీయ నృత్యం ప్రదర్శించే 15 సంవత్సరముల లోపు పిల్లలు జనవరి 5వ తేదీ లోపు తమ పేర్లను 9553429770 నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా, బృందంగా పాల్గొనవచ్చునన్నారు. పాల్గొన్న వారందరికీ బహుమతులు అందిస్తామన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### 30 మంది లబ్ధిదారులకు రూ.15.78 లక్షల ఆర్థిక సాయం

ధర్మవరం డిసెంబర్ 30 (మనసులో మాట) నియోజకవర్గంలో వివిధ వ్యాధులతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన రోగులకు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం అందజేశారు. ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంటలో గల తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ.15.78 లక్షల విలువైన చెక్కులను తెదేపా నాయకులు పంపిణీ చేశారు. చెక్కులను స్వీకరించిన లబ్ధిదారులు ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ మరియు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలో లేని పలు రకాల వ్యాధులకు సకాలంలో చికిత్స అందక ఎంతోమంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు అత్యంత ఉదారంగా సీఎంఆర్ఎఫ్ కింద సహాయం అందిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అనేకమంది ఈ సాయం పొందారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందజేస్తున్నామని తెదేపా నేతలు స్పష్టం చేశారు.

## ఉత్తమ కార్యకర్తలకు ప్రతిభ ప్రశంసా పత్రాలు అందజేసిన తెదేపా నాయకులు




**ధర్మవరం డిసెంబర్ 30 (మనసులో మాట)..** నియోజకవర్గ వ్యాప్తంగా 135 మందికి చంద్రబాబు,లోకేష్ ఫోటోలతో ఉన్న మెమొంటోళ్లు బహుకరణ సుపరిపాలన-తొలి అడుగు,పార్టీ సభ్యత్వ నమోదులో విశేష ప్రతిభ కనబరిచిన కార్యకర్తలకు గుర్తింపుగా మెమెంటోలు ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా 72 వేల సభ్యత్వ నమోదు చేసి రికార్డ్ సృష్టించిన నాయకులు,కార్యకర్తలురాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఆదేశించిన టాస్క్ ను పూర్తి చేయడంలో ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు రికార్డ్ సృష్టించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం విశేషంగా కృషిచేసిన కార్యకర్తలను గుర్తించిన అధిష్టానం ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా 135 మంది యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్ల కు చంద్రబాబు,నారా లోకేష్ ఫోటోలతో ఉన్న ప్రశంసా పత్రాల మెమొంటోలను తెదేపా నాయకులు ధర్మవరం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందజేశారు ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ధర్మవరం నియోజకవర్గానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని తెదేపాకు కంచుకోట ప్రాంతాలైన కొన్ని నియోజకవర్గాలలో ధర్మవరం ఒకటని, ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎప్పటికీ కొదవ ఉండదని తెదేపా నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు అన్నింటిని నిర్దేశిత సమయంలో పార్టీ ఇచ్చిన టాస్కులను పూర్తిస్థాయిలో పార్టీ యాప్ లో అప్లోడ్ చేసిన యూనిట్ ఇన్చార్జిలకు బూత్ కన్వీనర్లకు రాష్ట్ర పార్టీ గుర్తించి ప్రశంసా పత్రాలను పంపిందని వాటిని ఈరోజు కష్టపడిన కార్యకర్తలకు అందజేయడం జరిగిందని తెదేపా నాయకులు తెలియజేశారు.(ఉత్తమ కార్యకర్త)అవార్డులు అందుకున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభా ప్రశంసా పత్రం రావడం ఆనందదాయకంగా ఉందని కష్టపడ్డ కార్యకర్తలను తెదేపా నాయకత్వం గుర్తించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా అవార్డు అందుకున్న నాయకులు,కార్యకర్తలు అన్నారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, యువ నాయకుడు నారా లోకేష్ ప్రోద్భలంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా 72 వేల సభ్యత్వాలు నమోదుచేసి రికార్డు సృష్టించామని పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరెంత బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండాను నియోజకవర్గ వ్యాప్తంగా రెపరెపలాడిస్తామని ఈ సందర్భంగా(ఉత్తమ కార్యకర్త)అవార్డులు అందుకున్న తెదేపా నాయకులు,కార్యకర్తలు తెలియజేశారు.

### కులదాడి కేసును తక్కువ సెక్షన్లతో

## నమోదు చేసిన పోలీసులు

### - న్యాయం కోసం నిన్న ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు



**పుట్టపర్తి డిసెంబర్ 30 (మనసులో మాట)..** శ్రీ సత్య సాయి జిల్లా తాడిమర్రి మండలం పుల్లంపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ (మాదిగ) వర్గానికి చెందిన అన్నాచెల్లెళ్లు ధనుంజయ్, బీదల పార్వతి తమపై జరిగిన ఘోర కులాధారిత దాడి విషయంలో పోలీసుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 24 వ తేదీన ధనుంజయ్‌పై కులపేరుతో దూషిస్తూ రాయితో తలపై కొట్టి చంపే ప్రయత్నం చేయగా, అతన్ని కాపాడేందుకు వచ్చిన అతని అక్క పార్వతిపై కూడా మహిళగా గౌరవించకుండా దాడి చేసి, పరువు భంగం చేసి, బంగారు గొలుసు లాక్కొని దోచుకున్నారని బాధితులు తెలిపారు. ఇది స్పష్టమైన హత్యాయత్నం, కులదాడి, మహిళపై హింస, దోపిడీ ఘటన అని వారు పేర్కొన్నారు. తీవ్ర గాయాలపాలైన ధనుంజయ్ ఆసుపత్రిలో ఉండగా, ఈనెల 25 వ తేదీన బాధితుల తరపున ఇచ్చిన ఎఫ్ఐఆర్ ఫిర్యాదును తాడిమర్రి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయకపోవడమే కాకుండా, బాధితుల స్టేట్మెంట్లు లేకుండానే తక్కువ సెక్షన్లతో నమోదు చేసి నిందితులను విడుదల చేయడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని వారు ఆరోపించారు. విడుదలైన నిందితులు తిరిగి భయపెట్టడంతో బాధిత కుటుంబం ప్రాణభయంతో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో అడిషనల్ ఎస్పీ గౌరవ శ్రీమతి అంకిత సురణ మహవీర్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కేశగల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు సాకే నారాయణస్వామి, ధర్మవరం బీఎస్పీ పాటించార్జ్ సాకే వినయ్ దళిత సంఘాల నాయకులు ప్రదీప్, మండల ఓబులేసు, ప్రదీప్ మనోహర్, తేజ, మనోహర్, తాడిమర్రి నరసింహులు తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. దళిత సంఘాల హెచ్చరిక ఈ కేసును తక్షణమే సరైన సెక్షన్లతో హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, మహిళపై దాడి, దోపిడీ సవరించి, బాధితులకు పోలీస్ రక్షణ కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపడతామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
బుధవారం 31 డిసెంబర్ 2025


# పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దాలి

**దేశానికి దిక్సూచిగా మార్చాలి**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**




**హైదరాబాద్,డిసెంబరు 30:** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్ 2026ను ఆవిష్కరించారు. అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ ? 2026 వర్క్‌షాప్‌లో అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రకృతి, వారసత్వ సంపదే తెలంగాణ బలమని చెప్పుకొచ్చారు. కొత్త అద్భుతాలు కాదని.. ఉన్న వనరులకు మెరుగులు పరిస్తే చాలని తెలిపారు. దేశీ, విదేశీ పర్యాటకులు తెలంగాణ వైపు చూసేలా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు . గ్రామీణ అద్భుతాలను నగరవాసులకు చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగంలో నూతన ఒరవడి రావాలని కోరారు. పర్యాటక అద్భుతాలను ప్రపంచానికి చూపాలని అన్నారు. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలతో పర్యాటకులను ఆకర్షించాలని చెప్పుకొచ్చారు. వసతులు, హాస్పిటాలిటీలో రాజీ పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబితా, తలసాని

**ఉప నేతలుగా రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కేసీఆర్**



**హైదరాబాద్,డిసెంబరు 30:** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# జలదోపిడీ జరుగుతున్నా చలనం రాదా?

**బనకచర్లపై ఫైళ్లు కదులుతుంటే ఏం చేస్తున్నారు?**

**బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**




**హైదరాబాద్,డిసెంబరు 30:** ఉద్యమ ద్రోహి, జలదోపిడి ద్రోహి అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు తెలంగాణకు ద్రోహి రేవంత్‌రెడ్డినే అని వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చిందని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆక్షేపించారు హరీశ్‌రావు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతో ఉన్న అనుబంధంతోనే తాను ఇలా మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు హరీశ్‌రావు. తెలంగాణ జలదోపిడికి సూత్రదారి ఆదిత్య నాథ్ దాస్ అని ఆరోపణలు చేశారు. తెలంగాణ ద్రోహి ఆయనేనని ఆక్షేపించారు. ఆదిత్య నాథ్ దాస్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని సూచించారు.



> ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్**

# గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి

**యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని పని చేయండి**

## ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

- జనవరి నుంచి పూడికతీత పనులు
- ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు
- చెత్త ఏరివేతకు వారానికి మూడు రోజులు స్పెషల్ డ్రైవ్
- నాలాలు, చెరువులు ఆక్రమణకు గురికావొద్దు
- జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

**హైదరాబాద్, డిసెంబరు 30:** ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశర చేశారు. క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళు,, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే అని స్పష్టం చేశారు. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశించారు. మంచి ఫలితాలు రాబట్టాలంటే ..జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్లదేనని స్పష్టం చేశారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశంచేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# కుటుంబ సమేతంగా సీఎం.. శ్రీవారి దర్శనం

**ఆలయ మర్యాదలతో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం**

**ప్రత్యేక పూజలు నిర్వహించిన కుటుంబసభ్యులు**

**తిరుమల,డిసెంబరు 30:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, బిడ్డా అల్లుడు, మనవడితో కలసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

# కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా

**47.68 లక్షల సంచుల నిల్వలు**

**రైతులు ఆందోళన చెందొద్దు**

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**హైదరాబాద్,డిసెంబర్ 30:** జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇచ్చిన ఆదేశాలనుసారం అన్ని జిల్లాలలో ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేపట్టారు. అదేవిధంగా మంత్రి సూచన మేరకు జెడి,ఎడిఎలను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన వ్యవసాయశాఖ డైరెక్టర్, వారు వారికి కేటాయించిన జిల్లాలలో పర్యటించి ప్రత్యక్షంగా యూరియా సరఫరాలను పర్యవేక్షించనున్నారు. రబీ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నుండి అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అంటే 47.68 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా రాష్ట్రంలో పూర్తిగా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలి అని మంత్రి కోరారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా యూరియా నిల్వల వివరాలను వ్యవసాయ శాఖ విడుదల చేసిందని, అన్ని జిల్లాల్లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎరువుల సరఫరా వ్యవస్థను క్రమబద్ధంగా నిర్వహిస్తోందని, రబీ సీజన్ మొత్తం యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు, రైతులకు అవసరం ఉన్నంత మేరకు యూరియా సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# నూతన వేడుకల్లో క్యాబ్ సర్వీసులపై పోలీసుల నజర్

**ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు**

**ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్న పోలీసులు**

**హైదరాబాద్,డిసెంబరు 30:** నూతన సంవత్సర వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు కీలక విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల అనంతరం ప్రజలు ఇంటికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా క్యాబ్, ఆటో, బైక్ సేవల విషయంలో ప్రయాణికులు ఏమైన సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజరావ్ భూపాల్ విజ్ఞప్తి చేశారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి నగరంలో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాబ్‌లు రాకపోవడం, ఆటో లేదా బైక్ డ్రైవర్లు చెప్పిన ప్రాంతానికి రావడానికి నిరాకరించడం, లేదా సాధారణం కంటే అధికంగా డబ్బు డిమాండ్ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని జాయింట్ సీపీ వ్యాఖ్యానించారు.టువంటి పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉ ండేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఆటో, క్యాబ్, బైక్ డ్రైవర్లు అధిక చార్జీలు అడిగినా, లేదా బుక్ చేసిన క్యాబ్ రావడంలో నిర్లక్ష్యం చూపినా వెంటనే ఈ 94906 17346 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని గజరావ్ భూపాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల అనంతరం రాత్రి వేళ ఒంటరిగా ప్రయాణించే వారు, మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని కోరారు. న్యూ ఇయర్ సందర్భంగా నగరమంతా ట్రాఫిక్ పోలీసులు, పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రోడ్లపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నూతన సంవత్సరం ఆనందంగా జరుపుకోవాలని, కానీ భద్రత విషయంలో రాజీపడవద్దని సూచించారు. వేడుకల అనంతరం మద్యం సేవించి వాహనం నడపకుండా క్యాబ్ లేదా ఇతర రవాణా సేవలను వినియోగించాలని కోరారు. అదే సమయంలో, రవాణా సేవల పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల నిర్ణయంతో ప్రయాణికులకు భరోసా కలిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమస్య ఎదురైనప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించవచ్చనే అవగాహన ప్రజల్లో పెరిగితే అక్రమ వసూళ్లకు పాల్పడే క్యాబ్ నిర్వాహకులకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు సైబరాబాద్ పోలీసులు తీసుకున్న ఈ చర్యలు అభినందనీయమని భాగ్యనగరవాసులు అంటున్నారు.

# సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్**

**గోదావరిఖని,డిసెంబర్30:** సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు.పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు.

# క్రైం రేటును బాగా తగ్గించగలిగాం

- తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు
- పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
- ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
- 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్ రెడ్డి



**హైదరాబాద్,డిసెంబర్ 30:** తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా శిఖా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 శాతం పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 శాతం పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13శాతం తగ్గిందని, కిడ్నాప్‌లు 10శాతం , వేధింపులు కేసులు 9 శాతం తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23శాతం రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు డిజిపి తెలిపారు.



# సైబరాబాద్ సీపీగా రమేశ్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 30 :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా 2005 బ్యాచ్ కు చెందిన డాక్టర్ ఎం. రమేశ్, మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్ ఐజీ గా పని చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడం, పారదర్శకత, ప్రజా పోలిసింగ్, ప్రజలందరికీ నిష్పక్షపాతంగా సేవలు అందించదానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 'జీరో ఇన్సిడెంట్ డే' గా జరుపుకోవాలన్నారు.

# తెలంగాణలో వైకుంఠ ఏకాదశి సందడి

- యాదాద్రికి పోటెత్తిన భక్త జనం
- ఉత్తరద్వార దర్శనం చేసుకున్న ప్రముఖులు




**హైదరాబాద్, డిసెంబరు 30:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు కిక్కిరిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు చేరుకుంటున్నారు. తెలంగాణలో యాద్రాద్రి, భద్రాచలం, ధర్మపురి, చిలుకూరి బాలాజీ సహా పలు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఇక, ఏపీలోని తిరుమల, సింహాద్రి అప్పన్న ఆలయం, ద్వారకా చినతిరుమల సహా వివిధ ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు వివిధ ఆలయాలను దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భద్రాచలం రామాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై శ్రీ రాముడు,గజ వాహనం పై సీతమ్మ,హనుమద వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. యాదాద్రిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన లక్ష్మీ నరసింహ స్వామి వారిని చూడటానికి భారీగా భక్త జనం తరలి వచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఈవో వెంకట్రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామునే గోదావరిలో స్నానమాచరించిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. హైదరాబాద్‌లో టిటిడి ఆలయాల్లో రద్దీ కనిపించింది. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలిచ్చారు. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వేంకటేశ్వరాలయంలో భారీగా ఏర్పాట్లు చేశారు. వనపర్తి జిల్లాలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ముఖ్యంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది.

# తెలంగాణలో పెరిగిన చలితీవ్రత

**హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి**

**హైదరాబాద్, డిసెంబరు 30:** హైదరాబా సహా తెలంగాణలోని పలు జిల్లాలు చలితో వణికి పోతున్నాయి. రోజురోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. సూరీడు కూడా చల్లగానే ఉ ంటున్నాడు. మంగళవారం తీవ్రమైన చలిగాలులు అల్లాడించాయి. వరుసగాగత కొన్నిరోజులుగా చలి తీవ్రత కనిపిస్తూనే ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. నగరంలోని శేరి లింగంపల్లిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంతం, ఉత్తర తెలంగాణలోని కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలోని అత్యంత శీతల ప్రాంతాలుగా నిలిచాయి. శేరి లింగంపల్లిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంతంలో అత్యల్ప ఉష్ణోగ్రత 8.8 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదైంది. నగరంలోని పలు ఇతర ప్రాంతాల ఉష్ణోగ్రతలు కూడా సింగిల్ డిజిట్ మార్కుకు దగ్గరగా ఉన్నాయి. రాజేంద్రనగర్‌లో 10 డిగ్రీలు, మౌలాలిలో 10.2 డిగ్రీలు, గచ్చిబౌలిలో 10.9 డిగ్రీలు, అల్వాల్, కుత్బుల్లాపూర్‌లలో 11 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉ ష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారుజామున పరిస్థితులు ఆఫీసులకు వెళ్లేవారికి, విద్యార్థులకు, వీధి వ్యాపారులకు అసౌకర్యంగా మారిపోయాయి డిసెంబర్ నెలలో చాలా రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3?4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని పరిశీలకులు చెబుతున్నారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

**హద్దు మీరితే కఠిన చర్యలు - అర్ధరాత్రి 12:30 వరకే అనుమతి**

**డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే వాహనాలు సీజ్**

**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరిక**

**ఆదిలాబాద్, డిసెంబర్ 30 (మనసులో మాట):**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలపై కఠిన ఆంక్షలు విధించినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలు చట్ట పరిధిలోనే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. సమయం: డిసెంబర్ 31 అర్ధరాత్రి 12:30 గంటల లోపు వేడుకలు ముగించాలి. డ్రంక్ అండ్ డ్రైవ్: రాత్రి 10 గంటల నుంచి ముమ్మర తనిఖీలు ఉంటాయి. మద్యం తాగి వాహనం నడిపితే సీజ్ చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తారు. యువతకు హెచ్చరిక: తాత్కాలిక ఆనందం కోసం కేసుల పాలైతే ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ విషయంలో ఇబ్బందులు తప్పవు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, బాణసంచా కాల్చడం, డీజేల వినియోగానికి అనుమతి లేదు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని సీపీ వెల్లడించారు.

# న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**ఎస్ఐ అభిలాష్**

**కోహెడ, డిసెంబర్ 30 (మనసులో మాట):**

కోహెడ మండల ప్రజలు, యువత నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై పి.అభిలాష్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్లపై గుంపులుగా చేరి మద్యం సేవించడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నిబంధనలు మీరితే కేసులు తప్పవు

**ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నరేష్, ఎస్సై శ్రీధర్**

**జైపూర్, డిసెంబర్ 30 (మనసులో మాట):**



మంచిర్యాల జిల్లా జైపూర్ మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నరేష్, ఎస్సై శ్రీధర్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, రోడ్లపై కేక్ కటింగ్ చేయడం, డీజేలు పెట్టడం, బాణసంచా కాల్చడం నిషేధం. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. ట్రిపుల్ రైడింగ్, పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లతో వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం. సాయంత్రం నుంచే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయి. నిబంధనలు మీరితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అత్యవసరమైతే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఆర్గనైజ్డ్ ఈవెంట్లకు అనుమతి లేదు



**సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి**

**సంగారెడ్డి, డిసెంబర్ 30 (మనసులో మాట):**

సంగారెడ్డి, కంది మండల ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో ఇళ్లలోనే జరుపుకోవాలని రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి సూచించారు. ఆర్గనైజ్డ్ కార్యక్రమాలకు పోలీసు అనుమతి లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 31 రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, పెట్రోలింగ్ ఉంటాయని, మద్యం తాగి వాహనాలు నడపడం, డీజేలు పెట్టడం, బైక్ రేసింగ్, టపాసులు కాల్చడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మహిళపై పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

**బెజ్జంకి, డిసెంబర్ 30 (మనసులో మాట):**

బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం దాచారం గ్రామానికి చెందిన పెంటమీది వసంత అనే మహిళ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని హల్చల్ చేసింది. భూతగాదాల విషయంలో ఆమె చేసిన రచ్చపై తహసీల్దార్ శ్రీకాంత్ స్పందించారు. సివిల్ తగాదాలను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించినా వినకుండా, తమ విధులకు ఆటంకం కలిగించిందని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బద్దిపడగకు రెగ్యులర్ కార్యదర్శిని నియమించండి

**సర్టిఫికెట్ల జారీలో జాప్యం.. ఎంపీడీవోకు గ్రామస్తుల వినతి**



**సిద్దిపేట, డిసెంబర్ 30(మనసులో మాట):**

నంగునూరు మండలం బద్దిపడగ మేజర్ గ్రామపంచాయతీలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారిని నియమించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి లేకపోవడంతో కల్యాణ లక్ష్మి దరఖాస్తులు, విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణమే రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుంచు స్వామి, కాయితి కిషోర్, గొడుగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకై

# జన్నారంలో గర్జించిన హిందూ వాహిని

- బస్టాండ్ నుండి రామాలయం వరకు భారీ ర్యాలీ
- కాషాయమయమైన జన్నారం పురవీధులు
- అంబేద్కర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం
- అంతర్జాతీయ సమాజం స్పందించాలని డిమాండ్



**ఆదిలాబాద్, డిసెంబర్ 30 (మనసులో మాట):**

బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై జరుగుతున్న దాడులు, అకృత్యాలకు వ్యతిరేకంగా నిర్మల్/మంచిర్యాల సరిహద్దులోని జన్నారం మండల కేంద్రం దద్దరిల్లింది. పొరుగు దేశంలో హిందువుల దేవాలయాల కూల్చివేత, మహిళలపై అత్యాచారాలు, హత్యలను నిరసిస్తూ మంగళవారం హిందూ సమాజం, హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన హిందూ బంధువులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కదంతొక్కారు. స్థానిక బస్టాండ్ నుండి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ జన్నారం ప్రధాన పురవీధుల గుండా సాగుతూ రాముల వారి గుడి వరకు చేరుకుంది. చేతిలో కాషాయ జెండాలు, ప్లకార్డులు పట్టుకున్న యువకులు, హిందూ కార్యకర్తలు చేసిన నినాదాలతో జన్నారం వీధులు మార్మోగాయి. "బంగ్లాదేశ్ హిందువులకు న్యాయం జరగాలి", "హిందువుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి", "జై శ్రీరామ్" అంటూ నిరసనకారులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసను ఎండగడుతూ ప్రదర్శించిన బ్యానర్లు చూపరులను, ప్రజలను ఆలోచింపజేశాయి.

**దిష్టిబొమ్మ దహనం - నాయకుల ఆగ్రహం**

ర్యాలీ అనంతరం కవ్వాల్ పాయింట్ వద్ద ఉన్న అంబేద్కర్ చౌరస్తాలో నిరసనకారులు మానవహారంగా ఏర్పడ్డారు. బంగ్లాదేశ్‌లో హింసకు పాల్పడుతున్న దుశ్శక్తుల దిష్టిబొమ్మను నడిరోడ్డుపై దహనం చేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నిత్యం జరుగుతున్న దేవాలయాల కూల్చివేతలు అత్యంత హేయమైన చర్యలని, ఇవి మానవ హక్కుల ఉల్లంఘన అని మండిపడ్డారు. శాంతియుతంగా జీవిస్తున్న హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం పిరికిపంద చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సమాజం, ఐక్యరాజ్యసమితి వెంటనే స్పందించి బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అక్కడ ఉన్న హిందువుల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించేలా భారత ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు మరియు స్థానిక భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని బంగ్లాదేశ్ హిందువులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# మాదకద్రవ్యాల నివారణ సామాజిక బాధ్యత

- డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి
- విద్యాసంస్థల్లో 'యాంటీ డ్రగ్ కమిటీలు' తప్పనిసరి
- ఆటోల వెనుక పోస్టర్లతో విస్తృత ప్రచారం కల్పించాలి
- గత నెలలో 12 కిలోల గంజాయి సీజ్.. 17 మంది రిమాండ్
- సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను ఆదేశాలు




**నారాయణపేట, డిసెంబర్ 30 (మనసులో మాట):**

యువత భవిష్యత్తును చిదిమేస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని, దీని నివారణను ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి జిల్లా యంత్రాంగం పనిచేయాలని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 'జిల్లా స్థాయి యాంటీ నార్కోటిక్ కమిటీ' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్, ఎక్సైజ్, విద్యా, వైద్య శాఖల అధికారులతో డ్రగ్స్ నివారణ చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనపై అత్యంత సీరియస్‌గా ఉందని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్ కళాశాలలతో పాటు పాఠశాలల్లోనూ తక్షణమే 'యాంటీ డ్రగ్ కమిటీ'లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కమిటీల నేతృత్వంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు ఉందా అని డీఏవో జాన్ సుధాకర్ ను ఆరా తీయగా, అలాంటిదేమీ లేదని ఆయన వివరణ ఇచ్చారు. సమావేశంలో డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసు శాఖ తరఫున కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత నవంబర్ నెలలో నారాయణపేట పట్టణంలో 12 కిలోల గంజాయిని పట్టుకుని, దానికి బాధ్యులైన 17 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల బిజీలో ఉన్నప్పటికీ, షీ టీమ్స్, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, న్యూ ఇయర్ సందర్భంగా తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో డ్రగ్స్ నివారణకు చేపడుతున్న కార్యక్రమాల ఫోటోలు, పత్రికా క్లిప్పింగ్స్ ను ఎప్పటికప్పుడు స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పంపించాల్సి ఉంటుందని, అధికారులు తప్పనిసరిగా రికార్డులు మెయింటైన్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు, పబ్లిక్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. జిల్లా కేంద్రంలో తిరిగే ప్రతి ఆటో వెనుక 'యాంటీ డ్రగ్స్ పోస్టర్ల'ను అంటించి ప్రచారం చేయాలని ఆర్టీవో మేఘా గాంధీకి సూచించారు. ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడి దీనిని అమలు చేయాలన్నారు. మెడికల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, మత్తు మందుల అమ్మకాలు జరగకుండా చూడాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ను ఆదేశించారు. పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి నారాయణపేటను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ అనంతయ్య, డీఐఈవో సుదర్శన్, వైద్యాధికారి అశోక్ కుమార్, విద్యాశాఖ అధికారి రాజేందర్, కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ రాణీ దేవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- 60 శాతం జనాభా ఉన్నా.. ఉద్యోగాల్లో 20 శాతం మించడం లేదు
- బీసీ ఉపాధ్యాయ సంఘానికి ప్రభుత్వం తక్షణమే గుర్తింపునివ్వాలి
- మార్చిలో హైదరాబాద్ వేదికగా 'బీసీ ఉపాధ్యాయ రాష్ట్ర మహాసభ'
- బీసీటీయూ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 30 (మనసులో మాట):**

బీసీ ఉద్యోగులకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మాదిరిగానే ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే బీసీ ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపునివ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యోగ రంగంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 60 శాతానికి పైగా ఉన్నప్పటికీ, ఉద్యోగాల్లో మాత్రం వారి ప్రాతినిధ్యం 20 శాతం కూడా మించడం లేదన్నారు. ఉద్యోగ రంగంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగాలంటే ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు ఇస్తోందని, కానీ మెజారిటీగా ఉన్న బీసీ సంఘాన్ని విస్మరిస్తోందని జాజుల మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండగా, అందులో 40 వేల మందికి పైగా బీసీ ఉపాధ్యాయులే ఉన్నారని గణాంకాలతో వివరించారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ ఉపాధ్యాయ సంఘానికి ప్రభుత్వం తక్షణమే గుర్తింపునివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యాయుల పలు సమస్యల పరిష్కారంపై తీర్మానాలు చేశారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి. పెండింగ్ లో ఉన్న ఆరు డిఏ లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. అలాగే ఇతర పెండింగ్ బిల్లులను చెల్లించాలి. కొత్త పీఆర్సీని 50 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలి. గురుకులాలు: మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. బీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యాచరణను జాజుల ప్రకటించారు. వచ్చే మార్చి రెండో వారంలో హైదరాబాద్ వేదికగా వేలాది మందితో 'బీసీ ఉపాధ్యాయుల రాష్ట్ర మహాసభ'ను భారీ ఎత్తున నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యులుగా కొన్నే శంకర్ గౌడ్, రాఘవాపురం గోపాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాడవేడి వినోద్ కుమార్, శ్రీనివాస్, రమణ స్వామి, భాస్కర్ మహేందర్, గోపి కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రం గౌడ్, మనీ మంజరి తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా ముక్కోటి ఏకాదశి

- ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- శేరిలింగంపల్లి, గజ్వేల్, వర్గల్, రాయికల్ లో కిటకిటలాడిన దేవాలయాలు
- స్వామి వారిని దర్శించుకున్న పీఏసీ ఛైర్మన్ గాంధీ, ప్రముఖులు

**శేరిలింగంపల్లి/గజ్వేల్/రాయికల్/చిన్నశంకరంపేట, డిసెంబర్ 30 (మనసులో మాట):**

వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వివిధ నియోజకవర్గాల్లోని వైష్ణవ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఏడాదికి ఒక్కసారి లభించే పవిత్రమైన ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు.

### శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వివేకానంద నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వారం గుండా మహావిష్ణువును దర్శిస్తే మోక్షం కలుగుతుందని, నియోజకవర్గ ప్రజలపై స్వామివారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. చందానగర్, మదీనాగూడ, ధర్మపురి క్షేత్రాలలో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

### వర్గల్ క్షేత్రంలో..

ప్రసిద్ధ వర్గల్ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో ఏకాదశి మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామునే పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి విశేష అభిషేకం, లక్ష తులసి అర్చన నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, కళ్యాణ వేదికపై ఎదుర్కోలు ఉత్సవం, ముత్యాల తలంబ్రాలు, మాంగల్య ధారణతో అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని జరిపించారు.

### గజ్వేల్ లో..

గజ్వేల్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. సీఐ రవికుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజమౌళి తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, మహా అన్నప్రసాదం అందజేశారు.

### రాయికల్, చిన్నశంకరంపేటలో..

రాయికల్ మండలం అల్లిపూర్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో భక్తులు పోటెత్తారు. భక్తుల సౌకర్యార్థం మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేష్ దంపతులు రథాన్ని (పీఠం) బహూకరించారు. వీరిని గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఇక ఇటిక్యాల గ్రామంలోని ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. వేకువజామున పండితులు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి గుట్ట, అయ్యప్ప ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భజన మండళ్ల మరియు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

















# సైబర్ మోసాల పట్ల మహిళలు ఉండాలి

- ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు
- వాట్సాప్ లింకులు క్లిక్ చేయొద్దు
- ఆపద సమయంలో 'డయల్ 100'ని ఆశ్రయించండి
- చందంపేటలో డ్వాక్రా మహిళలకు ఎస్సై నారాయణ గౌడ్ సూచనలు



**చిన్నశంకరంపేట, (మనసులో మాట):** ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ గౌడ్ సూచించారు. మంగళవారం మండలంలోని చందంపేట గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు సైబర్ నేరాలు, మోసాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి కానీ, ఫేక్ మెసేజ్లు పంపి కానీ ఓటీపీ లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని స్పష్టం చేశారు. అలాగే వాట్సాప్ లో వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయరాదని, వాటిని వెంటనే డిలీట్ చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల ఫోన్ లోని సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మహిళలకు ఎక్కడైనా, ఎలాంటి ఆపద వచ్చినా తక్షణ రక్షణ కోసం 'డయల్ 100'కు కాల్ చేయాలని, పోలీసులు వెంటనే స్పందిస్తారని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, పోలీస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి మల్లన్నపేట ఉపసర్పంచ్

**బీజేపీని వీడి మంత్రి అడ్లూరి సమక్షంలో చేరిక**

**గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా: ముత్యాల స్వామి**



**గొల్లపల్లి, (మనసులో మాట):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నూతన ఉపసర్పంచ్, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల స్వామి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ధర్మపురిలో జరిగిన కార్యక్రమంలో ఆయన తన 20 మంది ముఖ్య అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. ముత్యాల స్వామికి, వారి అనుచరులకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్యాల స్వామి మాట్లాడుతూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో మల్లన్నపేట గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్ ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కంచర్ల స్వామి

**ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు**



**నూతన కార్యవర్గాన్ని అభినందించిన వంటేరు ప్రతాప్ రెడ్డి**

**జగదేవ్‌పూర్, (మనసులో మాట):** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఉప సర్పంచులందరూ సమావేశమై ఫోరం అధ్యక్షుడిగా కంచర్ల స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షుడిగా ఎన్నికైన కంచర్ల స్వామితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధ్యక్షులుగా కంచర్ల స్వామి, గౌరవ ఉపాధ్యక్షులుగా కర్రే యాదగిరి, ఉపాధ్యక్షులుగా కస్తూరి అమరేందర్ రెడ్డి, గోవింద్ పావులు, పోకల బాబు, రాచకొండ లావణ్య అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బి. నాగరాజు, సహాయ కార్యదర్శులుగా ఎర్రోళ్ల నరేష్, రాజు, కళ్యాణి రాజ్ కుమార్, పోకల రామచంద్రం, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్, క్యాషియర్ గా గణేష్, సలహాదారులుగా శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శులుగా, రేణుక నర్సింలు, జయరాజు, జహంగీర్, కరుణాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కంచర్ల స్వామి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న తోటి ఉప సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాల స్వచ్ఛత.. మా బాధ్యత

**సర్పంచుల ఫోరం అధ్యక్షులు చంద్రశేఖర్**



**చిన్నశంకరంపేట, (మనసులో మాట):** గ్రామాల పరిశుభ్రతే ధ్యేయంగా, ఆదర్శ గ్రామాల స్థాపనే లక్ష్యంగా చిన్నశంకరంపేట మండలంలోని సర్పంచులు నడుం బిగించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు.సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు, చిన్నశంకరంపేట సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు వీధుల్లో పారిశుధ్య పనులను ప్రారంభించారు. అలాగే మడూర్, టీ మాందాపూర్, ఖాజాపూర్ తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పారిశుధ్య పనులతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామాల స్వచ్ఛతను కాపాడటం తమ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు, గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దివ్యభారతి లింగాగౌడ్, రాణి గణేష్, బాలస్వామి తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

## గెలిచిన సర్పంచ్‌ను సన్మానించిన ఓడిన అభ్యర్థి

**దుబ్బాక, (మనసులో మాట):**ఎన్నికలంటేనే వైషమ్యాలు, గెలుపు ఓటముల తర్వాత కక్షలు కార్పణ్యాలు సర్వసాధారణమైన ఈ రోజుల్లో.. దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో ఓ ఆదర్శవంతమైన ఘటన చోటుచేసుకుంది. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని చాటిచెప్తూ, గ్రామాభివృద్ధే లక్ష్యమని నిరూపిస్తూ ఓడిన అభ్యర్థి గెలిచిన వారిని సన్మానించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓటమి పాలైన కొక్కడగల్ల రాజేశ్వరి స్వామి.. నూతనంగా గెలుపొందిన సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్ర రెడ్డిని, ఉప సర్పంచ్ బోల్గం ప్రవీణ్ గౌడ్ ను, మరియు వార్డు సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని అన్నారు.

# ఆపదలో అండగా..

**మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం**

**రూ. 19,500 అందజేసిన రాఘవపట్నం గ్రామస్తులు**



**గొల్లపల్లి, (మనసులో మాట):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో మానవత్వం వెల్లివిరిసింది. గ్రామానికి చెందిన చాతల్ల పోషవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో గ్రామస్తులు చలించిపోయారు. "ఓదార్చే మాటలకన్నా సాయం చేసే చేతులు మిన్న" అనే స్ఫూర్తితో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అందరూ కలిసి రూ. 19,500 విరాళంగా సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కష్టకాలంలో తమకు ఆర్థికంగా బాసటగా నిలిచిన దాతలకు కుటుంబ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కాసారపు భవాని అరవింద్ గౌడ్, కొలకాని జలంధర్, ఉపసర్పంచ్ సిరవేణి రవి, మాజీ సర్పంచ్‌లు రాగం శంకరయ్య, బుర్ర తిరుపతి గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వోడ్నాల అంజయ్య, ఆర్‌జీపీ సేవా సమితి అడ్మిన్ కాళ్ళ రమేష్, మాతులాపురం రాయమల్లు, చాతల్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెముక దెబ్బతిన్న బాధితునికి ఆర్థిక చేయూత



**గజ్వేల్, (మనసులో మాట):** ప్రమాదవశాత్తు వెన్నెముక దెబ్బతిని మంచానికే పరిమితమైన నిరుపేద కుటుంబానికి తోటి గ్రామస్తుడు ఆర్థికంగా బాసటగా నిలిచారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ, పల్లెపహాడ్ గ్రామానికి చెందిన గుగ్గులోతు భాస్కర్ ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెన్నెముక దెబ్బతినడంతో ఆయన మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కొమ్ము నరేష్ యాదవ్ మానవత్వంతో స్పందించారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం తన వంతు సాయంగా రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ యాదవ్ మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామంలోని వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, దాతలు ముందుకు వచ్చి గుగ్గులోతు భాస్కర్ కుటుంబానికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, బాబు, రాజయ్య, స్వామి, కృష్ణ, శేఖర్, యాదయ్య, ప్రశాంత్, బాలరాజ్, శ్రీకాంత్, జహీందర్, సాయి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపెల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా ఎనగందుల గంగాధర్

**ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం**



**గొల్లపెల్లి, (మనసులో మాట):** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో మంగళవారం నాయి బ్రాహ్మణ కుల సంఘం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం నూతన అధ్యక్షుడిగా ఎనగందుల గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా ఎనగందుల లక్ష్మీరాజ్యం, ఉపాధ్యక్షులుగా ఎనగందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల అశోక్, సహాయ కార్యదర్శిగా ఎనగందుల రమేష్, ప్రచార కార్యదర్శిగా ఎనగందుల తిరుమలేష్, కోశాధికారిగా ఎనగందుల నాగరాజ్, ముఖ్య సలహాదారుగా ఎనగందుల శంకర్ లను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని, ఎలాంటి సమస్య వచ్చినా సమన్వయంతో పరిష్కరించుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కుల సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ల పేరుతో జర్నలిస్టులను విడగొట్టవద్దు

**జీవో 252తో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం**

- సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించండి: ఎమ్మెల్సీ యాదవ రెడ్డికి వినతి
- టీయూడబ్ల్యూజే (హెచ్-143) నాయకుల డిమాండ్



**గజ్వేల్, (మనసులో మాట):** జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీవో నెంబర్ 252ను వెంటనే సవరించాలని టీయూడబ్ల్యూజే (హెచ్-143) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం గజ్వేల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డిని యూనియన్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, జర్నలిస్టుల అక్రిడిటేషన్ల సమస్యను సభలో లేవనెత్తాలని వారు ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గరిదాస్ నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు కనీస హక్కుగా ఉండే అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యను ఈ ప్రభుత్వం భారీగా కుదించడం సరికాదన్నారు. డెస్క్ జర్నలిస్టులకు వేరుగా, బ్యూరో జర్నలిస్టులకు వేరుగా రెండు కార్డుల విధానాన్ని తెచ్చి జర్నలిస్టుల మధ్య విభజన రేఖలు గీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న జీవో 239 ప్రకారం రాష్ట్రంలో సుమారు 23 వేల కార్డులు మంజూరయ్యేవని, కానీ కొత్తగా వచ్చిన జీవో 252 నిబంధనల వల్ల సుమారు 13 వేల కార్డులు తగ్గే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జర్నలిస్టులకు తీరని అన్యాయం చేయడమేనని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవోను సవరించేలా ఎమ్మెల్సీ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు కరుణాకర్, ఆభోద్దీన్, రాజు, ప్రవీణ్, మల్లేశం, ఖాదర్ పాషా, మురళి, గణేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపల్లిలో అగ్ని ప్రమాదం

**రెండు గుడిసెలు దగ్ధం -సర్వం కోల్పోయిన పేద కుటుంబాలు**

**కాలిబూడిదైన నగదు, బంగారం, వెండి, నిత్యావసరాలు**

**తక్షణమే ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ కర్రోల్ల నాగరాజు విజ్ఞప్తి**



**చిన్నశంకరంపేట, (మనసులో మాట):** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో రెండు నివాస పూరి గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో రెండు కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. గ్రామానికి చెందిన చింతకింది పోచయ్య, చింతకింది శంకర్ అనే నిరుపేదలకు చెందిన గుడిసెలకు మంటలు అంటుకోవడంతో క్షణాల్లోనే అవి బూడిదయ్యాయి. చింతకింది పోచయ్య గుడిసెలో దాచుకున్న రూ. 1 లక్ష నగదు, 2 క్వింటాళ్ల బియ్యం, వస్త్రాలు, నిత్యావసర సరుకులు అగ్నికి ఆహుతయ్యాయి. చింతకింది శంకర్ గుడిసెలో ఏకంగా రూ. 2 లక్షల 50 వేల నగదు, 5 తులాల బంగారం, 80 తులాల వెండితో పాటు వస్త్రాలు, సరుకులు కాలిపోయాయి. రెక్కాడితే గాని డొక్కాడని ఈ నిరుపేద కుటుంబాలు అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ కర్రోల్ల నాగరాజు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సర్వం కోల్పోయిన ఈ రెండు కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# హద్దు మీరితే జైలుకే..

**న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల నజర్**

**రోడ్లపై కేకులు కట్ చేయడం, న్యూసెన్స్ చేయడం నిషేధం**

**మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం**

**కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి హెచ్చరిక**




**కంగ్టి, (మనసులో మాట):** నూతన సంవత్సర వేడుకల పేరుతో బహిరంగ ప్రదేశాల్లో హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి జరుపుకునే వేడుకల దృష్ట్యా కంగ్టి సర్కిల్ పరిధిలో పోలీసులు పటిష్టమైన ఆంక్షలు విధించారు. మంగళవారం సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మరియు ప్రధాన రహదారులపై కేకులు కట్ చేయడం పూర్తిగా నిషేధమని సిఐ స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై డిజేలు పెట్టి శబ్ద కాలుష్యం చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, రోడ్లపై డాన్సులు వేస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. "నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోండి. మద్యం తాగేవారు ఇళ్లకే పరిమితం కావడం మంచిది. అలా కాకుండా తాగి రోడ్లపైకి వచ్చి హద్దు మీరితే న్యూ ఇయర్ రోజున జైల్లో ఉండాల్సి వస్తుంది" అని సిఐ వెంకట్ రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.

# టీపీటీఎఫ్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

- ఆర్డీవో చంద్రకళ చేతుల మీదుగా ఆవిష్కరణ
- పాల్గొన్న తహశీల్దార్, ఎంఈవో, సంఘం నాయకులు



**గజ్వేల్, (మనసులో మాట):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్-2026ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ డివిజన్ ఆర్డీవో చంద్రకళ ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ శ్రావణ్ కుమార్, మండల విద్యాధికారి వై.కృష్ణ, టిపిటిఎఫ్ జోన్ కన్వీనర్ జల్లెల్ల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ బి.రాజులు, జిల్లా మహిళా కార్యదర్శి బి.మంజుల, పూర్వ అధ్యక్షులు ఏ.రామచంద్రం పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, విద్యాసాగర్, వర్గల్ మండల అధ్యక్షులు పర్వతం నరసయ్య, జగదేవపూర్ మండల అధ్యక్షులు అక్కారం సత్తయ్య, సీనియర్ ఉపాధ్యాయులు శంకర్, పరమేశ్వర్, ఎన్.మల్లేశం, సీపీఐ నాయకులు రాజేశం, ఉపాధ్యాయులు వి.శ్రీనివాస్, దీవెన, బంగ్లా వెంకటాపూర్ ప్రధానోపాధ్యాయులు వేణు, ఉపాధ్యాయురాలు గీతాంజలి, రిటైర్డ్ ఉపాధ్యాయులు చంద్రం, రాములు, డి.శ్రీనివాస్, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# నాగోబా జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఇంద్రవెల్లి డిసెంబర్ 30 (మనసులో మాట)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే చారిత్రక కేస్లాపూర్ నాగోబా జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయం దర్బార్ సమావేశ మందిరంలో జాతర ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే జనవరి 18న మహా పూజతో జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తారని అంచనా వేస్తూ, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. తదుపరి సమీక్షా సమావేశంలోగా ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో హైమాస్ట్ విద్యుత్ దీపాలు అమర్చాలని, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, అత్యవసర వసతులకు సంబంధించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, నాగోబా జాతరకు వచ్చే గిరిజనులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వస్తున్నందున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బారికేడ్లు, గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ మాట్లాడుతూ, ముత్నూరు, హార్కాపూర్ తదితర రహదారులను సరిచేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక


# టీసీఎస్ టు అమెజాన్..

## లక్ష మందికిపైగా ఉద్యోగులు అవుట్

## ఐటీ లేఆఫ్స్ @2025

టెక్ రంగంలో అనిశ్చితి కొనసాగుతోంది. కృత్రిమ మేధ (AI) ప్రవేశం, దేశాల మధ్య నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు వెరసి ప్రపంచవ్యాప్తంగా ఐటీ (IT) సెక్టార్ ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. చిన్న కంపెనీల నుంచి మొదలుకొని దిగ్గజ టెక్ సంస్థల వరకు అన్నీ తమ కార్యకలాపాల్లో ఏఐని భాగం చేస్తూ.. మానవ వనరుల్ని క్రమంగా తగ్గించుకుంటున్నాయి. ఫలితంగా వేల సంఖ్యలో ఉద్యోగులు కొలువులను కోల్పోతున్నారు. టెక్ సెక్టార్‌లో కొనసాగుతున్న కొలువుల కోతలు (Layoffs) ఉద్యోగులు, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ ఏడాది ఐటీ కంపెనీలు లక్ష మందికిపైగా ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించినట్లు ఓ అధ్యయనంలో వెల్లడైంది.

Layoffs.fyi ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 551 టెక్ కంపెనీలు ఈ ఏడాది 1.22 లక్షల మందిని ఉద్యోగం నుంచి తొలగించాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) మొదలుకొని అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, సేల్స్‌ఫోర్స్, హెచ్‌పీ, యాపిల్, మెటా, గూగుల్.. వంటి పెద్దపెద్ద సంస్థలు ఖర్చు తగ్గించుకునేందుకు ఎడాపెడా ఉద్యోగులను తొలగించాయి.



**అమెజాన్..**

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ (Amazon) ఈ ఏడాది అక్టోబర్‌లో దాదాపు 14,000 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కంపెనీ చరిత్రలోనే ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత. ఈ లేఆఫ్స్ ప్రభావం సంస్థలోని దాదాపు అన్ని విభాగాలపై పడింది. క్లౌడ్ సర్వీసెస్, డివైజెస్, రిటెయిల్, అడ్వర్టైజింగ్, గ్రాసరీస్ విభాగాల్లోని ఉద్యోగులు ప్రభావితమయ్యారు.

**మైక్రోసాఫ్ట్..**

వ్యయ నియంత్రణలో భాగంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ (Microsoft) కూడా భారీగా ఉద్యోగుల తొలగించింది. ఈ ఏడాది ఏకంగా 15 వేల మందికిపైగా ఉద్యోగులపై వేటువేసింది. ఇందులో ఒక్క జులైలోనే 9 వేల మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు.

**టీసీఎస్..**

కృత్రిమ మేధ (AI) రాకతో ప్రయోజనాల సంగతి ఏమోగానీ ఐటీ ఉద్యోగాలపై దీని ప్రభావం మాత్రం గట్టిగానే పడుతోంది. ఏఐ పుణ్యమా అని దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. ఈ క్రమంలో భారత అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ (TCS) కూడా వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించింది. తమ మొత్తం ఉద్యోగుల్లో 2 శాతానికి సమానమైన 12 వేల మంది ఉద్యోగులపై టీసీఎస్ వేటు వేసింది. టీసీఎస్ ప్రకటన ఐటీ ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురిచేసింది.

**ఇంటెల్..**

ప్రముఖ చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్ (Lip-Bu Tan) బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో సంస్థ భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతోంది. ఇందులో భాగంగానే పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తోంది. ఈ ఏడాది జులైలో తమ మొత్తం ఉద్యోగుల్లో 15 శాతం తగ్గించుకుంటున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ కంపెనీ ఉద్యోగుల సంఖ్య 2024 చివరికి 1,09,800 గా ఉండగా.. 2025 చివరికి 75 వేలకు పరిమితం చేయాలని నిరయించుకుంది. వీటితోపాటూ పలు సంస్థలు కూడా ఏఐ పేరుతో భారీగా కొలువల కోతకు తెగబడ్డాయి. ఏఐ వినియోగం నేపథ్యంలో 4 వేల మంది కస్టమర్ సపోర్ట్ సిబ్బందిని తొలగిం చినట్లు సేల్స్‌ఫోర్స్ తెలిపింది. ఏఐతోనే తమ పని ఎక్కువగా సాగుతున్నట్లు కంపెనీ సీఈఓ చెప్పుకొచ్చారు. అయితే త్వరలో మరికొంత మందిని నియమించుకునేందుకు ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు. పర్సనల్ కంప్యూటర్లను తయారు చేసే హెచ్‌పీ కూడా సుమారు 6 వేల మంది వరకు ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు ప్రకటించింది. యాపిల్, మెటా, గూగుల్, వెరిజోన్, సీమెన్స్ వంటి సంస్థలు కూడా భారీగా లేఆఫ్స్ ప్రకటించాయి. వెరిజోన్ 13 వేల మందికిపైగా తొలగించనున్నట్లు నవంబర్ నెలలో ప్రకటించింది. సీమెన్స్ 6వేల మందిని తొలగించనున్నట్లు తెలిపింది.

# రెండు రోజులు మాత్రమే ఛాన్స్.. లేదంటే ఇబ్బందులు తప్పవు..




మన దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు, పాన్ కార్డు చాలా ముఖ్యం. ఈ రెండు కార్డులు లేకుంటే ప్రభుత్వ పథకాలు పొందడంలో గానీ, గుర్తింపు విషయంలో గానీ, ట్రాన్సాక్షన్స్ విషయంలో గానీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే.. ప్రతి భారతీయ పౌరుడు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తప్పనిసరిగా కలిగి ఉంటాడు. అయితే, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ప్రతి ఒక్కరూ ఆధార్, పాన్ కార్డులను లింక్ చేయాల్సి ఉంది. ఈ లింకింగ్ ప్రాసెస్ ఉచితంగా చేసుకోవడానికి మరో రెండు రోజులు మాత్రమే అవకాశం ఉంది. ఈ గడువు దాటితే పాన్ కార్డ్, ఆధార్ కార్డు ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిర్ణీత గడువులోగా పాన్-ఆధార్ కార్డ్ లింక్ చేయకపోతే పాన్ కార్డ్ సేవల్లో అంతరాయం ఏర్పడటం గానీ, ఆర్థిక లావాదేవీల నిలుపుదల, ఇతర సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే వీలైనంత త్వరగా పాన్-ఆధార్ కార్డ్ లింక్ చేసుకోండని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి.

**గడువు దాటితే ఏమవుతుంది..?**

ఏప్రిల్ 3, 2025న ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం అక్టోబర్ 1, 2024న లేదా ఆ తరువాత పాన్ కార్డులు పొందిన వారు డిసెంబర్ 31, 2025 లోపు తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలి. నిర్ణీత తేదీ కంటే ముందుగా పాన్ కార్డ్ తీసుకున్న వారికి లింక్ కోసం గడువును మే 31, 2024 వరకు మాత్రమే ఇచ్చింది ఆదాయపు పన్ను శాఖ. ఒకవేళ నిర్ణీత గడువులోగా ఆధార్-పాన్ కార్డు లింక్ చేయకపోవడం ఆర్థిక పరమైన లావాదేవీలు నిలిపివేయడం, ప్రభుత్వ పథకాలకు సంబంధించి యాక్సెస్ ఉండదు. అలాగే గడువు ముగిసిన తరువాత పాన్-ఆధార్ లింక్ చేయడానికి రూ. 1000 ఛార్జీ చేయబడుతుంది. గడువులోగా లింక్ చేసుకోవడానికయితే ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదు.

**పాన్-ఆధార్ లింక్ చేయకపోతే..**

నిర్ణీత గడువులోగా పాన్ కార్డ్-ఆధార్ కార్డు లింక్ చేయకపోతే.. ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమస్యలు ఎదుర్కునే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడం కష్టమవుతుంది. రిఫండ్‌లు నిలిచిపోయే అవకాశం ఉంది. పన్ను చెల్లింపులకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమవుతాయి. టీడీఎస్, టీసీఎస్ రేట్లు ఎక్కువగా పడే అవకాశం ఉంటుంది. అలాగే, పన్ను చెల్లింపుదారులు ఫామ్ 26ఏఎస్ కు యాక్సెస్‌ను కోల్పోయే అవకాశం ఉంది. టీడీఎస్, టీసీఎస్ సర్టిఫికెట్ పొందడంలో కష్టంగా ఉంటుంది.

బ్యాంకింగ్ పనులు, ఆర్థిక లావాదేవీలు కూడా ప్రభావితమవుతాయి. పాన్ కార్డ్ సేవలకు అంతరాయం ఏర్పడటం వలన బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయలేరు. క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డులను పొందలేరు. రూ. 50,000 కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేయలేరు. అలాగే రూ. 10,000 కంటే ఎక్కువ బ్యాంకు లావాదేవీలను నిర్వహించలేరు. కేవైసీ చేయడంలోనూ ఇబ్బందులు వస్తాయి. ప్రభుత్వ సేవలు పొందడంలోనూ కష్టతరమవుతుంది. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలలో పెట్టుబడులు నిలిపివేసే అవకాశం ఉంది. ఇలా అనేక రకాల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున నిర్ణీత గడువులోగా అంటే డిసెంబర్ 31వ తేదీలోపు పాన్ కార్డ్-ఆధార్ కార్డ్ తప్పకుండా లింక్ చేయండి.

# రోజూ రూ.10 తో డైలీ సిప్ పెట్టుబడులు పెట్టే అవకాశం

భారత్‌లో పెట్టుబడి సంస్కృతిని పెంచేందుకు ఫోన్‌పే వెల్త్ ప్లాట్‌ఫాం కొత్త అధ్యాయం ప్రారంభించింది. రోజుకు కేవలం రూ. 10 నుంచి మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టే 'డైలీ SIP (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ఫీచర్‌ను పరిచయం చేసింది.

ఈ ఫీచర్ ద్వారా సామాన్యులు కూడా సులభంగా దీర్ఘకాలిక ధన సృష్టికి బాటలు వేసుకోవచ్చు. ఫోన్‌పే యాప్‌లో UPI ఆటోపే ద్వారా ఆటోమాటిక్‌గా రోజువారీ పెట్టుబడులు చేయవచ్చు. ఈక్విటీ, గోల్డ్, మల్టీ-ఆసెట్ వంటి వివిధ ఫండ్లలో రిస్క్ స్థాయి ఆధారంగా ఎంచుకోవచ్చు. ఎప్పుడైనా మొత్తాన్ని పెంచడం, తగ్గించడం, పాజ్ చేయడం లేదా ఆపడం కూడా సాధ్యమే.




భారత మ్యూచువల్ ఫండ్ రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. అక్టోబర్ 2025లో నెలవారీ SIPలు రూ. 29,000 కోట్లు దాటాయి (AMFI డేటా). గత 5 ఏళ్లలో 30% వార్షిక వృద్ధి చెంది.. ఇప్పుడు 9.45 కోట్ల SIP అకౌంట్లు ఉన్నాయి. రూపీ కాస్ట్ యావరేజింగ్ ద్వారా మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ లభిస్తుందని ఫోన్‌పే వెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ హెడ్ నీలేష్ డి. నాయక్ తెలిపారు. ఫోన్‌పే వెల్త్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (SEBI రిజిస్టర్డ్) ద్వారా స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లు, వెల్త్ బాస్కెట్లు అందిస్తోంది.

# రక్షణ రంగంలో అదానీ గ్రూప్ రూ. 1.8 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు

అదానీ గ్రూప్ భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి భారీ పెట్టుబడులు పెట్టనుంది. రక్షణ ఉత్పత్తుల తయారీలో రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని గ్రూప్ యోచిస్తోందని సమాచారం. మానవరహిత అటానమస్ వ్యవస్థలు (యూఏవీలు), అడ్వాన్స్డ్ గైడెడ్ ఆయుధాలు, సెన్సర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీపై ఈ సంస్థ ప్రధాన దృష్టి సారించనుంది.

అలాగే కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కార్యకలాపాలు, విమాన ఇంజిన్ల నిర్వహణ-మరమ్మతు-ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌ఓ), శిక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై పనిచేయనుంది. అటానమస్ వ్యవస్థల వల్ల యుద్ధాల్లో సైనికుల ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చునేది అదానీ గ్రూప్ ఆలోచన.




ఈ ఏడాది గ్రూప్ రూపొందించిన 'ద్రిష్టి-10' యూఏవీలు ఇప్పటికే భారత నౌకాదళంలో చేరాయి. ఇవి నిఘా, పరిశీలన, ప్రత్యర్థి కదలికలను గుర్తించడంలో ఉపయోగపడుతున్నాయి.

అదానీ తయారు చేసిన ప్రత్యర్థి డ్రోన్లను పసిగట్టే వ్యవస్థలపై రక్షణ బలగాల పరీక్షలు పూర్తయ్యాయి. 2026లో అటానమస్ వ్యవస్థల ఉత్పత్తిని మరింత పెంచనుంది. ఈ పెట్టుబడులతో భారత్ రక్షణ రంగంలో స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) లక్ష్యానికి దగ్గరవుతుందని భావిస్తున్నారు.

# ఛాన్స్ ఎవరికి దక్కేనో..?

న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కు భారత జట్టు ఎంపిక ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జట్టులో వికెట్ కీపర్ స్థానం కోసం ముగ్గురు స్టార్ ప్లేయర్స్ మధ్య గట్టి పోటీ నెలకొంది. సీనియర్ ప్లేయర్ రిషబ్ పంత్, యంగ్ డైనమైట్ ఇషాన్ కిషన్, యువ సంచలనం ధ్రువ్ జురెల్, ఈ ముగ్గురూ రేసులో ఉన్నారు. అయితే ఇది కేవలం వికెట్ కీపర్ సమస్య కాదు, జట్టులో ఎవరి రోల్ ఏంటి అనే దానిపైనే సెలెక్షన్ ఆధారపడి ఉంటుంది. ఓపెనర్ కు బ్యాకప్ కావాలా? లేక మిడిల్ ఆర్డర్ లో ఫినిషర్ కావాలా? అనే క్లారిటీ సెలెక్టర్లకు ఉండాలి. ప్రస్తుతం ఈ ముగ్గురి ఫామ్ ను బట్టి చూస్తే, తుది జట్టులో ఎవరికి చోటు దక్కే అవకాశం ఉందో ఓ లుక్కేద్దాం.యువ కెరటం ధ్రువ్ జురెల్ దేశవాళీ క్రికెట్?లో దుమ్మురేపుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఉత్తర ప్రదేశ్ తరఫున ఆడుతున్న జురెల్, తన బ్యాటింగ్ విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. ఆడిన మొదటి మూడు ఇన్నింగ్స్ ల్లోనే ఏకంగా 307 పరుగులు చేసి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. బంతిని ఫుట్ బాల్ లా చూస్తూ.. క్రీజులో నిలదొక్కుకోవడం, అవసరమైనప్పుడు గేర్ మార్చి హిట్టింగ్ చేయడం జురెల్ లో కనిపిస్తున్న స్పెషాలిటీ. అయితే వన్డే జట్టులోకి నేరుగా ఎంపికవడానికి ఇది సరిపోతుందా అనేది ప్రశ్న. లిస్ట్ A క్రికెట్ లో అతనికి ఇంకా పెద్దగా అనుభవం లేదు. భవిష్యత్తు కోసం జురెల్ ను సిద్ధం చేయవచ్చు కానీ, ప్రస్తుతానికి ప్రధాన కీపర్ గా అతను ఇంకా నిరూపించుకోవాల్సింది ఉంది.రిషబ్ పంత్ అంటేనే మ్యాచ్ విన్నర్ అనే పేరుంది. 31 వన్డేల్లో 33.50 సగటుతో 871 పరుగులు చేసిన మంచి ట్రాక్ రికార్డ్ అతని సొంతం. టాలెంట్ పరంగా చూస్తే పంత్?కు ఎవరూ సాటిరారు. కానీ ప్రస్తుత ఫామ్ మాత్రం అతనికి మైనస్?గా మారింది. విజయ్ హజారే ట్రోఫీలో గుజరాత్‌పై చేసిన 70 పరుగులు మినహా మిగతా రెండు ఇన్నింగ్స్ ల్లో పంత్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఒకవైపు పోటీదారులు సెంచరీలతో చెలరేగుతుంటే, పంత్ మాత్రం నిలకడ లేమితో సతమతమవుతున్నాడు. కేవలం గత రికార్డులను చూసి ఎంపిక చేయడం కంటే, ఇప్పుడు ఎవరు టచ్?లో ఉన్నారనేది ముఖ్యం కాబట్టి పంత్ ఈ రేసులో కాస్త వెనుకబడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ఆప్షన్లలో ఇషాన్ కిషన్ క్లియర్ ఫేవరెట్?గా కనిపిస్తున్నాడు. ఇప్పటికే 27 వన్డేల్లో 42.40 సగటుతో ఏకంగా 933 పరుగులు చేసిన అనుభవం ఇషాన్ సొంతం.







ఇందులో ఒక అద్భుతమైన డబుల్ సెంచరీ కూడా ఉంది. ఇక రీసెంట్ ఫామ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకపై ఆరో నంబర్?లో బ్యాటింగ్?కు వచ్చి కేవలం 39 బంతుల్లోనే 125 పరుగులు బాది రికార్డు సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇషాన్ ప్రస్తుతం బౌలర్లను ఒక ఆట ఆడుకుంటున్నాడు.భారత జట్టుకు మిడిల్ ఆర్డర్?లో ఒక లెఫ్ట్ హ్యాండర్ అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో కూడా ఇషాన్ కిషన్?కే ఎక్కువ మార్కులు పడుతున్నాయి. రిషబ్ పంత్ కూడా లెఫ్ట్ హ్యాండరే అయినప్పటికీ, ఇషాన్ కిషన్ గేమ్ టెంపోను మార్చే విధానం అద్భుతం. అతను వార్మ్ అప్ అవ్వడానికి ఎక్కువ బంతులు తీసుకోడు, వచ్చిన వెంటనే అటాక్ మొదలుపెడతాడు. అంతేకాకుండా 6వ స్థానంలో బ్యాటింగ్ చేసి సక్సెస్ అవ్వడం ద్వారా, జట్టుకు అవసరమైన ఫ్లెక్సిబిలిటీని ఇస్తున్నాడు. అంటే ఓపెనర్ గానే కాకుండా ఫినిషర్ గా కూడా తాను పనికొస్తానని నిరూపించుకున్నాడు. ఇక మొత్తంగా చూస్తే ప్రస్తుతం అందరి ఫోకస్ ఇషాన్ కిషన్ వైపే ఉంది. మిడిల్ ఆర్డర్‌లో లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కుదిరేలా చూడాలన్నా, వేగంగా ఆడే సత్తా ఉన్నవాళ్లు కావాలన్నా ఇషానే బెస్ట్ ఛాయిస్. జురెల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, అతన్ని ట్రావెల్ రిజర్వ్?గా లేదా బ్యాకప్‌గా ఉంచే అవకాశం ఉంది. ఇక పంత్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేసి మళ్లీ గాడిలో పడేవరకు వేచి చూడక తప్పదు. కాబట్టి న్యూజిలాండ్ సిరీస్‌కు ఇషాన్ కిషన్‌కే వికెట్ కీపర్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చూడాలి మరి సెలక్టర్లు ఎలాంటి ట్విస్టులు ఇస్తారో.

# శ్రేయస్ అయ్యర్ రీ-ఎంట్రీకి బ్రేకులు!



టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అభిమానులకు ఇది మింగుడుపడని వార్త. ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడిన అయ్యర్, త్వరలోనే జట్టులోకి వస్తాడని అందరూ ఆశించారు. కానీ అతని కోలుకునే ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు అయ్యర్ అందుబాటులో ఉండటం కష్టమేనని తెలుస్తోంది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం అతని ఫిట్‌నెస్‌పై కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం బెంగళూరులో శిక్షణ పొందుతున్న శ్రేయస్ అయ్యర్, నెట్స్‌లో బాగానే బ్యాటింగ్ చేస్తున్నాడు. కానీ ఆస్ట్రేలియాలో తగిలిన గాయం కారణంగా అతని శరీర బరువు దాదాపు 6 కిలోలు తగ్గిపోయింది. బరువు మళ్ళీ పెరుగుతున్నప్పటికీ అతని శరీరంలో కండరాల సాంద్రత తగ్గిపోయిందని వైద్యులు గుర్తించారు. దీనివల్ల అతని శారీరక బలంపై ప్రభావం పడిందని, పూర్తి స్థాయిలో కోలుకోకుండా మైదానంలోకి దింపడం రిస్క్ అని బీసీసీఐ భావిస్తోంది. అయ్యర్ వన్డే ఫార్మాట్‌లో అత్యంత కీలక ఆటగాడు కావడంతో, అతని విషయంలో తొందరపడకూడదని బోర్డు నిర్ణయించుకుంది. ఫిట్‌నెస్ నిరూపించుకోవడానికి శ్రేయస్ అయ్యర్ ముంబై తరపున విజయ్ హజారే ట్రోఫీ ఆడాల్సి ఉంది. ఫిబ్రవరి 3, 6 తేదీల్లో జరిగే లీగ్ మ్యాచ్‌ల్లో అతను ఆడతాడని అందరూ భావించారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అతను ఈ టోర్నీలో పాల్గొనే అవకాశం లేదని సమాచారం. జనవరి 9 నాటికి అతనికి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లభించే అవకాశం ఉంది, అయితే ఇది న్యూజిలాండ్ సిరీస్ ప్రారంభానికి కేవలం రెండు రోజుల ముందు మాత్రమే కావడం గమనార్హం. మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా నేరుగా అంతర్జాతీయ మ్యాచ్‌లోకి తీసుకోవడం సెలెక్టర్లకు సవాలుగా మారింది. ఒకవేళ శ్రేయస్ అయ్యర్ న్యూజిలాండ్ సిరీస్‌కు దూరం అయితే, నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి రుతురాజ్ గైక్వాడ్ సిద్ధంగా ఉన్నాడు. ఇటీవల సౌతాఫ్రికా పై అద్భుతమైన సెంచరీతో రుతురాజ్ అదిరిపోయే ఫామ్‌లో ఉన్నాడు. అయ్యర్ గైర్హాజరీలో రుతురాజ్‌కు తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం. శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లో ఇప్పటికే పలుమార్లు వెన్ను గాయంతో బాధపడ్డారు. అందుకే ఈసారి మెడికల్ టీమ్ మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.

# టోర్నీ నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన షాహీన్ షా అఫ్రిదీ




పాకిస్థాన్ స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదీకి ఆస్ట్రేలియా గడ్డపై గట్టి షాక్ తగిలింది. బిగ్ బాష్ లీగ్?లో మెరుపులు మెరిపిద్దామని వెళ్లిన ఈ స్పీడ్‌స్టర్, అనూహ్యంగా గాయం బారిన పడి టోర్నీ నుంచి అర్ధాంతరంగా వైదొలిగాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆదేశాల మేరకు అతను ఆస్ట్రేలియాను వీడి స్వదేశానికి బయలుదేరాడు. ఫిబ్రవరి-మార్చి నెలల్లో భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ దృష్ట్యా రిస్క్ తీసుకోవడం ఇష్టం లేక పీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. బ్రిస్బేన్ హీట్ జట్టు తరపున ఆడుతున్న షాహీన్ అఫ్రిదీకి, డిసెంబర్ 27న అడిలైడ్ స్ట్రైకర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయమైంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో 14వ ఓవర్లో అతని కుడి మోకాలికి తీవ్రమైన నొప్పి రావడంతో, అతను మైదానంలోనే కుంటుతూ కనిపించాడు. కనీసం తన ఓవర్‌ను కూడా పూర్తి చేయలేక మధ్యలోనే డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. మోకాలి గాయం తీవ్రతను గమనించిన పీసీబీ, అతనికి సరైన చికిత్స అందించేందుకు వెంటనే పాకిస్థాన్‌కు తిరిగి రావాలని కోరింది. తన నిష్క్రమణపై షాహీన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "బ్రిస్బేన్ హీట్ టీమ్, ఫ్యాన్స్ చూపించిన ప్రేమకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఊహించని గాయం వల్ల బోర్డు నన్ను వెనక్కి పిలిచింది. త్వరలోనే మళ్ళీ మైదానంలోకి వస్తానని ఆశిస్తున్నాను. అప్పటి వరకు నా టీమ్‌కు బయట నుంచే మద్దతు ఇస్తాను" అని పేర్కొన్నాడు. ఫిబ్రవరిలో జరగబోయే వరల్డ్ కప్ నాటికి షాహీన్ ఫిట్‌నెస్ పాక్ జట్టుకు చాలా కీలకం. అందుకే పీసీబీ మెడికల్ టీమ్ పర్యవేక్షణలో అతనికి చికిత్స అందించనున్నారు. నిజానికి ఈసారి బిగ్ బాష్ లీగ్ షాహీన్ అఫ్రిదీకి అస్సలు కలిసిరాలేదు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో అతను కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయగలిగాడు. పైగా అతని ఎకానమీ రేటు 11.19గా ఉంది, అంటే బ్యాటర్లు అతడిని చితక్కొట్టారు. డెబ్యూ మ్యాచ్‌లోనే వరుసగా రెండు బీమర్లు (హై ఫుల్ టాస్) వేసినందుకు అంపైర్లు అతడిని బౌలింగ్ నుంచి తొలగించారు. ఆరంభంలోనే అపశ్రుతి ఎదురైన షాహీన్, ఇప్పుడు గాయంతో సీజన్ మొత్తానికి దూరం కావడం అతని ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేస్తోంది.

# ఫిఫా నుంచి టీ20 ప్రపంచకప్ వరకు పూర్తి షెడ్యూల్ విడుదల

క్రీడాభిమానులకు నూతన సంవత్సరం 2026 ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ నుంచి ప్రపంచం మెచ్చే ఫిఫా వరల్డ్ కప్ వరకు ఎన్నో ప్రతిష్టాత్మక టోర్నీలకు 2026 వేదికగా నిలవనుంది. వింటర్ ఒలింపిక్స్‌తో పాటు కామన్వెల్త్ గేమ్స్ కూడా 2026లోనే సందడి చేయనున్నాయి. మరికొద్ది గంటల్లో యావత్ ప్రపంచం కొత్త సంవత్సరానికి స్వాగతం పలకనుంది.ఈ శుభ సందర్భంగా మైఖేల్ తెలుగు.. తమ అభిమానుల కోసం స్పోర్ట్స్ క్యాలెండర్ 2026ను మీ ముందుకు తీసుకొచ్చింది. పలు ప్రపంచకప్ టోర్నీల నేపథ్యంలో 2026ను అభిమానులు ప్రపంచకప్ నామ సంవత్సరంగా గుర్తు పెట్టుకోనున్నారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో షెఫాలీ వర్మ జైత్రయాత్ర..




అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) తాజాగా విడుదల చేసిన మహిళా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు సత్తా చాటారు. ముఖ్యంగా టీమిండియా డాషింగ్ ఓపెనర్ షెఫాలీ వర్మ తన అద్భుత ఫామ్‌తో ర్యాంకింగ్స్‌లో భారీ జంప్ చేసింది. శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో పరుగుల వరద పారించిన షెఫాలీ, ఇప్పుడు తన తోటి క్రీడాకారిణి స్మృతి మంధాన స్థానానికే ఎసరు పెడుతోంది.శ్రీలంకతో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో షెఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. మొదటి నాలుగు మ్యాచ్‌ల్లోనే ఆమె ఏకంగా 236 పరుగులు సాధించింది. ఇందులో మూడు వరుస హాఫ్ సెంచరీలు ఉండటం విశేషం. 118 సగటుతో, 185కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షెఫాలీ, ఈ సిరీస్‌లో 200 పరుగుల మైలురాయిని దాటిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. ఆమె బ్యాట్ నుంచి 36 ఫోర్లు, 5 సిక్సర్లు జాలువారాయి. ఈ నిలకడైన ఆటతీరు ఆమెకు ర్యాంకింగ్స్‌లో పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది.తాజా ర్యాంకింగ్స్‌లో షెఫాలీ వర్మ ఏకంగా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 10వ స్థానం నుంచి 6వ స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం షెఫాలీ 736 రేటింగ్ పాయింట్లతో ఉండగా, మూడో స్థానంలో ఉన్న స్మృతి మంధాన 767 పాయింట్లతో ఉంది. వీరిద్దరి మధ్య వ్యత్యాసం కేవలం 31 పాయింట్లే. షెఫాలీ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే త్వరలోనే స్మృతిని వెనక్కి నెట్టి టాప్-3లోకి దూసుకెళ్లే అవకాశం ఉంది. మరోవైపు టాప్-10లో భారత్ నుంచి ముగ్గురు బ్యాటర్లు చోటు దక్కించుకున్నారు. స్మృతి (3), షెఫాలీ (6) తో పాటు జెమీమా రోడ్రిగ్స్ 10వ స్థానంలో నిలిచింది.మహిళల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా స్టార్ బెత్ మూనీ 794 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వెస్టిండీస్ ఆల్ రౌండర్ హేలీ మాథ్యూస్ 774 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 615 పాయింట్లతో 15వ స్థానంలో స్థిరంగా కొనసాగుతోంది. భారత ఓపెనర్లు ఇద్దరూ టాప్-5లో పోటీ పడుతుండటం టీమిండియాకు రాబోయే వరల్డ్ కప్ ముందు శుభపరిణామంగా కనిపిస్తోంది.

# విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ పరాజయాల పరంపర

## వరుసగా మూడో మ్యాచ్‌లోనూ హైదరాబాద్ ఓటమి

విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ హైదరాబాద్ ఓటమిపాలైంది. సోమవారం అస్సాంతో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. దాంతో ఈ టోర్నీలో హ్యాట్రిక్ పరాజయాన్ని మూటగట్టుకుంది.



ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 310 పరుగులు చేసింది. రాహుల్ సింగ్(71 బంతుల్లో 14 ఫోర్లతో 79), అభిరత్ రెడ్డి(66 బంతుల్లో 6 ఫోర్లతో 54), నితేష్ రెడ్డి(25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 53) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం అస్సాం 49.3 ఓవర్లలో 6 వికెట్లకు 314 పరుగులు చేసి గెలుపొందింది. శివ్‌శంకర్ రాయ్(112) సెంచరీతో చెలరేగగా.. సౌరవ్ దిహింగియా(91), డెనిష్ దాస్(54) హాఫ్ సెంచరీలతో రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో చామ మిలింద్(3/68) మూడు వికెట్లు తీయగా.. వరుణ్ గౌడ్ ఒక వికెట్ పడగొట్టాడు. వరుసగా పరాజయాలతో పాయింట్స్ టేబుల్‌లో హైదరాబాద్ 7వ స్థానంలో నిలిచింది. బుధవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో బరోడాతో హైదరాబాద్ తలపడనుంది. చివరి మూడు మ్యాచ్‌లను హైదరాబాద్ గెలిచినా టోర్నీలో ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. గత మ్యాచ్‌లో గెలుపొందిన ఆంధ్ర.. మరో పరాజయాన్ని చవిచూసింది. ఒడిశాతో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 49.2 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్(66) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. సౌరభ్ కుమార్(47) పర్వాలేదనిపించాడు. కెప్టెన్ నితీష్ కుమార్ రెడ్డి(6) తీవ్రంగా నిరాశపర్చాడు.అనంతరం ఒడిశా 43.4 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు చేసి గెలుపొందింది. గోవింద్ పొద్దార్(89), ఓం టీ ముండే(91) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారయణ రాజు(2/49) రెండు వికెట్లు తీయగా.. నితీష్ కుమార్ రెడ్డి తలో వికెట్ తీసాడు.

# అభిషేక్ శర్మనే టీమిండియా ప్లేయర్ ఆఫ్ ది ఇయర్

## టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్





ఈ ఏడాది భారత క్రికెట్ జట్టుకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వైట్ బాల్ క్రికెట్‌లో దుమ్మురేపిన భారత జట్టు.. టెస్ట్ క్రికెట్‌లో మాత్రం తీవ్రంగా నిరాశపర్చింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025తో పాటు ఆసియాకప్ 2025ను భారత్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్‌ను సమం చేసుకున్న భారత జట్టు.. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. ఈ ఓటమి ఈ ఏడాది భారత జట్టుకు చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ, రోహిత్ శర్మలు.. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగారు. ఒక్క ఫార్మాట్‌లోనే ఆడినా.. అద్భుత ప్రదర్శన కనబర్చారు. అయితే టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాత్రం ఈ ఏడాది భారత్ తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాడిగా అభిషేక్ శర్మ పేరును సూచించాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా అభిషేక్ శర్మపై ప్రశంసల జల్లు కురిపించాడు. అతను టీమిండియా తదుపరి ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడని తెలిపాడు. అభిషేక్ శర్మ వన్డే ఫార్మాట్‌లో ఆడితే చూడాలని ఉందని కూడా చెప్పాడు. 'ఈ ఏడాది భారత క్రికెట్‌లోకి కేవలం అభిషేక్ శర్మ మాత్రమే రాలేదు. భారత క్రికెట్ తుదపరి తరం ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు. ఈ ఏడాది భారత్ తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాడు ఎవరైనా ఉన్నారంటే.. అది కచ్చితంగా అభిషేక్ శర్మనే. అతను ఈ ఏడాది అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. తన విధ్వంసంతో భారత జట్టు పవర్ ప్లే బ్యాటింగ్ శైలినే మార్చేసాడు. అతని ప్రదర్శన అసాధారణంగా ఉంది. అతను వన్డే ఫార్మాట్‌లో ఆడితే చూడాలని ఉంది. బహుషా అతను ఈ ఏడాది పురుషుల టీమ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలుస్తాడని నేను భావిస్తున్నా.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.ఈ ఏడాది టీ20 ఫార్మాట్‌లో మాత్రమే టీమిండియాకు ప్రాతినిథ్యం వహించిన అభిషేక్ శర్మ.. 21 మ్యాచ్‌ల్లో 42.95 సగటు, 193.46 స్ట్రైక్‌రేట్‌తో 859 పరుగులు చేశాడు. ఈ ఏడాది టీ20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. భారత గెలిచిన ఆసియా కప్ 2025 జట్టులో కూడా అభిషేక్ శర్మ సభ్యుడిగా ఉన్నాడు. ఈ టోర్నీలో 7 మ్యాచ్‌ల్లో 200 స్ట్రైక్‌రేట్‌తో 214 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# రోజూ వ్యాయామమే ఫిట్‌నెస్ రహస్యం

## వందో సినిమాపై నాగ్ ప్రత్యేక దృష్టి

టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలు ఉన్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మథుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జునే. 66 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా కనిపిస్తూ యంగ్ హీరోలకు పోటీనిస్తుంటారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ సీక్రెట్ పంచుకున్నారు. తాను ఎప్పుడూ కడుపు మాడ్చుకొని డైటింగ్ చేయలేదు. వేళకు తింటాను. దానితో పాటు రోజూ కచ్చితంగా ఉదయం వ్యాయామం చేస్తాను. ఇప్పటికి 45 ఏళ్లుగా నేను జిమ్ చేస్తున్నాను. ఏరోజూ కూడా మిస్ అవలేదు. ఎప్పుడైనా ఆరోగ్యం బాలేక.. వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటే తప్ప మిగతా రోజుల్లో కచ్చితంగా జిమ్‌కు వెళ్తా. అన్నిటికంటే ముఖ్యంగా నేను ఏ విషయాన్నైనా పాజిటివ్‌గా తీసుకుంటాను. ఎలాంటి సమస్య అయినా నన్ను నేను నిరుత్సాహపరుచుకోను అని చెప్పారు. ఇక 2025 గురించి నాగార్జున మాట్లాడుతూ తాను ఈ ఏడాది ఎంతో ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్‌గానూ చాలా సంతోషంగా ఉన్నానన్నారు. ఇంతకుమించి తానేం కోరుకోవడం లేదన్నారు. ఈ సంవత్సరం అఖిల్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారని.. అలాగే నాగచైతన్య- శోభిత ఒక్కటై ఏడాది పూర్తయిందన్నారు. వాళ్లను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాగార్జున కెరీర్ విషయానికొస్తే.. ఈ ఏడాదిలో ఆయన రెండు సినిమాల్లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'కూలీ'లో ఆయన నటించిన సైమన్ పాత్రకు మంచి ఆదరణ సొంతమైంది. అలాగే కుబేరలో మాజీ సీబీఐ అధికారి దీపక్‌తేజ్‌గా కనిపించి మెప్పించారు. ప్రస్తుతం తన 100వ సినిమా పనుల్లో నాగార్జున బిజీగా ఉన్నారు. అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాగార్జున, ఆ తర్వాత తనకంటూ ప్రత్యేకమైన శైలితో స్టార్ హీరోగా ఎదిగారు. రొమాంటిక్ హీరోగా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, యాక్షన్, మాస్, భక్తిరస చిత్రాల వరకు అన్ని జానర్లలో నటిస్తూ ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకున్న నాగ్ ఇప్పుడు తన కెరీర్‌లో అత్యంత కీలకమైన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. 'నా సామిరంగ' సినిమా తర్వాత వెంటనే 100వ సినిమా మొదలుపెట్టాల్సి ఉన్నా, ఇది మైలురాయి చిత్రం కావడంతో నాగార్జున ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాస్త ఆలస్యం చేశారు. అయితే ఈ గ్యాప్‌లో ఆయన ఖాళీగా మాత్రం లేరు. ఇతర హీరోల సినిమాల్లో కీలక పాత్రలు, విలన్ రోల్స్ చేయడంతో పాటు బిగ్ బాస్ లాంటి షోలతో కూడా ఆడియన్స్‌కు ఎప్పటికప్పుడు దగ్గరగానే ఉన్నారు. ఇప్పుడు 100వ సినిమా విషయంలో పూర్తిగా ఎ÷-లాన్‌తో ముందుకు వెళ్తున్నారు. ఈ మైలురాయి చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ కేరళలో జరగనున్నట్లు సమాచారం.





# బ్యాటిల్ ఆఫ్ గల్వాన్

## మూవీపై చైనా అక్కసు

బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. ఇటీవల సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయగా.. ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది. తెలంగాణకు చెందిన కర్నల్ బిక్కుమల్ల సంతోష్‌బాబుతో పాటు 20 మంది మన సైనికులు వీరమరణం పొందారు. ఇదే ఈ కథకు మూలంగా తెలుస్తోంది. అయితే, దీనిపై తాజాగా చైనా అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' అక్కసు వెళ్లగక్కింది. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ నోరుపారేసుకుంది. ఈ మేరకు తమ సంపాదకీయంలో భారత సినిమాపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ చిత్రం జాతీయవాద మెలోడ్రామా అని చైనా ఆరోపించింది. గల్వాన్‌లో ఘర్షణలకు భారత బలగాలే కారణమంటూ తమ దేశాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేసింది. భారత దళాలు అక్రమంగా తమ భూభాగంలోకి చొరబడి.. చైనా సైనికులపై దాడి చేశాయంటూ అసత్యాలు వల్లెవేసింది. తమ దేశానికి చెడ్డపేరు తెచ్చేందుకు భారత్ వాస్తవాలను వక్రీకరించి అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించిందంటూ బూటకపు వ్యాఖ్యలు చేసింది. చైనా సార్వభౌమ భూభాగాన్ని రక్షించుకోవాలనే మా సైన్యం దృఢ సంకల్పాన్ని ఈ చిత్రం కదిలించలేదు అంటూ చైనా సైనిక నిపుణుడు సాంగ్ జాంగ్‌పింగ్ వ్యాఖ్యలను ఈ కథనంలో గ్లోబల్ టైమ్స్ ప్రస్తావించింది. ఐదేళ్ల క్రితం 2020 జూన్‌లో భారత్-చైనా సరిహద్దుల్లోని గల్వాన్ ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. భారత జవాన్లపై చైనా సైన్యం మెరుపుదాడికి దిగడంతో మన దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ వీరోచిత పోరాటంలో తెలంగాణకు చెందిన కర్నల్ బిక్కుమల్ల సంతోష్‌బాబుతో పాటు 20 మంది మన సైనికులు వీరమరణం పొందారు. చైనా వైపు కూడా ప్రాణనష్టం ఉన్నప్పటికీ.. దానిపై బీజింగ్ స్పష్టతనివ్వలేదు. ఈ ఘర్షణలను ఆధారంగా చేసుకునే 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో సల్మాన్ ఖాన్.. కర్నల్ సంతోష్‌బాబుగా నటిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రాంగద సింగ్ కథానాయిక. చావుకి భయపడడం ఎందుకు? అది అనివార్యం', 'సైనికులారా గుర్తుంచుకోండి.. మీకు గాయమైతే దాన్ని పతకంలా భావించండి. మృత్యువు ఎదురైతే వందనం చేసి 'ఈరోజు కాదు.. బహుశా మరోసారి' అని చెప్పండి అంటూ టీజర్‌లో సల్మాన్ చెప్పిన సంభాషణలు ఆకట్టుకున్నాయి.

# చిరంజీవి కామెడీ టైమింగ్‌ను చూస్తారు

## 'మన శంకరవరప్రసాద్ గారు' పై అనిల్ రావిపూడి



ఈ సంక్రాంతికి రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ఆడియన్స్‌ను కచ్చితంగా అలరిస్తాడని దర్శకుడు అనిల్ రావిపూడి భరోసాగా ఉన్నారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రమిది. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా మూడో పాటను రిలీజ్ చేయనున్నారు. గుంటూరులో ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో అనిల్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిలో ఉన్న కామెడీ టైమింగ్ మరోసారి తెరపై చూస్తారు. ఆయన ఈ చిత్రం కోసం ఎంతో శ్రమపడి లుక్ మార్చుకున్నారు. చూసినవారంతా చరణ్‌కు తమ్ముడా అని అడుగుతున్నారు. ఈ సినిమాకు ఆయన లుక్ అలా రావడం నా అదృష్టం. ఇండస్ట్రీకి చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ, నాగార్జున నాలుగు మూలస్తంభాలు. వీరిలో ఏ ఇద్దరు కలిసి నటించినా అది గొప్పగా ఉంటుంది. 'మన శంకరవరప్రసాద్ గారు'లో వెంకటేశ్, చిరంజీవి కలిసి సందడి చేస్తారు' అని చెప్పారు. సంక్రాంతి అంటేనే సినిమాల పండగ. ఈసారి 'రాజాసాబ్'తో సందడి మొదలవుతుంది. దానికోసం నేను కూడా ఎదురుచూస్తున్నా. వాళ్లు ప్రారంభించిన పండగ సందడిని మేం కొనసాగిస్తాం.సినిమాను ఆదరించాలా, లేదా అనేది ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది. రివ్యూలు వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. వాళ్లను నేను ఎప్పుడూ తప్పు పట్టను. ప్రేక్షకులను అలరించడమే నా లక్ష్యం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఫ్యాన్ వార్‌లు సాధారణం అయ్యాయి. ఏ హీరో సినిమా విడుదలైనా అవి జరుగుతూనే ఉంటాయి. అందుకే ట్రోల్ చేస్తుంటారు. వాటికి మనం స్పందించకుండా ఉంటే బాగుంటుంది. ఒకప్పుడు మనం అందరి చిత్రాలను ఆదరించాం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సోషల్ మీడియా వాడకం ఎక్కువయ్యాక ఈ ట్రోలింగ్ ఎక్కువైంది. పెద్ద హీరోల తర్వాతే మేము' అని అనడం ప్రభాస్ గొప్పతనానికి నిదర్శనం. అలా ఆలోచిస్తారు కాబట్టే ఆయన ఈరోజు పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. మేమందరం 'రాజాసాబ్'ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.



# రాజాసాబ్ పెద్ద మనసు

## రిద్ధికిచీర బహుకరించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, రిద్ధి కుమార్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్' పై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్లు, అప్‌డేట్స్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.ఈ క్రమంలో రీసెంట్‌గా హైదరాబాద్‌లో జరిగిన 'ది రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్లో హీరోయిన్ రిద్ధి కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కో హీరోయిన్లు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్‌తో కలిసి సందడి చేసిన రిద్ధి, వేదికపై మాట్లాడుతూ తాను కట్టుకున్న చీరను ప్రభాస్ గిఫ్ట్‌గా ఇచ్చారని చెప్పడంతో ఒక్కసారిగా హాల్ మొత్తం ఈలలు, చప్పట్లతో మార్మోగిపోయింది. ఈ విషయం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో నెటిజన్లు తెగ చర్చించుకున్నారు. 'ప్రభాస్ భోజనాలే కాదు? చీరలు కూడా గిఫ్ట్ ఇస్తారా?', 'రిద్ధి అంత స్పెషల్ ఏంటి?' అంటూ సరదా కామెంట్లు పెట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో రిద్ధి కుమార్ ఆ చీర వెనుక ఉన్న కథను వివరించారు. రిద్ధి మాట్లాడుతూ? దీపావళి తర్వాత 'రాజా సాబ్' సెట్స్‌లో ఫస్ట్ టైమ్ అడుగుపెట్టాను. అది అక్టోబర్ 23. అదే రోజు ప్రభాస్ గారి బర్త్ డే. ఆయన అక్కడే ఉన్నారు. నేను ఆయనకు గిఫ్ట్ ఇవ్వాలని అనుకున్నాను. రెండు రోజుల తర్వాత దీపావళి పార్టీ జరిగింది. ఆ సమయంలో మారుతి సర్ 'ప్రభాస్ మీతో మాట్లాడతారు' అన్నారు. అలా తొలిసారి ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను' అని తెలిపారు. ఆ కాల్ సమయంలో నేను ముంబైలో ఉన్నాను. బర్త్‌డే గిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నానని చెప్పాను. ఆయన ఓకే అన్నారు. అదే సమయంలో నాకు కూడా దీపావళి గిఫ్ట్ ఉందని చెప్పారు. సెట్స్‌కు వెళ్లేటప్పుడు నేను కర్ణుడి కథ ఆధారంగా శివాజీ సావంత్ రాసిన 'మృత్యుంజయ్' పుస్తకాన్ని గిఫ్ట్‌గా తీసుకెళ్లాను అని రిద్ధి వెల్లడించారు. కర్ణుడి నేచర్, ప్రభాస్ గారి నేచర్ చాలా సిమిలర్‌గా అనిపిస్తాయి. ప్రభాస్ అంటే రాజులాంటి వ్యక్తి. నేను బుక్ ఇచ్చినప్పుడు ఆయన సర్ప్రైజ్ అయ్యారు. ఆ తర్వాత 'కల్కి' సినిమా చూసినప్పుడు ఆ సింక్ నాకు ఇంకా బాగా అర్థమైంది. ఆ తర్వాత ప్రభాస్ గారు నాకు చీర గిఫ్ట్ ఇచ్చారు. అది చాలా లక్కీగా ఉంది. మూడేళ్ల పాటు దాచిపెట్టుకున్నాను. ఇప్పుడు 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అదే చీర కట్టుకున్నాను' అని చెప్పుకొచ్చారు. అయితే రిద్ధి కుమార్ ? ప్రభాస్ ఫ్రెండ్‌షిప్ ఇప్పటిది కాదు. ఇప్పటికే 'రాధేశ్యామ్' సినిమాలో కలిసి నటించిన ఈ జంట, ఇప్పుడు 'ది రాజా సాబ్' లో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు.



# మృణాల్ కామెంట్స్.. తెలుగు ఆడియన్స్ హ్యాపీ..!

టాలీవుడ్ లో ఛాన్స్ లు అందుకుని ఇక్కడ క్రేజ్ తో నేషనల్ వైడ్ గా పాపులారిటీ తెచ్చుకున్న భామలంతా కూడా తెలుగు సినిమాల వల్ల తమకు జరిగిన మేలు మర్చిపోతుంటారు. తనలో టాలెంట్ ఉంది కాబట్టే వాళ్లు ఛాన్స్ ఇచ్చారంటూ కొందరు కాస్త అతి చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ టాలీవుడ్ వల్ల తన కెరీర్ టర్న్ తీసుకుందని చెబుతూ తెలుగు పరిశ్రమ మీద తన ప్రేమను చూపించింది మృణాల్ ఠాకూర్. హిందీలో సీరియల్స్ చేసి ఆ తర్వాత సినిమాల్లో అవకాశాలు అందుకుంది మృణాల్ ఠాకూర్. ఐతే తెలుగులో సీతారామం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ఈ అమ్మడికి ఇక్కడ మంచి పాపులారిటీ వచ్చింది. బాలీవుడ్ లో తనతో లవ్ స్టోరీస్ తీయలేదు తనని కేవలం గ్లామర్ గానే చూపించారని అప్పట్లో ఒక ఇంటర్వ్యూలో చెప్పిన మృణాల్ ఠాకూర్ మరోసారి తెలుగు పరిశ్రమ మీద తన అభిమానాన్ని చెప్పింది. తెలుగు సినిమాల వల్లే తనకు గుర్తింపు వచ్చిందని వాటి వల్లే తన కెరీర్ మారిపోయిందని అంటుంది. బాలీవుడ్ మేకర్స్ ఏమైనా అనుకుంటారన్న డౌట్ లు ఏమి లేకుండా టాలీవుడ్ మీద మృణాల్ చూపిస్తున్న ఈ ప్రేమకు తెలుగు ఆడియన్స్ కూడా ఫిదా అవుతున్నారు.

ఎంతోమంది ముంబై భామలు తెలుగులో స్టార్ క్రేజ్ వచ్చినా కూడా తెలుగు సినిమాలను, టాలీవుడ్ ని చిన్నచూపు చూసిన సందర్భాలు ఉన్నాయి. వాళ్ల కెరీర్ లో హిట్ సినిమాలు తెలుగులో ఉన్నా కూడా వాటిని వదిలేసి మిగతా భాషల్లో యావరేజ్ సినిమాల గురించి డిస్కషన్స్ పెట్టే వాళ్లు ఉన్నారు. కానీ వాళ్లందరికీ షాక్ ఇస్తూ మృణాల్ తెలుగు పరిశ్రమ మీద చేస్తున్న కామెంట్స్ తెలుగు ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తున్నాయి.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861